ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-11-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 273 పేజీలు: 10+4 వెల: 6.50



పరిశోధనలే దేశ భవిష్యత్తు: ప్రధాని మోడీ
అణ్వాయుధాలను పాక్ పరీక్షిస్తోంది: ట్రంప్
5




ఎస్ఎల్‌బిసిని పరిశీలించిన అనంతరం మీడియాతో సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్

# పర్సంటేజీలు రాలేదని..

## ఎస్ఎల్‌బిసిని పక్కనబెట్టారు

- కెసిఆర్, హరీష్‌లు ఎస్ఎల్‌బిసిని పట్టించుకోలే
- పదేండ్లలో 10కి.మీ. టన్నెల్ కూడా పూర్తి కాలే..
- పనులు చేయకుండానే కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు
- ముఖ్యమంత్రి రేవంత్ తీవ్ర ఆరోపణలు
- మంత్రులతో కలిసి ఎస్ఎల్‌బిసి టన్నెల్ సందర్శన

**మహబూబ్‌నగర్ బ్యూరో /నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్3,ప్రభాతవార్త:** రాజకీయ దురుద్దేశంతో హరీష్, కేసీఆర్ ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పక్కకు పెట్టారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అప్పట్లో పది కిలోమీటర్ల టన్నెల్‌ను సైతం అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు పూర్తి చేయలేదని.. అందుకు కారణం వారికి రావాల్సిన పర్సెంటేజీ రాదని చేయలేదని ముఖ్యమంత్రి తీవ్రంగా విమర్శించారు. ఈ విషయంలో అప్పటి సీఎం చంద్రశేఖర్ రావు కుటిలనీతితో వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు >>2

# రహదారి రక్తసిక్తం

## చేవెళ్లలో బస్సును ఢీకొన్న టిప్పర్

### 19 మంది మృతి... 21 మందికి గాయాలు

### మృతుల్లో శిశువుతో సహా పది మంది మహిళలు

### రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ, సిఎం రేవంత్ దిగ్భ్రాంతి

### మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం

అమ్మా వెళ్లొస్తా.. నాన్న వెళ్తున్నా.. ఇవే ఆ చిన్నారుల చివరి మాటలు.. భేటీ.. పాప జాగ్రత్త.. ఇవే వాళ్ల ఆఖరి పలుకులు.. చివరి చూపులు.. అమ్మా చదువుకోవాలి.. ఎగ్జామ్స్ దగ్గర పడుతున్నాయి.. వెళ్లొస్తానంటూ చెప్పిన ఆ కూతుళ్ల మాటలు ఆగిపోయాయి. ప్రేమానురాగాలతో భర్తను చూస్తాననే ఆశతో బయలుదేరిన మహిళ.. మెట్టినింటికి చేరకుండానే ప్రాణాలు కోల్పోయింది. భార్యను ఆస్పత్రికి తీసుకెళ్తూ దంపతులు కన్నుమూశారు. ఇలా ఎన్నో ఆశలతో బయలుదేరి ప్రయాణికులు గమ్యం చేరకుండానే అనంతలోకాలకు వెళ్లిపోయారు. సోమవారం ఉదయం చేవెళ్ల రహదారిపై ఆర్‌టిసి బస్సును టిప్పర్ ఢీకొన్న ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతులది ఒక్కొక్కరిది ఒక్కో గాథ. అంతా క్షేమం అనుకున్న సమయంలో బస్సు ప్రమాద సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని విలవిలలాడారు. ప్రాణాలు కోల్పోయి రోడ్డుపై అచేతనావస్థలో పడి ఉన్న దృశ్యాలు చూపరులను కంటతడి పెట్టించాయి.

ఒక్కో ప్రయాణికుడిది ఒక్కోగాథ



సోమవారం చేవెళ్ల రహదారిపై బస్సును ఢీకొన్న కంకర టిప్పర్

### ఎక్స్‌గ్రేషియా

కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షలు

రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు

టిజిఎస్ ఆర్టీసి రూ.2 లక్షలు

క్షతగాత్రులకు రూ.50 వేలు కేంద్రం ప్రకటన



అమ్మా! నువ్వెక్కడ అంటూ చిన్నారి ఆర్తనాదాలు

### సమగ్ర దర్యాప్తు

- ఉన్నతస్థాయి విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం
- ఘటనాస్థలిని సందర్శించిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- క్షతగాత్రులకు దామోదర, శ్రీధర్‌బాబు, పొన్నం పరామర్శ
- మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ

### టిప్పర్ ఓవర్ లోడ్.. ఆపై అధిక వేగం!

3

- ప్రమాదానికి కారణమని ప్రాథమిక నిర్ధారణ
- టిప్పర్ డ్రైవర్ మద్యం సేవించినట్లు ఆధారాలు
- కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు



## అనిల్ అంబానీకి ఇడి షాక్

### ఇల్లుతో పాటు రూ. 3084 కోట్ల ఆస్తులు జప్తు

### మనీ లాండరింగ్ కేసులో చర్య

**న్యూఢిల్లీ, నవంబరు 3:** ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్ఎఫ్ఎల్), రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్ఎల్) సంస్థల్లో ప్రజాధనాన్ని పక్కదారి పట్టించారన్న ఆరోపణలతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ కేసులో ఆయనకు చెందిన రూ.3,084 కోట్ల విలువైన 40కి పైగా ఆస్తులను అటాచ్ చేసింది. ఈ మేరకు గతనెల31న ఉత్తర్వులు జారీ చేసినట్లు ఈడీ అధికారులు తెలిపారు. జప్తు చేసిన ఆస్తుల్లో ముంబైలోని పాలి హిల్‌లో ఉన్న అనిల్ అంబానీ కుటుంబ నివాసం, న్యూఢిల్లీలోని రిలయన్స్ సెంటర్‌తో పాటు పలు నివాస, వాణిజ్య భవనాలు, భూములు ఉన్నాయి. ఈ ఆస్తులు ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, ముంబై, పుణె, థానే, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో విస్తరించి ఉన్నాయి. 2017-19 మధ్యకాలంలో యెస్ బ్యాంక్ ఆర్‌హెచ్ఎఫ్ఎల్‌లో రూ.2,965 కోట్లు, ఆర్‌సీఎఫ్ఎల్‌లో రూ.2,045 కోట్లు పెట్టుబడిగా పెట్టింది. అయితే 2019 డిసెంబర్ నాటికి ఈ పెట్టుబడులు నిరర్థక ఆస్తులుగా (ఎన్‌పీఏ) మారాయి. ఆర్‌హెచ్ఎఫ్ఎల్ నుంచి రూ.1,353 కోట్లు, ఆర్‌సీఎఫ్ఎల్ నుంచి రూ.1,984 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. సెబీ నిబంధనల ప్రకారం రిలయన్స్ నిప్పాన్ మ్యూచువల్ ఫండ్ నేరుగా అనిల్ అంబానీ గ్రూప్ ఆర్థిక సంస్థల్లో పెట్టుబడులు పెట్టడంపై ఆంక్షలు ఉన్నాయి. ఈ నిబంధనలను >>2



వాన్‌గార్డ్ గ్లోబల్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డి.సిఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు

## కంపెనీల హైదరాబాద్‌షా

### ప్రపంచస్థాయి పరిశ్రమలకు కేంద్రంగా భాగ్యనగరం

### లక్ష్యం 120 జిసిసిలు.. 1.2 లక్షల ఉద్యోగాలు

### వాన్ గార్డ్ గ్లోబల్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఐటి, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,నవంబర్3:** హైదరాబాదులో ప్రపంచ ప్రసిద్ధి చెందిన వాన్ గార్డ్ గ్లోబల్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం అంటే రాష్ట్రంలో టెక్నాలజీ, ఆవిష్కరణలకు ఒక గుర్తింపుగా భావిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం సాయంత్రం నాలెడ్జ్ సెంటర్లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి వాన్ గార్డ్ గ్లోబల్ >>2

8 వరుసల రోడ్డు విస్తరణకు

## హరిత ట్రిబ్యునల్ అనుమతి



### మొయినాబాద్ నుంచి మన్నెగూడ వరకు జాతీయ రహదారి విస్తరణకు సుగమం

**హైదరాబాద్,నవంబరు 3,ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ సమీపంలోని మీర్జాగూడలో కంకరలారీ, ఆర్టీసి బస్సుఢీకొన్న ఘోర రోడ్డు ప్రమాదంలో 19మంది మృతి చెందిన సోమవారం రోజునే యాదృచికంగా జాతీయ హరిత ట్రిబ్యునల్ ప్రమాదభరితమైన రోడ్డు విస్తరణకు ఆమోదముద్ర వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ రహదారి 163 రంగా రెడ్డి జిల్లాలోని మొయినాబాద్ నుంచి వికారాబాద్ జిల్లాలోని మన్నెగూడ మధ్య విస్తరణకు అనుమతి ఇచ్చింది.జాతీయ రహదారి 163 రెండు వరుసల నుంచి 8 వరుసలుగా విస్తరణ చేయడానికి ఎనిమిది ఏళ్ళ క్రితం సిద్ధంకాగా హైదరాబాద్‌కు చెందిన కొంత మంది పర్యావరణ ప్రియులు జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో కేసు వేశారు.జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా రోడ్డు విస్తరణలో భాగంగా 900 మర్రి చెట్లను నరికివేసేందుకు సిద్ధం కాగా వాటిని సంరక్షించేందుకు నగరంకు చెందిన పర్యావరణ వేత్తలు అడ్డుచెప్పారు. దీనితో రోడ్డు నిర్మాణం విస్తరణ పనులు హరిత ట్రిబ్యునల్‌లో ఎటు తేలకపోవడంతో సంవత్సరాలుగా నిలిచిపోయాయి. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పట్టు వదలకుండా రోడ్డు విస్తరణకు కేసు ఉపసంహరణకు అనేక మార్గాలు ప్రత్యామ్నాయగా చూపినా ఎన్‌జిటి మాత్రం పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పర్యావరణ మదింపు కమిటీ మార్చి 2025లో మర్రి చెట్లను కాపాడేందుకు సమగ్ర అధ్యయంన చేయాలని సిఫార్సును అనుసరించి ఎన్ జిటి రోడ్డు విస్తరణను అబయన్స్‌లో పెట్టింది. పరిగి ఎమ్మెల్యే టి.రాంమోహన్‌రెడ్డి జోక్యంతో >>2



## ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు భూసేకరణకు గ్రీన్‌సిగ్నల్!

### 700 ఎకరాలు సేకరించాలని నిర్ణయం

### రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

### ఆదిలాబాద్ అభివృద్ధికి కీలక ముందడుగు

### ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్,నవంబరు 3,ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లా ప్రజల దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న విమానాశ్రయ నిర్మాణంకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఎయిర్‌పోర్టుతో పాటు ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ సైతనం త్వరలో ఆదిలాబాద్‌లో ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం నడుంకట్టింది. జిల్లాలో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికోసం మొత్తం 700 ఎకరాల భూసేకరణకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఎయిర్‌పోర్టుకు ఇప్పటికే 362ఎరాల భూమి ఉంది అదనంగా 300 ఎకరాలు సేకరించాలని తొలుత భావించారు. ప్రస్తుతం ఏడు వందల ఎకరాలు సేకరణ చేయాలని నిర్ణయించారు. ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నిర్మాణంకోం ఎఎఐ మాస్టర్ ప్లాన్‌కూడా సిద్దంగా ఉంది. ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే ఉత్తర దక్షిణ భారత దేశాలకు సులభతరంగా విమానయానం కాబోతుంది.ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు అభివృద్ధికి కీలక ముందడుగు జివో ఎంఎస్ 73 ని సోమవారం జారీచేస్తూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభివర్ణించారు. జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ సాధ్యసాధ్యాలపై ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇచ్చిన >>2

## అరుదైన ఖనిజాల అన్వేషణకు సింగరేణి

### జిఎన్ఎస్ఆర్‌డిడిసితో ఒప్పందం

### జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సంయుక్తంగా పనిచేయాలని నిర్ణయం

### సింగరేణి సిఎం బలరామ్ వెల్లడి



సింగరేణి సిఎండి బలరామ్ సమక్షంలో ఒప్పందం

**హైదరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త:** వ్యాపార విస్తరణలో భాగంగా మరో జాతీయ పరిశోధన సంస్థతో సింగరేణి దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుంది. నాగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న కేంద్ర గనుల శాఖ అనుబంధ స్వతంత్ర పరిశోధన సంస్థ అయిన జవహర్ లాల్ నెహ్రూ అల్యూమినియం రీసెర్చ్ డెవలప్మెంట్ అండ్ డిజైన్ సెంటర్‌తో సింగరేణి ప్రాంతంలో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ పరిశోధనకు సంబంధించి రెండు సంస్థల మధ్య ఒక అంగీకారం కుదిరింది. హైదరాబాద్‌లో సోమవారం సిఎండి ఎన్.బలరామ్ సమక్షంలో జరిగిన ఈ ఒప్పంద కార్యక్రమంలో సింగరేణి సంస్థ డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లు, పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ అనుపమ్ అగ్నిహోత్రి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. సింగరేణి ప్రాంతంలో ఓబీ, ప్లైయాష్ లోని రేర్ ఎర్త్ ఎలిమింట్ల వెతికితీతకు పరిశోధన దేశ, విదేశాల్లో కీలక ఖనిజ వ్యాపారాల పరిశోధనలకు పరస్పర సహకారంతో ముందుకు వెళ్లేందుకు గాను ఈ ఒప్పందం జరిగింది. అల్యూమినియం రీసెర్చ్ డెవలప్మెంట్ అండ్ డిజైన్ >>2

## మరో మూడ్రోజులు భారీ వర్షాలు

### వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్3:** మొంథా తుఫాన్ కారణంగా ఇటీవల వరకు తెలంగాణలోని పలు జిల్లాలు చిగురుటాకులా వణికిపోయాయి. వరంగల్, హన్మకొండ జిల్లాలు నీట మునిగాయి. ఆ తుఫాన్ నుంచి జనాలు ఇప్పుడిప్పుడే మెల్లమెల్లగా కోలుకుంటున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ వాసులకు మరో బిగ్ అలర్ట్ వచ్చింది. హైదరాబాద్ వాతావరణ శాఖ రాష్ట్రానికి మరోసారి వర్ష సూచనలు జారీ చేసింది. రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం విదర్భ, ఆ పరిసర ప్రాంతంలో కొనసాగినఉపరితల ఆవర్తనద్రోణి సోమవారం నాటికి బలహీనపడింది. ఈ కారణంగా >>2

## సేద్యపు చదువులో సిడ్నీ వర్సిటీ భాగస్వామ్యం

- ప్రొఫెసర్ జయశంకర్ అగ్రివర్సిటీతో ఒప్పందం
- దేశంలోనే తొలిసారిగా సంయుక్త బిఎస్సీ కోర్సు
- సిడ్నీ పర్యటనలో పిజెటిఎయూ అధికారుల బృందం

2



బిఎస్సీ కోర్సు ఒప్పందం సంతకాలు చేస్తున్న వ్యవసాయ వర్సిటీ,వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీ అధికారులు

# సేద్యపు చదువులో సిడ్నీ వర్సిటీ భాగస్వామ్యం

## ప్రొఫెసర్ జయశంకర్ అగ్రివర్సిటీతో ఒప్పందం

## దేశంలోనే తొలిసారిగా సంయుక్త బిఎస్సీ కోర్సు

## సిడ్నీ పర్యటనలో పిజెటిఎయూ అధికారుల బృందం

**హైదరాబాద్ (అత్తాపూర్) నవంబరు3,ప్రభాతవార్త:** ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజెటిఎయూ) ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య నేతృత్వంలో విశ్వవిద్యాలయం డీన్స్ బృందం సిడ్నీలోని వెస్టర్న్ సిడ్నీ విశ్వవిద్యాలయాన్ని సోమవారం సందర్శించింది. డబ్ల్యుఎస్‌యూ ఉపకులపతి, ప్రెసిడెంట్ జార్జ్ విలియం ఎ‌ట, ఇతర అధికారులతో పిజెటిఎయూ బృందం అనేక అంశాలపై విస్తృత చర్చలు జరిపింది. బిఎస్సి(అగ్రికల్చర్) కోర్సుని సంయుక్తంగా అందించేందుకు వీలు కల్పించే కీలక ఒప్పందంపై రెండు విశ్వవిద్యాలయాల ఉపకులపతులు సంతకాలు చేశారు. దేశంలోనే తొలిసారిగా అందించే ఈ నాలుగేళ్ల సంయుక్త కోర్సులో విద్యార్థులు మూడేళ్లు రాజేంద్రనగర్ లోని కళాశాలలోనూ, మరో ఏడాది జూళీగ లోనూ విద్యను అభ్యసించే అవకాశం ఈ ఒప్పందం ద్వారా కలుగుతుంది. సుమారు 40 మంది తెలంగాణ విద్యార్థులు ఏడాది పాటు డబ్ల్యుఎస్‌యూలో చదువుకునే అవకాశాన్ని ఈ ఒప్పందం కల్పించనుందని పిజెటిఎయూ ఉపకులపతి అల్దాస్ జానయ్య తెలిపారు. అదే విధంగా ఆసక్తి కలిగిన విద్యార్థులు మరో ఏడాది చదివి ఎంఎస్సి డిగ్రీ పొందే అవకాశం ఉందని జానయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పిజెటిఎయూలో చేపట్టిన వివిధ సంస్కరణల్లో భాగంగా ఈ ఒప్పందం ద్వారా విద్య, పరిశోధన విభాగాల్ని ప్రముఖ అంతర్జాతీయ సంస్థలతో అనుసంధానించి సంయుక్త పరిశోధనలు చేపట్టే అవకాశం కలుగుతుందని జానయ్య వివరించారు. ఈ సంయుక్త డిగ్రీ కోర్సులో ఇప్పటికే 25 మంది విద్యార్థులు చేరారని త్వరలో మరో 10 మంది చేరడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో ఈ కోర్సుని నిర్వహించనున్నట్లు జానయ్య తెలిపారు. అదేవిధంగా పిజెటిఎయూ అధికారుల బృందం డబ్ల్యుఎస్‌యూలోని వివిధ అధునాతన ప్రయోగశాలల్ని, పరిశోధనా విభాగాల్ని సందర్శించింది. వ్యవసాయ రంగంలో అగ్రి రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిశోధనలకు సంబంధించి కూడా రెండు విశ్వవిద్యాలయాల మధ్య అవగాహన కుదిరిందని అల్దాస్ జానయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యుఎస్‌యూ ఉపకులపతి, ప్రెసిడెంట్ జార్జ్ విలియం ఎ‌ట, పిఆర్‌ఓ విసి ప్రొఫెసర్ ఇయాన్ అండర్సన్ ( రీసెర్చ్ అండ్ ఎంటర్ ప్రైజ్), పిఆర్‌ఓ విసి ( ఎడ్యుకేషనల్ పార్టర్న్ షిప్స్ అండ్ క్వాలిటీ) డాక్టర్ నికోలెన్ ముర్డోఖ్, పిజెటిఎయూ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ ఝాన్సీ రాణి, పరిశోధన సంచాలకులు డాక్టర్ మరాఠి బలరాం, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ దిబీ. వేణుగోపాల్ రెడ్డి, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ రమణరావు, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ ఈశ్వరిలు పాల్గొన్నారు.

# భూసేకరణకు గ్రీన్‌సిగ్నల్!

>> నివేదిక సానుకూలంగా రావడంతో, భూసేకరణ ప్రక్రియను వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నిర్ణయం ఉత్తర తెలంగాణలో వాణిజ్యం, పర్యాటకం, పరిశ్రమలు, అత్యవసర సేవలు వంటి రంగాలకు ఎంతో మేలు చేయనున్నదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. సమగ్ర రవాణా మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా ప్రాంతీయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సమతుల ప్రాంతీయవృద్ధిలక్ష్యంతో ముందుకు సాగుతోందని ఆయన చెప్పారు. ఆదిలాబాద్ త్వరలోనే దేశ విమానయానపటంలో కీలకస్థానం దక్కించుకోనుంది అని మంత్రి అన్నారు.

# మరో మూడ్రోజులు భారీ వర్షాలు

>> తెలంగాణలోని పలు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. అయితే ఇప్పటికే భాగ్యనగరంతో సహా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం సమయంలో హైదరాబాద్‌లో అకస్మాత్తుగా వర్షం కురిసింది. దీంతో వాహనదారులు ట్రాఫిక్ లో ఇబ్బందులు పడ్డారు. మంగళ, బుధ వారాల్లో కూడా రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే మరికొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులు, 30 నుంచి 40 కి.మీ. వేగం కలిగిన ఈదురు గాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. మొంథా తుఫాన్ కారణంగా పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా పంట పొలాలు నీట మునిగి.. రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్నారు. ఇలాంటి నష్టం మరోసారి జరగకుండా రైతులు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. పంట పొలాల వద్ద కల్లాల్లో ధాన్యం ఉంటే వాటిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. అత్యవసరమైతే తప్ప.. బయటకు, పొలాలకు వెళ్లొద్దని సూచిస్తున్నారు.

# ఖనిజాల అన్వేషణకు సింగరేణి

>> సెంటర్‌తో కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉనికి, విస్తరణ తదితర అంశాలను శాస్త్రీయంగా విశ్లేషించి సమాచారం అందించడానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కలిసి రెండు సంస్థలు పనిచేయనున్నాయి. ఈ సందర్భంగా సింగరేణి సిఎండి బలరామ్ ఒప్పందం ఉద్దేశాలను వివరిస్తూ తమ సంస్థ పెద్ద ఎత్తున దేశ, విదేశాల్లో వ్యాపార విస్తరణ చర్యలు చేపట్టాలని నిర్ణయించిందన్నారు. వీటిలో కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ పైన ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఇప్పటికే జాతీయ స్థాయిలో కీలక ఖనిజాలు రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ పరిశోధన రంగంలో దశాబ్దాల అనుభవం గల ప్రభుత్వ పరిశోధనా సంస్థలతో సాంకేతిక సహాయం, పరస్పర సహకారంతో వ్యాపార భాగస్వామ్యంతో ముందుకు వెళ్లేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. దేశంలోనే కాక విదేశాలలో కూడా సింగరేణి సంస్థ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ రంగంలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలలో పరిశోధనలకు ఖనిజాల ఉనికి తదితర అంశాలు కచ్చితంగా నిర్ధారించుకోవడానికి ఈ పరిశోధన సంస్థ సహకారాన్ని తీసుకుంటామన్నారు. సింగరేణి ప్రాంతంలో ఓపెన్ కాస్ట్ గనుల్లో లభ్యమయ్యే ఓవర్ బర్డెన్ లో, ఎన్టీపీసీలోని ఫ్లైయాష్ లో సింగరేణి సమీప ప్రాంతాల్లోని గుట్టల్లో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉనికి ప్రాథమికంగా నిర్ధారించబడిందని, దీనిపై లోతుగా పరిశీలించడానికి ఈ సంస్థ సహకారం తీసుకుంటామని వెల్లడించారు. భూ విజ్ఞాన శాస్త్రం, ఖనిజ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాల్లో భాగస్వామిగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇడి షాక్

>> అధిగమించేందుకు, మ్యూచువల్ ఫండ్లలోని ప్రజాధనాన్ని పరోక్షంగా యెస్ బ్యాంక్ ద్వారా ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్, ఆర్‌సీఎఫ్‌ఎల్ సంస్థలకు మళ్లించినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది. ఆ తర్వాత ఈ ఆర్థిక సంస్థలు, అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్‌కు చెందిన ఇతర కంపెనీలకు రుణాలుగా అందించాయి. చాలా సందర్భాల్లో ఎలాంటి తనిఖీలు లేకుండానే రుణాలను స్పీడ్‌ప్రాసెస్“ చేశారని ఈడీ గుర్తించింది. దరఖాస్తు, మంజూరు, ఒప్పందం అన్నీ ఒకే రోజు జరిగిపోయాయని, కొన్నిసార్లు దరఖాస్తు చేయడానికి ముందే నిధులు విడుదలయ్యాయని దర్యాప్తులో వెల్లడైంది. దీనిని ఉద్దేశపూర్వకమైన, స్థిరమైన నియంత్రణ వైఫల్యాలుగా ఈడీ వివరించింది. ఈడీ తన దర్యాప్తును రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్)కు కూడా విస్తరించింది. ఇందులో రూ.13,600 కోట్లకు పైగా వ్యవస్థీకృత రుణ మోసాలు జరిగినట్లు గుర్తించింది. ఈ మొత్తంలో రూ.12,600 కోట్లను అనుబంధ సంస్థలకు మళ్లించగా, మరో రూ.1,800 కోట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్ల ద్వారా గ్రూప్ కంపెనీలకు తరలించారు. ఈ నేరంలో భాగమైన మరిన్ని ఆస్తులను గుర్తించే పని కొనసాగుతోందని, జప్తు చేసిన ఆస్తుల ద్వారా రికవరీ చేసిన మొత్తం చివరికి ప్రజలకే చెందుతుందని దర్యాప్తు సంస్థ స్పష్టం చేసింది.

## హైదరాబాద్‌లో అనిల్ అంబానీ ఆస్తుల జప్తు..

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబర్3:** ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ అంబానీ సంస్థలకు చెందిన ఆస్తులను ఈడీ అధికారులు హైదరాబాద్‌లో గుర్తించారు. ఈ మేరకు రిలయన్స్ అనిల్ అంబానీ సంస్థల ఆస్తులను ఈడీ అధికారులు తాత్కాలికంగా అటాచ్ చేసినట్లు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 42 ప్రాపర్టీలకు చెందిన రూ.3,083 కోట్ల ఆస్తులను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ కింద కేసులు నమోదు చేసి అక్టోబర్ 31వ తేదీన ఆస్తులను అటాచ్ చేసినట్లు పేర్కొన్నారు. పాలీ హిల్ రెసిడెన్సీ అండ్ ప్రాపర్టీస్, రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థల కార్యాలయం ఆస్తులను హైదరాబాద్‌లో గుర్తించారు. వాటితో పాటు సోమాజీగూడ రాజ్ భవన్ రోడ్‌లో కామున్ కాప్రి అపార్ట్మెంట్లో రెండు ఫ్లాట్లను గుర్తించి స్వాధీనపరచుకున్నారు. హైదరాబాద్ లోని పాట్లను ఎపీలోని ఈస్ట్ గోదావరిలో గుర్తించారు. అనిల్ అంబానీ రిలయన్స్ గ్రూప్ సంస్థలైన రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, రిలయన్స్ పవర్ లిమిటెడ్ సంస్థలు ప్రజా ధనాన్ని దారి మళ్లించినట్లు ఈడి దర్యాప్తులో తేలింది. రూ.19,694 కోట్లు బ్యాంకులకు బాకాయిలు ఉన్నట్లు ఆస్తులు ఎన్‌పిఏగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

## వారం - వర్జ్యం

04-11-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
చతుర్దశి రా.10.33
రేవతి మ.12.31, స్వాతి కార్తె
వర్జ్యం : ఉ.6.08-7.32
దు.ఉ.8.25- 9.11
2) రా.10.14-10.59
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** శ్రమించి పనులు పూర్తి చేసు కుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వివాదాలు తీరి ప్రశాంతత లభిస్తుంది.

**వృషభం:** ఇతరుల విషయాలలో అతి జోక్యం వల్ల అబాసుపాలవుతారు. ఉద్యోగులకు అనుకోకుండా బదిలీలు ఉంటాయి.

**మిథునం:** బంధువుల నుండి వచ్చిన సమాచారం కొంత ఊరట కలిగిస్తుంది. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి.

**కర్కాటకం :** నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. ఉద్యోగాలలో స్వల్ప మార్పులు చోటు చేసుకుంటాయి.

**సింహం:** కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. ఆభరణాలు కొనుగోలుచేస్తారు. కాంట్రాక్టులు దక్కుతాయి.

**కన్య :** వాహనాల విషయంలో కాస్త మెలుకువ అవసరం. కోపతాపాలకు దూరంగా వుండండి. ముఖ్యమైన పనులలో తొందరపాటు వద్దు.

**తుల :** అందివచ్చే అవకాశములను నేర్పుతో మీకు అనుకూలంగా మార్చుకోండి. ఉద్యోగులకు అనుకోకుండా బదిలీలు ఉంటాయి.

**వృశ్చికం:** వైరి వర్గం వలన ప్రయోజనాలు చేజారిపోవచ్చు. వాహనయోగం కలదు. జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి.

**ధనుస్సు:** సంతాన విద్యాభివృద్ధి బాగుంటుంది. స్థిరాస్థి వృద్ధి చెందుతుంది. నూతన పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది.

**మకరం:** జీవితభాగస్వామి నుండి సలహాలు స్వీకరిస్తారు. విందు, వినోదాలు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**కుంభం:** భూ వివాదాలు తీరి లబ్ధి పొందతారు. బంధువుల కలయిక. దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.

**మీనం:** కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ముందుకు సాగుతారు. కొత్త కార్య క్రమాలకు శ్రీకారం చుడతారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కంపెనీల హైదరాబాద్‌షా

>> టెక్నాలజీ సెంటర్ ను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ప్రపంచ స్థాయి కంపెనీలకు హైదరాబాద్ ఒక కేంద్రంగా మారిందని డిప్యూటీ సీఎం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రజల తరఫున వాన్ గార్డ్ నాయకత్వ బృందానికి హృదయపూర్వక స్వాగతం తెలియజేస్తూ, కంపెనీ చరిత్రలో ముఖ్యమైన మైలురాయికి మీకు అభినందనలు తెలియజేస్తున్నాను అని సిబ్బందిని ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు. పెట్టుబడుల నిర్వహణలో వాన్ గార్డ్ ఒక విశ్వసనీయ గ్లోబల్ నాయకుడు, కొత్త ఆవిష్కరణలు, నైతికత, దీర్ఘకాలిక విలువ సృష్టి పట్ల కట్టుబాటుతో ప్రసిద్ధి చెందింది అన్నారు. వాన్ గార్డ్ హైదరాబాదులో గ్లోబల్ టెక్నాలజీ సెంటర్‌ను స్థాపించాలనే నిర్ణయం తీసుకోవడం తెలంగాణ రాష్ట్రంలో టెక్నాలజీ, ఆవిష్కరణల కేంద్రంగా ఎదుగుతున్న భాగ్యనగరం ప్రతిష్టకు గొప్ప గుర్తింపు అని అభివర్ణించారు. బలమైన మౌలిక వసతులు, వ్యాపారానుకూల విధానాలు, ప్రతిభతో నిండిన ఎకోసిస్టమ్ కారణంగా, ప్రపంచ స్థాయి కంపెనీలకు హైదరాబాద్ ప్రాధాన్య గమ్యస్థానంగా ఎదిగింది అని వివరించారు. దేశంలోని అత్యుత్తమ ఇంజనీరింగ్, టెక్నాలజీ విద్యాసంస్థలు ఉన్న నగరంగా, ప్రతి సంవత్సరం వేలాది మంది నైపుణ్యం కలిగిన వృత్తి నిపుణులను హైదరాబాద్ అందిస్తుంది అని తెలిపారు. అత్యున్నత ప్రతిభా వనం, స్టార్టప్ సంస్కృతి, పరిశ్రమ, అకాడమిల సమన్వయం, ఇవన్నీ వాన్ గార్డ్ వంటి సంస్థలు అభివృద్ధి చెందడానికి హైదరాబాద్‌ను సరైన ప్రదేశంగా మార్చుతున్నాయి అన్నారు. జీవితాలు మరియు ఆర్థిక వ్యవస్థలను మార్గనిర్దేశం చేయడంలో సాంకేతిక శక్తిపై తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడూ విశ్వాసం ఉంచింది ఆ మేరకు ముందుకు పోతుంది అని డిప్యూటీ సీఎం తెలిపారు. గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, గ్లోబల్ ఏఐ స్కూల్ వంటి కార్యక్రమాల ద్వారా మేము ఆవిష్కరణ, స్టార్టప్‌లు, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించే వ్యవస్థను నిర్మించాము అని డిప్యూటీ సీఎం వివరించారు. ఇవన్నీ ప్రపంచ స్థాయి సంస్థలకు తెలంగాణలో వ్యాపారం చేసే వేదిక మాత్రమే కాకుండా, అభివృద్ధిలో భాగస్వామిని కూడా అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. శ్రీధర్ బాబు నాయకత్వంలో మా రాష్ట్రం టెక్నాలజీ, పరిశ్రమ రంగాల్లో విశేష పురోగతి సాధిస్తోంది అని అభినందించారు. వాన్ గార్డ్ సిబ్బంది నైపుణ్యం, శక్తి, కట్టుబాటు ఇవే మీ వాంగార్డ్ విజయానికి పునాది అని డిప్యూటీ సీఎం వివరించారు. మీరు వాంగార్డ్ మాత్రమే కాదు, విశాలమైన టెక్నాలజీ ఎకోసిస్టమ్ భవిష్యత్తును రూపుదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారని తాను బలంగా విశ్వసిస్తున్నట్టు తెలిపారు. వాన్ గార్డ్ బృందానికి తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఇస్తుంది, ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని, మా విద్యాసంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ఇన్నోవేషన్ హబ్‌లతో మరింత సహకార అవకాశాలను వాన్ గార్డ్ పరిశీలించాలనీ ఆహ్వానిస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. కలిసి పనిచేస్తూ, గ్లోబల్ మార్కెట్లకు మాత్రమే కాదు, స్థానిక సమాజ అభివృద్ధికి కూడా తోడ్పడే పరిష్కారాలను రూపొందించగలుగుతాం అని విశ్వాసం వ్యక్తం చేశారు. హైదరాబాదులో భవిష్యత్తు సిటీగా అభివృద్ధి చెందుతున్న భారత్ ఫ్యూచర్ సిటీలో ఒక స్థలాన్ని తీసుకొని, వాన్ గార్డ్ సొంత సెంటర్ నిర్మించే అంశంపై లోతుగా ఆలోచన చేయాలని నిర్వాహకులను కోరుతున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాదులో నిర్మితమవుతున్న కొత్త నగరం భారత్ ఫీచర్ సిటీ భారతదేశంలోని అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా రూపుదిద్దుకుంటుంది అన్నారు. అన్ని రకాల మౌలిక వసతులతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం వంటి సదుపాయాలను సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు తెలిపారు. ఫ్యూచర్ సిటీలో వాన్ గార్డ్ సొంత కేంద్ర నిర్మాణానికి సంబంధిత మంత్రులు చొరవ చూపాలని తాను కోరుతున్నానని అన్నారు. వచ్చే ఏడాదిలో 120 గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల(జీసీసీ)ను ప్రారంభించి... కొత్తగా 1.2 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ ఉద్యోగాలను అందిపుచ్చుకునేలా కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ లో అత్యుత్తమ నైపుణ్య శిక్షణ అందిస్తామన్నారు. హైదరాబాద్ ప్రస్తుతం విశ్వసనీయత, సమగ్రత, ఇన్నోవేషన్‌కు చిరునామాగా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పెట్టుబడి నిర్వహణ సంస్థల్లో ఒకటైన వాన్‌గార్డ్ తమ గ్లోబల్ వ్యాల్యూ సెంటర్(జీవీసీ) ను ప్రారంభించేందుకు హైదరాబాద్ ను ఎంచుకోవడం ఈ నగర సామర్థ్యానికి నిదర్శనమన్నారు. వాన్‌గార్డ్ ప్రపంచవ్యాప్తంగా 6.4 ట్రిలియన్ డాలర్ల ఆస్తులను నిర్వహిస్తోందని, అలాంటి సంస్థ మన దగ్గర కార్యకలాపాలు ప్రారంభించడం మనకు గర్వకారణ మన్నారు. ప్రపంచ ఆర్థిక, సాంకేతిక పటంలో “తెలంగాణ“ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అవుతుందన్నారు. ప్రస్తుతం వరల్డ్ టాప్ 7 అస్సెట్ మేనేజ్మెంట్ కంపెనీలు హైదరాబాద్ లో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఈ కంపెనీలు 30 ట్రిలియన్ డాలర్ల ఆస్తులను నిర్వహిస్తున్నాయని వివరించారు. ఈ కొత్త జీవీసీ ఇంజనీరింగ్ ఎక్స్ లెన్స్, క్లౌడ్ మోడర్నైజేషన్, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీకి ఒక హబ్‌గా సేవలు అందిస్తుందన్నారు. ఇది వాన్‌గార్డ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్‌లో నూతన ఆవిష్కరణలకు మార్గ నిర్దేశం చేస్తుందన్నారు. వాన్ గార్డ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పట్టి “రైజింగ్ తెలంగాణ“లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, కంపెనీ ప్రతినిధులు నితిన్ థండన్, వెంకటేష్, జాన్, కిమ్ తదితరులు పాల్గొన్నారు



సోమవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు

# 14న కొడంగల్‌లో గ్రీన్ ఫీల్డ్ కిచెన్ ప్రారంభం

## సిఎం రేవంత్‌ని ఆహ్వానించిన అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్3:** కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు అక్షయ పాత్ర ఫౌండేషన్ ముందుకు వచ్చింది. సోమవారం ఉదయం అక్షయ పాత్ర పౌండేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలిశారు. ఈనెల 14వ తేదీన కొడంగల్ లో నిర్మించ తలపెట్టిన గ్రీన్ ఫీల్డ్ కిచెన్ ప్రారంభోత్సవానికి రావాలని ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు కొడంగల్ సమీపంలోని ఎన్కేపల్లిలో రెండెకరాల విస్తీర్ణంలో అక్షయ పాత్ర ఫౌండేషన్ గ్రీన్ ఫీల్డ్ కిచెన్ నిర్మించనుంది. గ్రీన్ ఫీల్డ్ కిచెన్ లో వండిన భోజనాన్ని నియోజకవర్గం లోని అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనానికి ఒక్కో విద్యార్థికి రూ.7 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. నాణ్యమైన భోజనం తయారు చేసి అందించేందుకు అక్షయ ఫౌండేషన్ దాదాపు రూ.25 వరకు ఖర్చు పెడుతుంది. ప్రభుత్వం చెల్లించే నిధులకు అదనంగా అయ్యే ఖర్చును అఓయ పాత్ర ఫౌండేషన్ భరిస్తుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధుల సాయంతో ఈ పథకం అమలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది. గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్లో పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ అందించే పథకం విజయవంతంగా అమలవుతుంది. 312 పాఠశాలల్లో దాదాపు 28 వేల మంది విద్యార్థులకు ప్రతి రోజు ఉదయాన్నే అల్పాహారం అందిస్తున్నారు. అన్ని గ్రామాల్లో పిల్లలు, తల్లిదండ్రుల నుంచి ఈ పథకానికి మంచి స్పందన వచ్చింది. ఈ పథకం దేశంలోనే అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

# విస్తరణకు హరిత ట్రిబ్యునల్ అనుమతి

>> పర్యావరణ ఫిర్యాదుదారులకు, ఎన్‌హెచ్‌ఎఐ మధ్య ఇటీవల రాజీ కుదిరింది. రామ్ మోహన్ రెడ్డి జోక్యంతో ఎన్‌హెచ్‌ఎఐ హైవే డిజైన్ సవరించి 765 మర్రి చెట్ల ఉన్నవి ఉన్నట్లుగా రక్షణ చర్యలు చేపట్టడానికి ఒప్పుకొంది. 130 మర్రి చెట్లను రోడ్డు విస్తరణ చేసిన తరువాత హైవే ఇరువైపుల రోడ్డుషోల్డర్‌లోకి వాటిని మార్చడానికి ఎన్‌హెచ్‌ఎఐ అధికారులు అంగీకరించింది. పర్యావరణ ప్రేమికుల కారణంగా రోడ్డు విస్తరణ జరకపోగా ఆ రోడ్డుపై నిత్యం మరణమృదంగం మ్రోగడంతో స్థానికులు వారి ఆగ్రహం మర్రిచెట్లపై చూపి పచ్చని చెట్లను నిప్పుపెట్టి దగ్ధం చేశారు. ఎన్‌హెచ్‌ఐ సవరణలు, పర్యావరణ ప్రియులు సంతృప్తితో తనకు ఏలాంటి అభ్యంతరం లేదని రోడ్డు విస్తరణకు అనుకూలమనే అని ఎన్ జి టి శనివారం ప్రకటించడంతో అదేరోజున పరిగి ఎమ్మెల్యే టి రాంమోహన్‌రెడ్డి కూడా ఇక తర్వలోనే ఈ రోడ్డు విస్తరణకు ఉన్న అడ్డంకులు తొలుగుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఘోర రోడ్డు ప్రమాదంతో తెలంగాణ ఉలిక్కిపడి నిద్రలేచి ఉక్కిరిబిక్కిరి అవుతుండగా ఎన్‌జిటి సోమవారం ఉదయం ఆమోదించి తుది ఉత్తర్వులు జారీచేసింది. చెట్లను కాపాడేందుకు కొన్ని ప్రదేశాలలో గ్రేడియంట్‌ను ట్వీక్ చేయడంతో పాటు చెట్లను కాపాడేందుకు రోడ్డు డివైడర్ వెడల్పును తగ్గించడం ద్వారా రోడ్డు డిజైన్‌ను సవరించడానికి ఎన్‌హెచ్‌ఎఐ దిగివచ్చింది. రహదారికి ప్రస్తుత రోడ్డుకు డివైడర్ లేకపోవడంతో ఇది కంకరతో వస్తున్న ట్రక్కు మరొక వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తున్నప్పుడు బస్సును ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. పౌరసమాజ ప్రతినిధులను రోడ్డు విస్తరణలో భాగస్వామ్యంచేయాలని మర్రిచెట్లను కాకుండా మరో 400 ఇతర జాతుల చెట్లుకూడా కాపాడుకోవాలని పర్యావరణ పేరుతో రోడ్డు విస్తరణ అభివృద్ధిని ఇన్నేళ్ళు అడ్డుకొని ప్రమాదాలకు కారణమైనవారు ఎన్‌జిటి ముందు కోరారు.

# పత్తి కొనుగోళ్లలో నిబంధనలు మార్చాలి

## సిసిఐకు వ్యవసాయ మంత్రి తుమ్మల లేఖ

**హైదరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త:** పత్తి కొనుగోళ్లకు సంబంధించి నిబంధనలు మార్చాలంటూ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) సిఎండి లలిత్ కుమార్‌గుప్తాకు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు లేఖ రాశారు. కొత్త నిబంధనలు పత్తి రైతులకు నష్టం చేసే విధంగా ఉందని చెప్పారు. దీనికి సంబంధించి సోమవారం ఒక ప్రకటనలో కేంద్రానికి రాసిన లేఖలోని అంశాలను గూర్చి వెల్లడిస్తూ ఎకరాకు 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయాలనీ కొత్త నిబంధ విధించిందన్నారు. అయితే ఇంత వరకూ 12 క్వింటాలు కొనుగోలు చేస్తోందని చెప్పారు. అలాగే 20 శాతం వరకు తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మరోపక్క కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్ తో అవగాహన లేక పత్తి రైతులకు ఇబ్బందులు తలెత్తాయని వెల్లడించారు. రైతాంగ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని 7 క్వింటాళ్ల నిబంధన ఎత్తి వేసి పాత పద్ధతిలో పత్తి కొనుగోళ్లు చేయాలని. తేమ శాతం 20 వరకు ఉన్న పత్తిని కొనుగోలు చేయాలని, జిన్నింగ్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించాలని ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. కాగా రాష్ట్రంలో ఇప్పటికే అధిక వర్షపాతం, తుపాన్ వలన పత్తి దెబ్బతిన్నదని వెల్లడించారు. తేమ శాతం 12 కంటే తక్కువ తీసుకురావడానికి రైతులు నానాతంటాలు పడ్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర చౌకధరలను, సబ్సిడీ దిగుమతులకు అనుమంతించడం వలన మార్కెట్లో పత్తి రేటు 6000 వరకు పడిపోయిందని వ్యాఖ్యానించారు. దాంతో సీసీఐ మీద భరోసా ఉంచి రైతులు వాళ్ల పత్తిని తీసుకొస్తున్న సందర్భములో నిన్న సీసీఐ నుంచి వచ్చిన నిబంధనలు తెలంగాణ పత్తి రైతులకు ఆశనిపాతం లాంటిదని తెలిపారు.

# పర్సంటేజీలు రాలేదని..

>> సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా మన్నేవారిపల్లిలో హెలీ మాగ్నెటిక్ సర్వేకు సంబంధించిన సర్వే హెలికాప్టర్‌తో పాటు... అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న వివరాలు, అందుకు సంబంధించిన పరికరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు తదితరులు పరిశీలించారు. దీంతో పాటు టన్నెల్‌లో చేపట్టబోయే పనులకు సంబంధించి వివరాలను అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకం పనుల పునరుద్ధరణలో మాగ్నెటిక్ జియోఫిజికల్ సర్వే వివరాలను ముఖ్యమంత్రి, మంత్రుల బృందంకు సవివరింగా సంబంధిత అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ టన్నెల్‌ను ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా 44 కి.మీ.టన్నెల్ ఎక్కడా లేదని... ఈ టన్నెల్ పూర్తయితే 30 టీఎంసీల నీటితో 3 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందించడం ఎంతో వీలుగా ఉంటుందని తెలిపారు. ఈ టన్నెల్ ప్రస్తుతం రూ.4,600 కోట్లతో పూర్తయ్యేందుకు చర్యలు రూపొందించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ పనులు పూర్తి చేసుకోకపోవడం వల్ల నెట్టెంపాడు, బీమా, కల్వకుర్తి వంటి పనులు ఏ ఒక్కటి కూడా అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు చేయలేదని... లక్షా ఎనభై ఆరు వేల కోట్ల రూపాయల్లో కాంట్రాక్టర్లకు పనులు పూర్తి కాకుండానే చెల్లించారని వివరించారు. రాయలసీమ లిఫ్ట్ పేరుతో నీటిని తరలించుకుపోతున్నారని...అప్పట్లో కేసీఆర్, హరీశ్ రావులు వెళ్ళి నీటిని తీసుకెళ్ళమని సంతకాలు పెట్టి వచ్చారని 299 టీఎంసీలకు ఒప్పుకున్నట్లు ట్రిబ్యునల్‌లో అడగడానికి వీల్లేదని తెలిపారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో ట్రిబ్యునల్‌లో వాదనలు వినిపిస్తున్నామని...ఒక కొలిక్కి వచ్చిందని తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు అలుసుగా మారిందని ఈ విషయంలో కేసీఆర్ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అత్యంత తక్కువ ఖర్చుతో 30 టీఎంసీల నీరు తీసుకెళ్ళే టన్నెల్ ఎక్కడా లేదని తెలిపారు. ఈ పనులు చేపట్టిన క్రమంలో ఎనిమిది మంది చనిపోయారని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిపుణులైన ఆర్మీ అధికారులను డిప్యూటేషన్‌పై తీసుకురావడం జరిగిందన్నారు. ప్రస్తుతం 9.8 కిలోమీటర్లు టన్నెల్ పనులు కావాల్సి ఉంది వీటిని మంత్రి వర్గంలో ఆమోదించడం జరిగిందన్నారు. ఈ విషయంలో మాజీ మంత్రి హరీశ్ రావు చిల్లరమాటలు మానేయాలని... ఇప్పటికైనా హరీశ్ రావు మారాలన్నారు. ఈ ప్రాంతం నుంచి తనతో పాటు మంత్రులు అధికారంలో ఉండి కూడా ఈ ప్రాజెక్టు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. టన్నెల్ లోపల చేసే పని క్రిటికల్ సిట్యూయేషన్ నేపథ్యంలో అందరితో సర్వేలు చేస్తున్నామన్నారు. అటవీ ప్రాంతంలో టన్నెల్ చేయడం ఎంతో ఇబ్బంది అయినప్పటికీ తప్పకుండా పూర్తి చేసి తీరుతామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన హామీనిచ్చారు.

**ఇదీ ఎస్ఎల్‌బీసీ..**

30టీఎంసీల తరలింపు, 3లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 1983లో ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు మంజూరైందని, ఉమ్మడి రాష్ట్రంలో 2004 లో వైఎస్ రాజశేఖరరెడ్డి టన్నెల్1, టన్నెల్2 పనులను ప్రారంభించారని సీఎం గుర్తుచేశారు. రూ. 1968 కోట్లతో టెండర్లు ఇచ్చి, టన్నెల్ బోర్ మిషన్ తో దేశంలోనే తొలిసారి ఎస్ఎల్బీసీ టన్నెల్ కు ఉపయోగించారరని తెలిపారు. 2014 వరకు కి.మీ. టన్నెల్ పనులు పూర్తయ్యాయని, తెలంగాణ ఏర్పడిన తరువాత పదేళ్లలో పది కి.మీ కూడా కేసీఆర్ పూర్తిచేయలేదని ఆరోపించారు. గ్రావిటీ ద్వారా నల్గొండకు నీళ్లు తీసుకెళ్లాలనుకుంటే అడ్డంకులు సృష్టిస్తున్నారు ప్రపంచంలో 40 కి.మీ టన్నెల్ ఎక్కడా లేదు ఇది పూర్తయితే తెలంగాణకు ఆ రికార్డు దక్కుతుంది ఆనాడు 2 వేల కోట్లు ఖర్చుతో ఈ ప్రాజెక్టు పూర్తయ్యేది ఇప్పుడు పెరిగిన అంచనాలతో 4600 కోట్లతో ఈ టన్నెల్ను పూర్తి చేయొచ్చు.

## మన వాటా తీసుకోలేకే ఆంధ్రాకు నీళ్లు

కృష్ణా నదిలో మన వాటా మనం తీసుకోకపోవడం వల్ల ఆ నీటిని ఆంధ్రా తరలించుకుపోతోందని, 299 టీఎంసీలు చాలు అని ఆనాడు హరీష్ రావు సంతకం పెట్టి వచ్చారని గుర్తుచేశారు. మన వాటా మనకు దక్కాల్సిందేనని ట్రిబ్యునల్ లో దీనిపై మేం వాదనలు వినిపిస్తూ ఒక కొలిక్కి తీసుకొస్తున్నాంఇంత తక్కువ ఖర్చుతో 30 టీఎంసీలు తీసుకు వెళ్లే ప్రాజెక్టు ఎక్కడా లేదు మేం అధికారంలోకి వచ్చాక పనులు మొదలు పెట్టాం దురదృష్టవశాత్తు 8 మంది కార్మికులు చనిపోయారు.. మాకు బాధ ఉన్నా.. ఆ కుటుంబాలను ఆదుకుని పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నంచేస్తున్నాం అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డికు ఆర్మీలో ఉన్న పరిచయాలతో ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. హరీష్ రావు చిల్లర మాటలు మానుకోవాలి తప్పులు చేసి అప్పులు చేసి దోపిడీ చేశారనే ప్రజలు మిమ్మల్ని పక్కనబెట్టారు ఈ ప్రాజెక్టు పూర్తి చేయకపోతే ఇక్కడి ప్రజలు మమ్మల్ని క్షమించరు ఎట్టి పరిస్థితుల్లో ఎస్ఎల్బీసీ టన్నెల్ పూర్తి చేస్తాం ముంపునకు గురవుతున్న మర్లపాడు, కేశ్య తండా, నక్కలగండి తండా ప్రజలను ఆదుకుని, డిసెంబర్ 31 లోగా సమస్యలు పరిష్కరించే బాధ్యత మాది ఇప్పుడు కాకపోతే ఈ ప్రాజెక్టును ఇంకెప్పుడూ పూర్తి చేసుకోలేం ఎన్ని అడ్డంకులు వచ్చినా తొలగొంచుకుని ప్రాజెక్టు పూర్తి చేసుకుందాం ఈ ప్రాజెక్టు పూర్తి చేసుకోకపోతే నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల ప్రజలకు నష్టం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం రూ. 2 లక్షల పరిహారం

**క్షతగాత్రులకు రూ. 50 వేలు ఆర్థిక సాయం**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** చేవెళ్ల బస్సు ప్రమాద సంఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధిక ప్రాణనష్టం కలుగడం బాధాకరమని అన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. పీఎంఎన్ఆర్ఎఫ్ కింద మృతులకు రూ.2 లక్షల చొప్పున గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ప్రధాని ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. చేవెళ్ల బస్సు ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈ సంఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వారికి ఆగిన ఆర్థిక సహాయంతో పాటు గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందజేయాలని సీఎస్, డీజీపీలను ఆదేశించారు. ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. మంత్రులు, ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉంటూ వారికి అందుబాటులో ఉండాలన్నారు. సచివాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పరిస్థితిని సమీక్షించేందుకు ఆర్టీసీ ఎండీ, రవాణా కమిషనర్, అగ్నిమాపక డీజీలను సంఘటనా స్థలానికి వెళ్లాలని ఆదేశించారు. ఇలా ఉండగా సంఘటనా స్థలానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు, విప్ డాక్టర్ పీ.మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, యాదయ్య, మనోహర్‌రెడ్డి వెళ్లారు. బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయ సహకారాలు అందజేస్తామని భరోసా ఇచ్చారు.

# రాష్ట్ర ప్రభుత్వం రూ. 7 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన

**చేవెళ్ల, నవంబరు 3, ప్రభాతవార్త :** చేవెళ్ల ఆసుపత్రిలో ప్రమాదంలో మృత్తి చెందిన క్షతగాత్రులను మృత్తి చెందిన వారిని రాష్ట్ర ఐటి శాఖ,పరిశ్రమల శాఖమంత్రి దుద్దిల శ్రీధర్‌బాబు, వైద్యశాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ, రవాణ శాఖమంత్రి పోన్నం ప్రభాకర్‌లు ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, రాంమోహన్ రెడ్డి, మనోహార్ రెడ్డిలు పరమర్షించారు, చేవెళ్ల రోడ్డు ప్రమాదం దురద్రుష్టకరమని ప్రభుత్వం మృతుల కుటుంబాలకు 7లక్షలు రూపాయలు అందిస్తామన్నారు. గాయపడినవారికి మెరుగైన వైద్యం అందిస్తామన్నారు, ప్రమాదవిషయం తెలిసిన వెంటనే సిఎం రేవంత్ రెడ్డి స్పందించి రాష్ట్ర యంత్రాంగాన్ని మంత్రులను అప్రమత్తం చేశారన్నారు, వెంటనే ప్రమాదస్థలంకు వెల్లాలని సిఎం ఆదేశాంచారన్నారు, ప్రభుత్వ యంత్రాంగం మొత్తం సహాయచర్యలు ముమ్మరంగా చేస్తుందన్నారు, ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోనేందుకు శాఖపరమైన విచారణకు ఆదేశించామన్నారు. ప్రమాదంలో గాయపడినవారికి మెరుగైన వైద్యం అందిస్తామని వెల్లడించారు.

# మమ్మీ బస్ ఎక్కాను..

**అదే అఖిలారెడ్డి ఆఖరు కాల్**



అఖిలారెడ్డి

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** 'మమ్మీ బస్ ఎక్కాను..' ఆ కూతురు తల్లికి చేసిన ఆఖరు ఫోన్ ఇది. బస్సు దిగిన తర్వాత కూడా ఫోన్ చేసే అలవాటు ఉన్న ఆమె గొంతు శాశ్వతంగా మూగబోయింది. చేవెళ్ల బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన అఖిలారెడ్డి స్వగ్రామం యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్. బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసిన అఖిలారెడ్డి మంచి అవకాశాల కోసం హైదరాబాద్‌లో ఎంబీఏ చదువుతోంది. ఇటీవల ఆమె కోసం తల్లిదండ్రులు మొబైల్ ఫోన్ కొనుగోలు చేశారు. ఫోన్ తీసుకువెళ్లాలని సూచించడంతో శనివారం స్వగ్రామానికి వచ్చిన అఖిల సోమవారం ఉదయం హైదరాబాద్ బస్సు ఎక్కింది. తాను బస్సు ఎక్కానని తల్లికి చెప్పింది. ఉదయం 8 గంటలకు హైదరాబాద్‌లో బస్సు దిగిన తర్వాత మళ్లీ తల్లికి ఫోన్ చేసే అలావాటు ఉంది. కానీ ఈరోజు అఖిల నుంచి ఫోన్‌రాలేదు. అప్పటికే చేవెళ్ల ప్రమాదంలో అఖిలారెడ్డి ప్రాణాలు కోల్పోయింది. బస్సు ప్రమాద సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈరోజు ప్రయాణం మానుకోవాలని చెప్పినా ఆమె వినలేదని, కాలేజీలో స్పోర్ట్స్ వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. ప్రమాదాలు తగ్గాలంటే ఈ ప్రాంత రోడ్లు బాగు పడాలని బాధిత కుటుంబీకులు అన్నారు. తరచూ డ్రంక్ అండ్ డ్రైవ్ రైడ్స్ జరగాలని డిమాండ్ చేశారు.

# ఆది నుంచీ ఉల్లంఘనుడే!

**కంకర టిప్పర్‌కు పెండింగ్ చలానాలు**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** చేవెళ్ల బస్సు ప్రమాదానికి కారణమైన కంకర్ టిప్పర్ పలుమార్లు నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలుస్తున్నది.




ఆర్టీసీ హైర్ సర్వీసు బస్సును ఢీకొట్టిన టిప్పర్ టీజీ06టీ3879 నెంబర్‌పై రిజిస్ట్రేషన్ చేశారు. ఈ టిప్పర్ రెండుసార్లు నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలంగాణ పోలీసులు చలానా విధించారు. కానీ ఇప్పటి వరకు ఒక్క చలానా కూడా చెల్లించకపోవడం యాజమాని బాధ్యతారాహిత్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ యేడాది ఫిబ్రవరి 18న రామచంద్రాపురం, సెప్టెంబరు 10న మియాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చలానాలు విధించారు. భారీ వాహనాలకు అనుమతి లేని ప్రదేశంలో టిప్పర్ ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ రెండుసార్లు నిబంధనలను ఉల్లంఘించగా రూ.1600 చొప్పున రూ.3200 చలానాలు పెండింగ్‌లో ఉన్నాయి. యూజర్ ఛార్జీలతో కలిపి రూ.3270 చెల్లించాల్సి ఉన్నా ఇప్పటి వరకు వాటి గురించి యజమానులు పట్టించుకోలేదు. నిత్యం చేవెళ్ల మార్గంలో నడిచే ఈ టిప్పర్‌ను రవాణా, పోలీసు యంత్రాంగాలు తనిఖీ చేయకపోవడం విడ్డూరమని అంటున్నారు. తాజాగా ఈ సంఘటనతోనైనా అధికారులు మేల్కొంటారా లేదా వేచి చూద్దాం. ఇలా ఉండగా ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ కారణమే కాకుండా ఓవర్‌లోడ్ ఉన్నట్లు భావిస్తున్నారు.

# చేవెళ్ల రహదారి రక్తసిక్తం

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్

## 19 మంది దుర్మరణం.. 25 మందికి గాయాలు

## మృతుల్లో పసికందుతో పది మంది మహిళలు



**చేవెళ్ల, నవంబరు 3, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల వద్ద ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సును వేగంగా వచ్చిన కంకర టిప్పర్ ఢీకొట్ట డంతో 19 మంది మృత్యువాత పడ్డారు. మరో 25 మంది గాయాల పాల య్యారు. ఈ విషాద సంఘటన సోమవారం హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. తాండూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న తాండూర్ డిపో బస్సు (టిఎస్34టిఎ 6354)ను ఎదురుగా రాంగ్‌రూట్‌లో వస్తున్న కంకర టిప్పర్ (టిజి06టి.3879) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 19 మంది దుర్మరణం చెందారు.

అదేసమయంలో వెనక నుంచి మరో బస్సులో వస్తున్న మహిళా పోలీసు బృందం వారిని కాపాడేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. మృతదేహాలను బయటకు తీసుకునేందుకు మూడు గంటల సమయం పట్టింది. పటాన్‌చెరు నుండి వికారాబాద్ వైపు వెళ్తున్న కంకర టిప్పర్ చేవెళ్ల మండలం మీర్జాగూడ మలుపు వద్ద బస్సును ఢీకొట్టింది. రోడ్డుపైన గుంత ఉండడంతో టిప్పర్ డ్రైవర్ గుంతను తప్పించబోయి ఎదురుగా వస్తున్న బస్సు ను అతివేగంగా ఢీకొట్టాడు. టిప్పర్‌లో ఉన్న కంకర మొత్తం బస్సులోపలికి పడి ప్రయాణికులను కప్పేసింది. ఒకవైపు టిప్పర్, మరోవైపు కంకరమీద పడ టంతో ప్రయాణికులు ఆర్తనాదాలు మిన్నంటాయి. ఊపిరి ఆడక 19 మంది అక్కడికక్కడే మరణించారు.

**మృతులు..**

1.కల్పన(45)-బోరబండ, 2.తారిఫ్‌బాయ్-ధన్నారం తండా, 3.అఖిలా రెడ్డి- యాలాల, 4.నాగమణి- కర్ణాటక, 5.గున్నమ్మ-బోరబండ, 6.మాగల హనుమంతు- నీటూర్, 7.షేఖ్ కాలేద్ హుసేన్-తాండూర్, 8.తబస్సుమ్ జాహ - తాండూర్, 9.నందిని - తాండూర్, 10.డ్రైవర్ దస్తగిరి బాబా-మంతటి, 11. తళియాబేగం- తాండూర్, 12.బందప్ప- హాజీపూర్, 13.లక్ష్మి- హాజీపూర్, 14.ముస్కన్ బేగం-తాండూర్, 15.ఆకాష్ కమ్లే -తాండూర్, 16.సాయిప్రియ- తాండూర్, 17.తనూష - తాండూర్, 18.40 రోజుల పసికందు (తాండూర్), 19.కె.వెంకటమ్మ - తాండూర్.

**గాయపడిన వారు..**

వెన్నెల (మల్కాజిగిరి), రవి (వికారాబాద్), మహమద్ యూనిస్(తాండూర్), అన్సూజ (గోంగుపల్లి),సుజాత (అస్తెపూర్), రాజా(తాండూర్), వెంకటయ్య (వికారాబాద్), అబ్దులల్ రజాక్(వికారాబాద్), బుజ్జిభాయ్ (దన్నారం), అశోక్ కుమార్ రెడ్డి(దౌల్తాబాద్), నవీన్ (యాలాల్), నందిన(దారుర్), శ్రీను (తాండూర్),బస్వరాజ్ (కోకట్), ప్రేరణ (వికారాబాద్), శ్రీసాయి(తాండూర్), అక్రమ్ (తాండూర్), అస్లామ్ (తాండూర్), జయసుధ (కేరెల్లి),జగదీష్ (బీరారెడ్డిపల్లి), అబ్దుల్‌వాజిత్ (తాండూర్).

## టిప్పర్ దూకుడును ముందే గమనించాం

**మా బస్సును డ్రైవర్ రోడ్డు కిందకు దింపాడు**

**అయినా టిప్పర్ వచ్చి ఢీకొట్టింది**



బస్సు ప్రమాదం ఉదయం 6:40 నుంచి 7 గంటల మధ్యలో జరిగింది. మేము ప్రయాణించే బస్సు నెమ్మదిగానే వెళుతోంది. టిప్పర్ చాలా వేగంగా దూసుకొచ్చింది. అది గమనించిన బస్సు డ్రైవర్ మా బస్సును రోడ్డు కిందకు దింపాడు. అయినా టిప్పర్ వచ్చి ఢీకొట్టింది. చిట్టెంపల్లి దగ్గర ఓ ప్రయాణికురాలికి టికెట్ ఇచ్చి ఇలా కూర్చున్నాం అంతే. ప్రమాదం జరిగిపోయింది. అది జరుగుతది అనే విషయం కూడా తెలియకుండా వేగంగా జరిగిపోయింది. కొంతమంది పోలీసులు కూడా సిటీకి వెళ్లడానికి బస్సు ఎక్కారు. ప్రయాణికులతో పాటు ఉద్యోగులు, విద్యార్థులు కూడా ఉన్నారు.

- రాధ, బస్సు కండక్టర్

# ప్రమాదంపై సిఎం రేవంత్ దిగ్భ్రాంతి.. కీలక ఆదేశాలు

**హెల్త్ ఎమర్జెన్సీ తరహాలో గాంధీ, ఉస్మానియాలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఉత్తర్వులు**

**ప్రమాదంపై ప్రధాని మోడీ సంతాపం, రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన**

**ఘటనా స్థలానికి వెళ్లిన మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు, ఎపి సిఎం చంద్రబాబు, పవన్, లోకేశ్, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, కెటిఆర్ స్పందన**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 3:** రంగారెడ్డి జిల్లాలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదవార్త తెలియగానే ఆయన తక్షణమే స్పందించి, సహాయక చర్యలను ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలని ఉన్నతాధికారులను సూచించారు. క్షతగాత్రుల ప్రాణాలు కాపాడటమే ప్రథమ కర్తవ్యమని సీఎం స్పష్టం చేశారు. గాయపడిన వారిని వెంటనే హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు తరలించి, అత్యుత్తమ వైద్యం అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీలను ఆదేశించారు. అందుబాటులో ఉన్న మంత్రులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని కోరారు. బాధితుల కోసం గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, పరిస్థితి విషమంగా ఉన్న వారిని కాపాడేందుకు నిపుణులైన వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఘటనను ఒక హెల్త్ ఎమర్జెన్సీ తరహాలో పరిగణించి, అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం అత్యంత బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ మేరకు ప్రధాని మోదీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. ప్రమాద మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. అదేవిధంగా గాయపడిన వారికి రూ. 50 వేల పరిహారం అందిస్తామని వెల్లడించారు.



ఈ ప్రమాదంపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన వెంటనే ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. ఆర్టీసీ అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకోవాలని ఆదేశించారు. చేవెళ్లలో సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో 19 మంది మరణించడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. మరోవైపు, ఈ దుర్ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని పవన్ కల్యాణ్ కోరారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు నారా లోకేశ్ పేర్కొన్నారు.

**మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కెసిఆర్, కెటిఆర్**

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొన్న దుర్ఘటనలో 19 మంది ప్రయాణికులు మృతి చెందడం పట్ల వారు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కేసీఆర్ స్పందిస్తూ... ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ప్రమాదంపై విచారణకు ఆదేశం: మంత్రి పొన్నం

**చేవెళ్ల నవంబరు 3, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం పై విచారణకు ఆదేశించామని మంత్రి పోన్నం ప్రభాకర్ ఆదేశించారు, ప్రమాదం తెలిసిన వెంటనే ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి ప్రమాదసంఘటన స్థలం ను పరిశీలించారు, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు, మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబాలకు అప్పగించాలని ఆదేశించారు, మంత్రి ఆదేశాల మేరకు చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి హైద్రాబాద్ ఉస్మానియా, గాంధీ, నిమ్స్ ఆసుపత్రుల నుండి హుటాహుటిన వచ్చిన డాక్టర్లు, మృతదేహాలను పోస్టుమార్ట చేసారు, తాండూర్ నుండి హైద్రాబాద్‌కు వెళ్తున్నటువంటి ఆర్టీసీ బస్సును టిప్పర్ రాంగ్‌రుట్లో వచ్చి బస్సును ఢీ కోట్టడం వల్లనే ప్రమాదం జరిగిందన్నారు, టిప్పర్‌లో కంకర ప్రయాణికుల పై పడి కప్పడంతో ప్రయాణికులు ఊపిరాడక మరణించారన్నారు, వెంటనే సంఘటన స్దలం నుండి క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రులకు తరలించారని, మరణించిన 19 మంది కుటుంబాలకు ప్రభుత్వం తరుపున ఏడు లక్షల రూపాయలు సహాయం అందిస్తుందని, గాయాలైనవారికి మెరుగైన వైద్యం, రెండు లక్షలు అందిస్తామని తెలిపారు, మృతదేహాలను పరిశీలించి ఆసుపత్రిలో ఉన్న క్షతగాత్రులను రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, అడిషినల్ డిజిపి మోహాన్ భగవత్. సైబరాబాద్ కమిషనర్ మహంతి. జిల్లా గ్రంధాలయ చైర్మెన్ మధుసుదన్ రెడ్డి మాజి ఎమ్మెల్యే రత్నం సబితా ఇంద్రారెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారయణ రెడ్డి పరమార్శించారు,



# మృతుల్లో 13 మంది తాండూరు ప్రాంతీయులే

**జిల్లా అంతటా విషాధం**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి/తాండూరు:** మీర్జాగూడ రోడ్డు ప్రమాదం జిల్లాను విషాధ ఛాయల్లో ముంచేసింది. బస్సులో ప్రయాణిస్తున్న 70 మంది లో 19 మంది మృత్యువాత పడ్డారు. అందులో తాండూరు పరసర ప్రాంతానికి చెందినవారే 13 మంది ఉన్నారు. ఆర్టీసీ (టీజీ 34టీఏ 6354)ను రాంగ్ రూట్‌లో వచ్చిన కంకర టిప్పర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

**ముగ్గురు అక్కా చెల్లెళ్లు..**



తాండూరు నియోజకవర్గంలోని యాలాల మండలం పేర్కం పల్లికి చెందిన ఎల్లయ్యగౌడు తాండూరులో నివసిస్తున్నారు. ఆయనకు ఐదుగురు సంతానం. వారిలో నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ట్రావెల్ ఏజెన్సీ నడుపు తున్న ఎల్లయ్య ఇటీవల పెద్ద కూతురు అనూష వివాహం చేశారు. రెండో కుమార్తె తనూష ఎంబీఏ చదువుతూ ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. మూడు కూతురు సాయిప్రియ కోఠీ ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ చదువుతోంది. నాలుగవ కుమార్తె నందిని అదే కాలేజీలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ అభ్యసిస్తోంది. కుమారుడు టెన్త్ చదువుతున్నాడు. గత నెల 15న అనూష వివాహం కోసం వచ్చిన కుమార్తెలను సోమవారం తాండూరులో తండ్రి బస్సు ఎక్కించాడు. పెళ్లి సందర్భంగా ఆనందంగా గడిపిన తనూష, సాయిప్రియ, నందిని చేవెళ్ల వద్ద బస్సు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఒకేసారి ముగ్గురు అక్కాచెల్లెళ్లు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబంలోనే కాకుండా పట్టణంలో విషాధఛాయలు అలముకున్నాయి. స్వగ్రామం పేర్కంపల్లిలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. తాండూరు పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన వెల్డర్ ఖాలేద్‌కు కుమార్తె సలేహా (20) వివాహం జరిపించాడు. ఆమె కాన్పు కోసం పుట్టింటికి వచ్చి మూడు నెలల క్రితం పాపకు జన్మనిచ్చింది. వారిద్దరినీ అత్తగారింటికి పంపేందుకు బస్సులో బయలుదేరారు. ప్రమాదంలో ఖాలేద్ సహా తల్లీ కూతురు ప్రాణాలు కోల్పోయారు. ఒకే కుటుంబంలో ముగ్గురు చనిపోవ డంతో తాండూరులో విషాధఛాయలు అలముకున్నాయి. వారి కుటుంబీ కులను ఓదార్చడం స్థానికులకు సాధ్యం కాలేకపోయింది. ఇలా ఉండగా పట్ట ణంలోని విశ్వంభర కాలనీకి చెందిన అబ్దుల్ మాజీద్ బేకరీలో పని చేస్తుంటారు. తన భార్య తబస్సుమ్ (35)తో పాటు ముగ్గురు పిల్లలతో కలిసి హైదరాబాద్ బయలుదేరారు. ప్రమాదంలో కంకరలో చిక్కుకున్న తబస్సుమ్ ప్రాణాలు వదిలింది. ఆమె పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. కర్నాటక రాష్ట్రం ముదేళ్లికి చెందిన నాగమణి (45) కూడా ప్రమాదంలో మృత్యువాతపడింది.

**పర్‌ఫెక్ట్ డ్రైవర్‌కు ఆఖరి డ్యూటీ..**

మంచి డ్రైవర్‌గా గుర్తింపు పొందిన బస్సు డ్రైవర్ దస్తగిరి బాబా ఈ ప్రమాదంలో చనిపోయారు. బషీరాబాద్ మండలం మంతట్టికి చెందిన దస్తగిరి (45) ఇరవై యేళ్లుగా తాండూరులో నివాసం ఉంటున్నారు. ఇద్దరు భార్యలు, సంతానం ఉన్నారు. పదేళ్లుగా ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. హైర్ సర్వీసు బస్సుకు డ్రైవర్‌గా ఇటీవల విధుల్లో చేరాడు. రోజూ హైదరాబాద్‌కు తాండూరు నుంచి బయలుదేరే మొదటి బస్సుసర్వీసు ఇదే. ఆసుపత్రి నిమిత్తం హైదరాబాద్ వెళ్లిన యాలాల మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు లక్ష్మీ, బందెప్ప కూడా ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

# ప్రాణాలు తీసిన గుంత

**యమపురికి పిలుపు చేవెళ్ల రోడ్డు మలుపులు**

**చేవెళ్ల నవంబరు 3, ప్రభాతవార్త :** రోడ్డుమధ్యలో ఉన్న గుంతను తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసి బస్సును టిప్పర్ ఢీకోనడంతో ప్రమాదం జరిగింది. రోడ్డుపై ఉన్న గుంతనే 19 మంది ప్రాణాలు బలిగోంది. చేవెళ్ల రోడ్డు మలుపులు యమపూరికి పిలుపులుగా మారుతున్నాయి బస్సుడ్రైవర్ వెనుకాల కూర్చున్నవారందరు మృతి చెందగా కండక్టర్ వెనుకవైపున కూర్చున్న వారందరు, ప్రాణాలతో భయటపడ్డారు. రాంగ్‌రూట్లో టిప్పర్ ఢీకోట్టడంతో మీర్జాగూడవద్ద ప్రమాదం జరిగింది. మహారాష్ట్రాకు చెందిన ఆకాష్ కామ్లే నిర్లక్ష్యం కారణంగానే రోడ్డు ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. చేవెళ్ల బీజాపూర్ రహదారిలో ఎప్పుడు ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. అప్పాజెంక్షన్ నుండి మన్నెగూడ వరకు రోడ్డు పనులు జాప్యం కావడంతో రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.చేవెళ్ల మండలం మిర్జాగూడ వద్ద జరిగిన ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోవడం ప్రతి ఒక్కరిని ఉక్కిరి బిక్కిరి చేసింది.

# చేవెళ్ల ప్రమాదానికి టిప్పర్ ఓవర్‌స్పీడ్, ఓవర్‌లోడ్ కారణమని నిర్ధారణ

**టిప్పర్ డ్రైవర్ మద్యం తాగినట్లు లభించని ఆధారాలు, ప్రమాదంపై కేసు నమోదు**

**హైదరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త:** నగర శివార్లలోని చేవెళ్లలో సోమవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి కంకర లోడ్‌తో వెళుతు న్న టిప్పర్ ఓవర్ స్పీడ్‌తో పాటు ఓవర్ లోడ్ కారణమని పోలీసుల విచారణలో తేలింది. టిప్పర్ డ్రైవర్ ఆకాష్ కమ్లే మద్యం తాగినట్లు ఆధారాలు లభించలేదు. ఈ దుర్ఘటనలో 19 మంది మరణించగా 25 మంది గాయపడ్డారు. చేవెళ్ల.. తాండూరు మార్గంలో ఉదయం ఏడు గంటల సమయం లో ఈ దుర్ఘటన జరిగింది. టిప్పర్ సామర్థ్యం 30 టన్నులు కాగా 60 టన్నుల వరకు కంకరను నింపుకుని చేవెళ్ల నుంచి తాండూరు వైపు వెళుతో ంది. ఇదే సమయంలో తాండూరు నుంచి 70 మందికి పైగా ప్రయాణీకులతో తాండురు డిపో బస్సు హైదరాబాద్ వస్తోంది. మిర్జాగూడ వద్ద రహ దారిపై గుంత వుండగా, ఇక్కడ రహదారి చిన్నదిగా వుంది. ఈ సమయంలో సుమారు వంద కిలోమీటర్ల వేగంతో వెళుతున్న టిప్పర్ రహదారిపై వున్న గుంతను తప్పించపోయి ఎదురుగా వస్తున్న బస్సును కుడివైపు భాగంలో ఢీకొంది. బస్సును టిప్పర్ ఢీకొన్న తరువాత ఒక్కసారిగా బస్సుపై ఒరిగి పోవడంతో అందులోని కంకర బస్సు కుడివైపు కూర్చున్న ప్రయాణీకులపై పడింది. ఇదే సమయంలో టిప్పర్ బరువుకు బస్సు కుడివైపు భాగ ం తీవ్రంగా దెబ్బతింది. ఈ ఘటనలో టిప్పర్ డ్రైవర్‌గా వున్న ఆకాష్ కమ్లే (34)తో పాటు బస్సు డ్రైవర్ దస్తగిరి బాబా సహా బస్సులోని 17 మం ది ప్రయాణీకులు మరణించారు. మరో 25 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో టిప్పర్ యజమాని లక్ష్మణ్ కూడా వున్నాడు. ఇతన్ని నిమ్స్‌కు తరలించారు. ప్రమాదంలో మరణించిన వారి భౌతిక కాయాలకు చేవెళ్ల ఆసుపత్రిలో పోస్టుమార్ట ం నిర్వహించారు. ఇందులో ఆర్టీసీ బస్సు డ్రైవర్, టిప్పర్ డ్రైవర్‌ల మృతదేహాలపై వున్న గాయాలను వైద్యులు పరిశీలించి నివేదిక రూపొందించారు. టిప్పర్ డ్రైవర్ మద్యం తాగినట్లు వార్తలు రావడం తో ఆ కోణంలోనూ వైద్యులు పరిశీలించగా దీనిపై ఎలాంటి ఆధారాలు లభించలేదు. అయినప్పటి కీ శరీరంలోని కొన్ని భాగాలను తదుపరి పరీక్షల కోసం ఫోరెన్సిక్ లాబ్‌కు పంపారు. ఇక్కడ జరిగే పరీక్షలకు సంబంధించిన ఫలితాలు రావడానికి కొంత సమయం పట్టే వీలుందని పోలీసులు తెలి పారు. కాగా ఘటన జరిగిన ప్రాంతాన్ని శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, సైబరాబా ద్ పోలీసు కమిషనర్ అవినాష్ మొహంతి సహా పలువురు అధికారులు సందర్శించి ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించారు. బస్సుపై ఒరిగిన టిప్పర్‌ను జెసిబి సహాయంతో పక్కకు తీసి న తరువాత దానిని పరిశీలించారు. ఘటనా స్థలిని ఆర్టీసీ అధికారులతో పాటు రవాణా శాఖ అ ధికారులు కూడా పరిశీలించారు. ఈ ఘటనలో ఆ ర్టీసీ బస్సు పూర్తిగా నుజ్జు నుజ్జుగా మారింది. ఈ దుర్ఘటన కారణంగా చేవెళ్ల...తాండూరు మార్గంలో కొన్ని గంటల పాటు ట్రాఫిక్ నిలిచి పోయిం ది. కాగా ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ఎడమ వైపు వున్న ప్రయాణీకులు ఈ దుర్ఘటనపై పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సుతో పాటు, టిప్పర్ కూడా వేగంగానే వున్నాయని తెలిపారు. టిప్పర్ డ్రైవర్ మితిమీరిన వేగంతో వస్తున్నట్లు, రోడ్డుపై గు ంతను తప్పించబోయి ఒక్కసారిగా అదుపుతప్పి బస్సును ఢీకొన్నట్లు వారు తెలిపారు. ఈ ఘటనపై బస్సు కండక్టర్ రాధ ఇచ్చిన ఫి ర్యాదుపై టిప్పర్ డ్రైవర్ ఆకాష్ కమ్లేపై కేసు నమోదు చేశారు.


దేవాదాయ ధర్మాదాయ శాఖ- తెలంగాణ ప్రభుత్వం

**శ్రీ లక్ష్మి నరసింహ్మ స్వామి దేవస్థానము - సింగవట్నం**

కొల్లాపూర్ మండలం - నాగర్ కర్నూల్ జిల్లా

నెం. 16/SLNSD/2025. తేది:03.11.2025

**వివిధ హక్కుల - సీల్డ్ టెండర్-కమ్-బహిరంగ వేలం**

సదరు దేవస్థానములో ఈ క్రింద చూపబడిన హక్కుల గురించి తేది:17.11.2025 సోమవారం రోజు దేవస్థాన ప్రాంగణం నందు సీల్డ్ టెండర్-కమ్-బహిరంగ వేలములు నిర్వహించ బడుచున్నవి. ఆసక్తి గలవారు తేది: 11.11.2025 నుండి 17.11.2025 ఉదయం గం.11.00 లలోగా టెండర్ షెడ్యూల్ పొంది, నిర్ణీత డిపాజిటు చెల్లించి, DD ఒరిజినల్ ప్రతిని సమర్పించి, పూర్తిచేసిన టెండర్ ఫారంతో పాటు DD జిరాక్స్ ప్రతిని అదేరోజు గం.12.00 లలోగా టెండర్ బాక్స్ నందు దాఖలుచేసి, గం.12.30ల నుండి జరుగును బహిరంగ వేలంలో పాల్గొనవలసినదిగా కోరనైనది.

| నెం. | హక్కు వివరము | కాల పరిమితి | D.D. రూ. | టెండర్ విధానం & సమయం |
|---|---|---|---|---|
| 1 | కొబ్బరికాయలు అమ్ముకొను హక్కు | తేది: 01.01.2026 నుండి 31.12.2026 (ఒక సంవత్సరం) | 5,00,000.00 | సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలములు తేది:17.11.2025 గం.10-00 లకు సింగవట్నం దేవస్థానం వద్ద |
| 2 | కొబ్బరిచిప్పలు సేకరించుకొను హక్కు | | 50,000.00 | |

Note: వివరములకు Mob. No. 9951423875/9550536428/9000128342 లను సంప్రదించగలరు.

ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ & చైర్మన్

Dipr.No. 10133-PP/CL/Advt/1/2025-26, Dt: 03.11.2025 సం./- కార్యనిర్వహణాధికారి

వార్త

ఏ కాలంలోనైనా, ఏ జాతికైనా దాని భవిష్యత్తు ఇరవై ఐదేళ్లలోపు వయస్సున్న యువకుల భావాలపైనే ఆధారపడి ఉంటుంది.

-కార్లయిల్

# ఈ చావులను ఆపలేరా?


ఎవరి చావు ఎప్పుడొస్తుందో ఎవరికీ తెలియదు, ఎలా వస్తుందో అసలే తెలియదు.కానీ ఎందుకనో తెలుగు రాష్ట్రాల్లో ఈ మధ్యచావులు కట్టకట్టుకుని వస్తున్నాయి. అదేమిటో కానీ మొన్న రాయలసీమలో, నిన్న ఉత్తరాంధ్రలో, ఇవాళ్ల ఉదయం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడలో ఓటిప్పర్ ఢీకొని ఆర్టీసీ బస్సులోని 24 మంది మృతులైనారు. తెల్లవారు జామున 4.45కి తాండూరులో బయలుదేరిన పల్లెవెలుగు బస్సులో ప్రమాదం జరిగే సమయానికి 70 మంది ప్రయాణికులున్నారు. 50 టన్నుల కంకరతో వస్తున్న టిప్పర్ బస్సును ఢీకొనగా కుడిచేతి వైపు భాగాన్ని బలంగా ఢీకొని అటువైపు కూర్చున్న 21 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు చనిపోయారు. మరికొంత మంది పరిస్థితి విషమంగా ఉంది. ప్రయాణం జరిగిన తీరు బాగా విచిత్రంగా ఉంది. బస్‌ను టిప్పర్ ఢీకొని ముందు భాగాలు ధ్వంసం అవడం మామూలే. కానీ టిప్పర్ అతివేగంతో వస్తున్నట్లుంది.అదుపు తప్పి నేరుగా బస్సు కుడివైపు అర్ధభాగంలో టిప్పర్ కుడివైపు భాగాన్ని చీల్చేసింది. ఆ సందర్భంలోనే టిప్పర్ బస్సు మీద వాలిపోగా కుడివైపు ప్రయాణికుల మీద కంకర రాళ్లు జారిపడ్డాయి. కంకర కింద చాలా మంది ప్రయాణికులు ఉండిపోయారు. ఇంతటి ఘోరం కనీవినీ ఎరుగని విషాదంగానే పరిగణించాలి. కొన్నాళ్ల క్రితం బోయింగ్ విమాన ప్రమాదంలో లెక్కకు మించి ప్రయాణికులు తనువు చాలించారు. ఆ తరువాత ఎన్నో విమాన ప్రమాదాలు వినవచ్చాయి. చిన్నవైనా, పెద్దవైనా ప్రమాదాలు, వాటి తాలూకు చేదు స్మృతులు చూసి చూసి జనం విసుగెత్తిపోయారు.చావులు లెక్కల నమోదు వారికీ చిరాకు వేసింది. ఆ తర్వాత కుంభకోణం నుంచి భక్తజన సందోహంతో తొక్కిసలాటలు మితిమీరిన వేగం, నిర్లక్ష్యం, నియమనిబంధనలు పాటించకపోవడంతో బస్సులు, వామనాల ప్రమాదం, అవాంఛనీయ సంఘటనలు. వాటి మీద వచ్చే కథనాలతో ఆత్మీయుల ఆక్రోశమేకాదు, మానవతావాదుల్లో అనుకోని అలజడి. ఇవన్నీ మామూలే అని సరిపెట్టుకోలేం. గత యేడాదిలో జరిగిన ప్రమాదాల జాబితా చూస్తే కొల్లేటి చాంతాడంత. నిర్లక్ష్యానికి నిర్లక్ష్యానికి మధ్య, ప్రమాదానికి ప్రమాదానికి మధ్య, విషాదానికి విషాదానికి మధ్య ఎలాంటి గ్యాప్ లేకుండా తరచు ప్రమాదాల బారిన పడి అమాయకులు బలౌవుతున్నారు. ఇండియాలో గతంలో జరిగిన పెద్ద ప్రమాదాలు, భారీ సంఖ్యలో ప్రాణనష్టం వంటి అంశాలు చూస్తే ఏ ప్రమాద ఘటన మరో ప్రమాద ఘటన నకలు కాదు. దేని ప్రత్యేకత దానిదే. ఈ కారణాలను విశ్లేషించుకుని అలాంటి మరో ప్రమాదం జరగకుండా చూడడం ప్రభుత్వాల బాధ్యత. ప్రమాదం జరిగిన వెంటనే బాధ్యతగల అధికార్లు చేస్తున్న ప్రకటనలతో జనంలో ఇంకా అనుమానాలు పెరిగిపోతున్నాయి. కేవలం పరిహారాలు ప్రకటించి సరిపెట్టుకోమంటే ఎవరూ ఊరుకోవడం లేదు. అయినా మళ్లీ మామూలే. ఇండియాలో గతంలో ఇలాంటి ప్రమాదాలు ఎందుకు ఎలా జరిగాయో తెలిసికూడా మరోసారి అలాంటి ప్రమాదం జరగకుండా ప్రభుత్వాలు తీసుకున్న చర్యలేవీ కనపడవు. ఎక్కడ ప్రమాదం జరిగినా ప్రమాద దృశ్యాలు మనసును కలిచివేస్తాయి.ప్రమాద సమయంలో టిప్పర్ డ్రైవర్ తాగిఉన్నాడని, మితిమీరిన వేగంతో బండి నడుపుతున్నాడని, ప్రమాదాన్ని గమనించినా టిప్పర్‌ను కంట్రోలు చేసుకోలేక బస్సును ఢీకొన్నాడని సమాచారం. అతను, బస్ డ్రైవర్ మరో 4 పురుష ప్రయాణికులు, 12 మంది మహిళా ప్రయాణికులు, ఒక పసిపాప చనిపోయిన వారిలోఉన్నారు.వారిని కబళించేందుకు ఓ మృత్యు శకటం అమిత వేగంతో వస్తున్నట్లు వారిలో ఎవరికీ తెలియదు. ప్రమాద ఘటనపై పాలకుల దిగ్భ్రాంతులు, సంతాపాలు, పరిహారాలు, ప్రకటనలు, ఘటనపై విచారణ వంటివన్నీ కంటితుడుపు చర్యలే! మృతుల్లో అధికులు తాండూరు వాసులే. ఓవర్‌లోడ్, ఓవర్ స్పీడ్‌లు ఇక్కడ వారిప్రాణాలు తీసాయి. కేవలం 33 టన్నుల మేరకే లోడ్ పరిమితి ఉండగా 50 నుంచి 60 టన్నుల సరుకు రవాణా చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘన స్పష్టంగా కనబడుతోంది. ఇలా అధిక లోడ్ చేయడం ఇదే మొదటిసారేమీ కాదు. అధికారులు పూర్తిస్థాయిలో చెక్ పెడితే తప్ప వాహనదారుల్ని నియంత్రించడం కష్టం. ప్రమాదం ఎంత తీవ్రత ఉన్నా దానికి కారణం అతివేగం. నిర్లక్ష్యమేనని వేరే చెప్పనవసరం లేదు. డ్రైవర్ల మద్యపాన ప్రభావానికి లోనయ్యాడా, లేదా! అనే విషయాలను పోలీసులు క్రమం తప్పకుండా చేయాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ యేడాది ఇంతవరకు జరిగిన ప్రమాదాల్లో 353మంది మరణించారు. తెలంగాణ ప్రయాణికులు 104 మంది మృతి చెందినవారిలో ఉన్నారు. తాజా ప్రమాదానికి కారణం షాద్‌నగర్ నుంచి బయలుదేరిన టిప్పర్ అధికలోడ్‌తో వెళ్తూ స్టీరింగ్‌ను అదుపు చేయలేకపోవడం,ఎదురొచ్చే వాహనాల తాకిడికి తొందరపాటు నిర్ణయం, తీసుకోవడం వల్లనే ఈ ప్రమాదం జరిగింది. ఈ బస్సులోనే తాండూరుకు చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు కూడా మృతిచెందారు. ఇటువంటి ఘోర విషాద సంఘటనలో ఒకే కుటుంబం వారు చనిపోవడం మరీ హృదయవిదారకం. రహదారుల్లో తిరిగే వాహనాలు వేగ నియంత్రణ ప్రభుత్వం కర్తవ్యం. చిత్తశుద్ధితో ముందుకు సాగాలి. అదేమిటో కానీ గతుకుల గుంతల రోడ్డుల్లో వెళ్లే వాహనాలకు మరిన్ని అవస్థలు తోడై చివరికి చావు అంచుకు తీసుకెళ్తుంది.అధిక లోడు, అమిత వేగంతో వెళ్లేవాహనాలను ప్రాథమిక దశలోనే కట్టడిచేయడం అవసరం.

యుద్ధానికి ఎవరూ కారణాలను అన్వేషించరు. ఫలితం ఏమిటనే అందరూ ప్రశ్నిస్తారు.



సెనెకా

మీరు తప్ప మీకు శాంతిని ఎవరూ ప్రసాదించలేరు. సిద్ధాంతాలు పాలనలో విజయాన్ని సాధించినప్పుడే మీకు మానసిక శాంతి లభిస్తుంది.



ఎమర్సన్

## ప్రజావాక్కు



### భక్తి ఉత్సాహం కాదు - జాగ్రత్తే జీవం

ఆంధ్రప్రదేశ్‌లోని కాశీబుగ్గ దేవాలయంలో జరిగినరద్దీ ఘటనలో ఎనిమిది మంది మహిళలు, ఒకచిన్నారి మృతి చెందడం ఎంతో విషాదకరమైనసంఘటన. భక్తి భావంతో దేవాలయానికి వచ్చిన వారుప్రాణాలు కోల్పోవడం మనం దరినీ కలచివేస్తోంది. ఇటువంటి ఘటనలు సాధారణంగా సరైన ప్రణాళికల లోపం, భద్రతా చర్యల తక్కువతనం, జనసందోహ నియంత్రణలో విఫలం వంటి కారణాలతో జరుగుతుంటాయి. ప్రభుత్వం, దేవాలయ నిర్వాహకులు ముందుగానే పెద్ద సంఖ్యలో భక్తులు చేరుతారని అంచనా వేసి, తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలి. బారికేడ్లు, ఎమర్జెన్సీ మార్గాలు, తగిన వైద్య సదుపాయాలు, పోలీసులు, వాలంటీర్ల సమన్వయం తప్పనిసరి. అంతేకాదు, భక్తులు కూడా క్రమశిక్షణ పాటిస్తూ, నెమ్మదిగా కదలాలి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### మితిమీరిపోతున్న వాగ్దానాలు

బీహార్ రాష్ట్రఅసెంబ్లీకి జరగనున్న ఎన్నికలలో పలు పార్టీలవాగ్దానాలుమితిమీరిపోతున్నాయి.ముఖ్యంగా ఇండియా కూటమిఅభ్యర్థి మహాగట్‌బంధన్‌పార్టీనాయకుడు, ముఖ్యమంత్రి పదవిని ఆశించే తేజస్వియాదవ్ ప్రతీ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇస్తామని ప్రజలను మభ్యపెడుతూ ఓటర్లను ఆకర్షిస్తున్నారు.అదీకాక మరెన్నో సంక్షేమపథకాలనుప్రకటిస్తూపోతున్నారు.దీనికయ్యే ఖర్చు రాష్ట్ర వార్షిక బడ్జెట్‌కు రెట్టింపుపైనే అని ఆర్థిక నిపుణులు లెక్కలు వేసి చెప్పారు. ఈ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారువస్తే ఆప్రభావం రాబోయే తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల మీద బి.జె.పి. ప్రభావం గట్టిగా ఉండవచ్చు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### సెలవులు మంజూరు చేయాలి

రాష్ట్రంలోని వివిధగురుకులలో పేదవిద్యార్థులకు విద్యతో పాటుగా రుచికరమైన వంటల కోసం ప్రభుత్వం ఆహార మేనును పెంచడం చాలా సంతోషకరం. డిప్యూటీ వార్డెన్ ఇచ్చిన సరుకులు పిల్లలసంఖ్యను బట్టివంట మనుషులకు ఇవ్వడం జరుగుతుంది.కానీ వంట సిబ్బంది ఆహార పదార్థాలుసంచులు,బ్యాగ్స్ లలోఇంటికితీసుకొనిపోవడం వలన కొన్నిఇబ్బందులు జరుగుతున్నాయి.డిప్యూటీ వార్డెన్ పర్యవేక్షణలోవంట వర్కర్స్ సెలవులు మంజూరు కావాలి.

- రాపాక రవీందర్, జనగాం

### భాషపై వ్యతిరేకత

తమిళనాడులో ఇతర రాష్ట్ర భాషఅమలుపై వ్యతిరేకత దేశవ్యాప్తంగా చర్చలకు కారణమైంది. ఈ వ్యతిరేకత కేవలం భాషా సమస్యకాదు,ఇది రాష్ట్రపు సాంస్కృతిక, భౌగోళిక, సామాజిక, చరిత్రాత్మక అస్తిత్వానికి సంబంధించినది. తమిళనాడు ప్రజలు తాము పుట్టిన భాష,సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడానికి పదేపదే పోరాటంచేస్తున్నారు.వారిపై హిందీ భాషను బలవంతంగా రుద్దడంపై వారు వ్యతిరేకిస్తున్నారు. భాషా పరిరక్షణకు చట్టాలు, ప్రభుత్వ మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, కేంద్రప్రభుత్వం ఒక భాషకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా రాష్ట్రానికి అమలు పరచాలని ప్రయత్నించడం బాధాకరం. ఇది స్థానిక జీవనశైలిని, భిన్నత్వాన్ని, సామాజిక సమన్వయాన్ని దెబ్బతీస్తుంది.భాషకేవలం సంభాషణపద్ధతికాదు,అది గుర్తింపు. భావప్రవాహం, చరిత్ర, సాంప్రదాయాల ప్రతిబింబం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అమెరికాను నమ్మకూడదు

ఆసియాన్ తూర్పు దేశాలకూటమి, మొత్తంగా ఆసియాన్ కూటమిలలో భారత్ ప్రముఖపాత్ర పోషించే అవకాశంఉంది. ఎందుకని ఇంతకు ముందు అవలంబించిన తూర్పు దేశాల వైపు చూపు.ఇప్పుడుఅవలంబిస్తున్న నీబర్‌దేశాలను బలంగ తయారు చేసుకోవడం వంటి అంశాలు ఇప్పుడు మనముందు ఉన్న అంశాలుగా ఉన్నాయి. అందుకే అమెరికా కూడా ఆసియా పసిఫిక్ కాకుండా ఇండోపసిఫిక్‌గా పెరు మార్చడంచూసాం. బలహీనమైన మూడో ప్రపంచ దేశాలను చెయ్యి చాచడం కూడా మనం గమనిచవచ్చు. జీ20 కూటమిలోకి ఆఫ్రికన్ దేశాల కూటమిని చేర్చడంలో భారత్ ముఖ్యపాత్ర పోషించింది. అయితే అమెరికాను నమ్మదగ్గ మిత్రునిగా ఎప్పుడు పరిగణించకూడదు.

- భారత అవినాష్, జనగామ

### శ్రీకాకుళం ఘటన బాధాకరం

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వెంకన్న ఆలయంలో ఏకాదశి సందర్భంగా భక్తులు విపరీతంగా వస్తారని ముందే సమాచారం ఉన్నా, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేకపోవడం వల్ల తొమ్మిది మంది భక్తుల ప్రాణాలు పోయాయి. ఇప్పుడు ఈ ఘటనను ప్రైవేట్ ఆలయం పేరుతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఘటన అందరినీ కలచి వేస్తుంది. మృతుల కుటుంబాలకు కనీసం రూ.25 లక్షల పరిహారంఇవ్వాలి. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలి.

- కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# దేశాల మధ్య యుద్ధం కాదు.. శాంతి కావాలి

***ప్రస్తుతం కృత్రిమ మేధస్సు ఉద్భవించి భవిష్యత్తుతో పరిస్థితులు, పరిణామాలు ఏరూపు దిద్దుకుంటాయో అన్న ఆలోచనతో కూడిన భయాన్ని కలిగి స్తున్నాయి. సైన్యాలతో ఆయుధాలతో భౌతికంగా దేశాలను ఆక్రమించుకొనే స్థితి ఇప్పుడు లేదు. కాలు కదపకుండా, ఆయుధం బయటపెట్టకుండానే ఆక్రమణ సాగించే పరిస్థితులు వస్తాయా అన్న ఆందోళనలో దేశాలు ఉలిక్కి పడుతున్నాయి. అందుకనే ఏ దేశమైనా కాలానుగుణంగా, విపత్కర పరిస్థితుల నేపథ్యంలో సమదృష్టితో సమతుల్యత పాటించే నేర్పులో చాకచక్యంగా దేశాల మధ్యశత్రుత్వ భావాలను రూపుమాపి స్నేహభావాన్ని పటిష్టం చేసే నాయకుడు రావాలని కోరుకోవటంలో తప్పులేదు.శాంతి సందేశంతో, ప్రేమానురాగాలు స్నేహ, సుహృద్భావ వాతావరణం ఏర్పరిచే నాయకుడి కోసం ఎదురుచూస్తున్నాయా గ్లోబల్ వ్యవస్థకు ఎక్కడినుంచి ఎప్పుడు వస్తారో ఎదురు చూడక తప్పదేమో!***



రావులపాటి సీతారాంరావు

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పెద్ద పజిల్‌గా మారారు. మాటలకూ, చేతలకూ పోలికే ఉండదు. చెప్పేదానికీ, చేసే దానికీ, ఎంత ప్రయత్నించినా లంకె అందటంలేదు. అగ్రదేశంగా భావిస్తున్న అమెరికా అధ్యక్షుడే ఈ విధంగా అంతర్జాతీయ అవగాహనకు అతీతంగా వివిధ దేశాలతోటి సంబంధాలు నెరుపుతుంటే ఎవరు ఏం చేయగలరు? ఒకప్రక్కన లెక్కకు మించిన సుంకాల బరువు భారత్‌నెత్తిన పెడ్తూనే మరోపక్క ప్రధాని మోడీని ప్రాణ మిత్రుడు, ఇంద్రుడు, చంద్రుడు అని ప్రకటనలు చేస్తుంటే దౌత్యసంబంధాలు చూసి భారతీయ విదేశాంగ శాఖ నిపుణులు తలలు పట్టుకుంటున్నారు. ఈ రకమైన విదేశాంగ విధానాన్ని అర్థం చేసుకోలేక, జవాబు ఇవ్వలేక సతమతమవుతున్నారు. ఆసియా, పసిఫిక్ ఎకనామిక్ కోపరేషన్ సమ్మిట్ సౌత్ కొరియాలోని జిమొంజోలో ఈ మధ్య జరిగిన సమావేశంలో మాట్లాడిన తీరు వింతగా ఉంది. మీడియా కథనాల ప్రకారం ప్రధాని మోడీ మంచివాడు, గట్టివాడు, ఆయనకు ఫోన్‌లో చెప్పాను, మీతో వాణిజ్య ఒప్పందం (ట్రేడ్ డీల్)కు దూర్చుకోలేను. కాదు, కాదు చేయలేం! పాకిస్థాన్‌తో యుద్ధం మొదలు పెట్టున్నారు. అందుకనే చేయలేం అన్నట్లు వచ్చాయి. ఈ సందర్భంలోనే పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌ను గొప్ప పోరాట యోధుడిగా పొగిడారు. అంతేకాదు 'గ్రేట్ గై' అని కూడా కితాబ్ఇచ్చారు. పాకిస్థాన్‌కు కాల్ చేసి చెప్పాను. మీతో ట్రేడ్ చేయలేం! మీరు ఇండియాతో పోరాడుతున్నారుగా అందుకని. మీ రెండు దేశాలలోనూ అణ్యదేశాల వాళ్లేఉన్నారు. లేదు,లేదు. మమ్మల్ని పోట్లాడుకోనివ్వండి అని రెండు దేశాలు అన్నాయి అనికూడా చెప్పి ద్వంద్వనీతిని ప్రదర్శించారు. ఇన్ని అలవోకగా చెప్పిన ప్రసిడెంట్ ట్రంప్ క్రితం రోజు టోక్యోలోరెండు దేశాల మధ్య యుద్ధాన్ని 24 గంటల్లోనే ఆపేసానని చెప్పటం ఎవర్నీ ఆశ్చర్యపర్చలేదు. ఆయన ఇప్పటికే చాలాసార్లు ఆ విషయాన్ని చెప్పారు కాబట్టి. భారత్, అమెరికాల మధ్య సంబంధాలు 50శాతం సుంకంతో ఇబ్బందుల్లో పడ్డాయి. రష్యా నుంచి క్రూడాయిల్ దిగుమతుల మీద 25 శాతం లేవీ కూడా విధించటంతో మరింత జటిలమయ్యాయి. ట్రేడ్ ఒప్పందాలు జరిగాయని అంటున్నా ఏ విధంగా ఇలాంటి ప్రకటనల మధ్య అవి అమలు కాబడతాయో ఎవరూ చెప్పలేకపోతున్నారు.పరిస్థితులు భారత్ అమెరికాల మధ్య ఈ విధంగా ఉన్న సమయంలోనే నిన్నగాక మొన్న రెండు దేశాలూ 10 సంవత్సరాల కాలపరిమితితో డిఫెన్స్ ఒప్పందం కౌలాలంపూర్‌లో చేసుకోవటం గమనార్హం. ముందస్తుగా డిఫెన్స్ ఇండస్ట్రీ అభివృద్ధి సాధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడటంలో సహకరించుకోవాలని ఒప్పందం ఇరు దేశాల రక్షణ శాఖ మంత్రులు చేసుకున్నారు. రెండు దేశాల మధ్య స్నేహసంబంధాలు మరింతగా పెంచుకోవాలని కూడా నిర్ణయించుకున్నారు. అటువైపు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తికమక సందేశాలు ప్రకటిస్తున్న తరుణంలోనే ఈరక్షణ ఒప్పందాలు జరగటం విశేషంగా చెప్పుకోవాలి. రక్షణ అనేది మన సంబంధాలకు మూలస్తంభం లాంటిది అని రాజ్‌నాథ్‌సింగ్ భారత్ రక్షణ శాఖమంత్రి అనటం కూడా విశేషంగానే చెప్పుకోవాలి. ఈ విధంగా పరస్పర విరుద్ధ ప్రకటనల మధ్య అమెరికా, భారత్ స్నేహసంబంధాలు కొనసాగుతున్నాయి.



ఏ దేశం అయినా స్నేహసంబంధాలు కొనసాగించడంలో తప్పుపట్టే అవకాశం ఉండదు.కానీ 'నమ్మకం' ఆ సంబంధం కలిగించే విధంగా ఉంటేనే ఇరు దేశాలనూ, ప్రపంచ దేశాలు నమ్ముతాయి. గ్లోబల్‌గా ఆలోచించటం ప్రతి దేశానికీ అలవాటయింది. కష్టదాటు వ్యవహారం తేలిగ్గానే కనుక్కొనే సమయం ఇది.సాంకేతిక పరిజ్ఞానంతో ముడిపడిఉన్న ఈ కాలంలో మాటల మూలాలు ఎవరికీ అక్కర్లేదు. అగ్రరాజ్యంగా భాసిల్లటానికి అనేక రంగాల్లో విజయాన్ని సాధించి చూపించక తప్పదు. హుంకరింపులతో ఏ దేశాన్ని ఎంత చిన్నదైనా, బలహీనదేశమైనా లొంగటానికి సిద్ధంగా లేదు. అంతర్జాతీయ రాజకీయాలు మారాయి. గతించిన కాలంలో అగ్ర దేశాలు పేరుపడిన యు.యస్.ఏ, యు.యస్.యస్.ఆర్ ఆర్థిక బలంతోపాటు అంగబలం, ఆయుధబలం సమకూర్చుకొని తాము చెప్పిందే వేదం అన్న రీతిలో ఇతర దేశాలను అదుపులో ఉంచుకున్నాయి.కుటమూలు కట్టి చెరికొన్నిరాజ్యాలను తమ గుప్పిట్లో ఉంచుకొనే ప్రయత్నం చేశాయి.భారత్ మరికొన్ని దేశాలు జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలో స్వతంత్ర ఆలోచనలతో ఈ కూటముల నాయకత్వాన్ని సవాలు చేసే రీతిలో కాకుండా సమన్యాయం, సమదృష్టి సమాన దూరం పేరుతో అలీన విధానానికి ప్రాణప్రతిష్ట చేసి బలహీనంగా కనపడిన దేశాలకు నైతికబలం చేకూర్చాయి. కాలక్రమేణా వైవిధ్య భరితమైన పరిస్థితుల్లో అనేకరంగాల్లోచిన్నా, పెద్దా తేడా లేకుండా సాంకేతిక పరిజ్ఞానం,నైపుణ్యత సాధించి 'మేమూ ఉన్నాం' అన్నట్లుగా పెద్ద అని చెప్పుకొనే దేశాలను సవాలు చేస్తున్నాయి.ఇజ్రాయిల్ చిన్న దేశమే కానీ మతం పేరిట సమిష్టి బలాన్ని ఏర్పరుచుకుంటున్న దేశాలకు ముకుతాడు వేయగలిగింది. మెరుపు వేగంతో యుద్ధ పటిమను ప్రదర్శించి లొంగకుండా ప్రపంచ చిత్రపటంలో మెరుస్తున్నది. ఉక్రెయిన్ రష్యా నుంచి విడిపోయిన తర్వాత సవాల్‌కు ప్రతి సవాల్ విసిరే స్థాయికి ఎదిగింది. అమెరికా, రష్యాలు ఈ రెండు దేశాలను లొంగదీసే ప్రయత్నంలో సామ, దాన, భేద, దండోపాయాలు ప్రయోగించినా, ఎదురొడ్డి చాకచక్యంగా పోరాడి, ఇంకా బలపటిమకు ప్రతిరూపంగా నిలుస్తూనే ఉన్నాయి.చైనా,పాకిస్థాన్ దేశాలు భారత్‌కు అనేక రకాలుగా సరిహద్దు సమస్యలు సృష్టించి పైచేయి సాధించాలని ప్రయత్నించినా 'ఆపరేషన్ సిందూర్'తోభారత్ ఆటకట్టించింది. చైనా, భారత్‌తో 'భాయీ-భాయీ'అనటమే మేలు అని భావించిందో ఏమో స్నేహ హస్తాన్ని చాపుతున్నది. స్నేహ హస్తాన్ని శత్రువు చూపినా అందుకోవటం భావ్యమే అని యుద్ధనీతి చెప్తుందని విజ్ఞులు వల్లిస్తుంటారు. భారత్ అందుకనే చైనాతో, తాను అన్నిరంగాల్లో అగ్రస్థాయిని సాధించిన తర్వాతనే సమఉజ్జీగా స్నేహ హస్తాన్ని అంగీకరించింది. చైనా, ఇండియాల కలయిక ఇతర అగ్రదేశాలను కూడా కలవరపెడ్తున్నాయి. భారత్ సరిహద్దు దేశాలైన శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, మయన్మార్‌లకు ఈ రెండు సరిహద్దు దేశాలు బలంగా ఉంటేనే, భవిష్యత్తు ఉంటుంది. రెండు దేశాల మధ్య శత్రుత్వం ఉంటే వాటికి లేగదూడల పరిస్థితి ఏర్పడుతుంది. కాల మాన పరిస్థితులానుసారం అనేక రంగాల్లో మార్పులు సంభవిస్తున్నాయి. సాంప్రదాయ యుద్ధరీతులు మారి అణుయుద్ధాలు కూడా ఒక సమయంలో చోటు చేసుకొనే ప్రమాదాన్ని సూచించాయి. అదీ మారి డిజిటలైజేషన్‌తో దేశాల మధ్య భౌతిక దూరాలు కనుమరుగయ్యాయి. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు ఉద్భవించి భవిష్యత్తుతో పరిస్థితులు, పరిణామాలు ఏరూపు దిద్దుకుంటాయో అన్న ఆలోచనతో కూడిన భయాన్ని కలిగిస్తున్నాయి. సైన్యాలతో ఆయుధాలతో భౌతికంగా దేశాలను ఆక్రమించుకొనే స్థితి ఇప్పుడు లేదు. కాలు కదపకుండా, ఆయుధం బయటపెట్టకుండానే ఆక్రమణ సాగించే పరిస్థితులు వస్తాయా అన్న ఆందోళనలో దేశాలు ఉలిక్కిపడుతున్నాయి. అందుకనే ఏ దేశమైనా కాలానుగుణంగా, విపత్కర పరిస్థితుల నేపథ్యంలో సమదృష్టితో సమతుల్యత పాటించే నేర్పులోచాకచక్యంగా దేశాల మధ్యశత్రుత్వ భావాలనురూపుమాపి స్నేహభావాన్ని పటిష్టం చేసే నాయకుడు రావాలని కోరుకోవటంలో తప్పులేదు.శాంతి సందేశంతో, ప్రేమానురాగాలు స్నేహ,సుహృద్భావ వాతావరణం ఏర్పరిచే నాయకుడి కోసం ఎదురుచూస్తున్నాయా గ్లోబల్ వ్యవస్థకు ఎక్కడినుంచి ఎప్పుడు వస్తారో ఎదురు చూడక తప్పదేమో! ●

# మన రూపాయితో యూకె 'వర్సిటీ'ల సోకు

బి.మధుపాళి

దూరపు కొండలు నున్నగా కనిపిస్తాయి. పొరుగింటి పుల్ల కూర రుచిగానే ఉంటుంది. విదేశీ చదువులు ఆకర్షణీయంగా తోస్తాయి. సొమ్మొకడిది, సోకొకడిది లాగా ఉంది విదేశీ యూనివర్సిటీల తీరు. మన యూనివర్సిటీలు అంటే అంత ఇష్టం ఉండదు. మధ్య తరగతితో పాటు పేద విద్యార్థులు కూడా రుణాలు తీసుకొని విదేశీ చదువులకు క్యూ కడుతున్నారు.తీరా చదువులు పూర్తి అయ్యాక ఉద్యోగ ఉపాధులు దొరక్క, చేసేదేమీ లేక నిరాశానిస్పృహలతో మూట ముల్లె సర్దుకొని వెనుదిరుగుతున్నారు. యూకె (యునైటెడ్ కింగ్‌డమ్) లేదా గ్రేట్ బ్రిటన్ అంటే ధనిక దేశమని ఓ అపోహ మన తల్లితండ్రులు, యువతలో కనిపిస్తున్నది. మన బలహీనతను ఆసరాగా చేసుకొని విదేశీ యూనివర్సిటీలు,ముఖ్యంగా యూకె లాంటి దేశాల ఉన్నత విద్యా సంస్థలు మన యువత చెల్లించే అపరిమిత ఫీజులతో మనుగడ సాగించడం, నాణ్యత కొరవడిన విద్యను అందించడం, కోర్సు పూర్తి కాగానే మీ దేశం వెళ్లమని గెంటేయడం అనాదిగా కొనసాగుతున్నది. దాదాపు 33 శాతం బ్రిటన్ లేదా యూకె విశ్వవిద్యాలయాలు నిధుల కొరతతో లోటు బడ్జెట్ నడుమ నత్తనడకతో కొనసాగుతున్నాయని, ఈ యూనివర్సిటీల మనుగడ విదేశీ విద్యార్థులు, ముఖ్యంగా భారతీయ యువత అధిక మొత్తంలో చెల్లించే ఫీజులతో ఆధారపడుతున్నట్లు తాజా విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. యూకె పౌరుల నుంచి అతి తక్కువ ఫీజులు వసూలు చేస్తూ, విదేశీ విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ముక్కు పిండి వసూలు చేస్తూ తమ పబ్బం గడుపుతుంటున్నాయి. భారతీయ విద్యార్థులు 49శాతం యూకెలోని తక్కువ ర్యాంకులు/నాణ్యత కొరవడిన కోర్సులు కలిగిన యూనివర్సిటీల్లో, మామూలు ర్యాంకులు పొందిన యూనివర్సిటీల్లో 41 శాతం మంది,10శాతం మంది ఏ ర్యాంకు పొందని యూని



వర్సిటీల్లో చేరుతున్నట్లు తెలుస్తున్నది. తొలి పది అత్యుత్తమ ర్యాంకులు పొందిన యూనివర్సిటీల్లో 4శాతం మంది భారతీయ యువత మాత్రమే అడ్మిషన్లు పొంది చదువులు కొనసాగిస్తున్నారు. ఏరు దాటాక తెప్ప తగలేసినట్లు, అధిక ఫీజులు చెల్లించి కోర్సులు పూర్తి చేసిన భారతీయ యువత వీసా గడువులు ముగియడంతో ఉద్యోగాలు దొరక్క బలవంతంగా వెనుదిరగడం జరుగుతున్నది. 2021-22 విద్యా సంవత్సరంలో 60 శాతం యూకె యూనివర్సిటీలు లోటు బడ్జెట్‌లో పడ్డాయని, 2022-23 నాటికి వీటి సంఖ్య 33 శాతానికి చేరిందని విశ్లేషించబడింది. రోజురోజుకు విదేశీ విద్యార్థుల సంఖ్య, వారు చెల్లించే ఫీజుల మొత్తం క్రమంగా పెరగడంతో యూకెలోని విఫలమైన యూనివర్సిటీల మనుగడకు వరంగా మారడం గమనించారు. 2022-23లో విదేశీ విద్యార్థులు 23.7 శాతం అడ్మిషన్లు పొందగా, వారు చెల్లించే ఫీజులు మాత్రం 53శాతం వాటాను పొందడంతో బ్రిటన్ యూనివర్సిటీలు విదేశీ విద్యార్థుల ఫీజులతోనే నడుస్తున్నట్లు తెలుస్తున్నది. 2023-24లో 1,11,329 మంది భారత యువత అడ్మిషన్లు పొందారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2022-23లో ప్రపంచ దేశాల్లోనే (చైనాను కూడా అధిగమించి) అత్యధికంగా 1.25 లక్షల భారతీయ యువత యూకె యూనివర్సిటీల్లో చేరారని, వీరు చెల్లించే ఫీజులు అధిక మొత్తంలో ఉంటున్నాయని తెలుస్తున్నది. భారతీయ యువతకు ఐదేళ్ల కాలపరిమితులతో యూకె వీసాలు ఇస్తున్నారని, గడువు పూర్తి కాగానే 70 -80 శాతం యువత తిరుగు ప్రయాణం చేస్తున్నారని, కేవలం 24 శాతం మంది మాత్రమే వర్క్‌వీసాలకు అర్హత పొందుతున్నారని తెలుసుకోవాలి. యూకెలో కాల పరిమితులు లేని వీసాలు పొందడం భారతీయ యువతకు అసాధ్యంగానే తోస్తున్నది. ఈ విషయాలన్నింటినీ క్షుణ్ణంగా విశ్లేషించుకొని నాణ్యతా ప్రమాణాలు కలిగిన యూకె యూనివర్సిటీల్లో మాత్రమే అడ్మిషన్లు పొంది తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తల్లితండ్రులకు, విద్యార్థులకు సూచిస్తున్నారు. ●

# రైతు గెలుపుతోనే దేశాభివృద్ధి సాధ్యం

డా. చిటికెన కిరణ్ కుమార్

మట్టి తడిగా ఉన్నంతవరకు మన జీవితం తడిగా ఉంటుంది. ఆ మట్టిని తడిపేది వాన కాదు, రైతు చెమట. రైతు పొలం మనిషి ఉనికికి మూలం, ఆ మూలం ఎండిపోతే ప్రపంచం నిర్జీవమవుతుంది. రైతు కేవలం పంట పండించే వ్యక్తి కాదు,భూమిని ఊపిరిగా మార్చే జీవశక్తి.మనం తినే అన్నంలో, మనం పీల్చే గాలిలో, మనం నడిచే నేలలో ఆయన కష్టానికి ముద్ర ఉంటుంది. రైతు చేతిలో మన భవిష్యత్తు ఉందని చెప్పడం కేవలం నినాదం కాదు. అది నిస్సందేహ సత్యం. రైతు చెమటతో పుట్టిన ధాన్యం మన జీవితంలోని ప్రతి వేళకు ఆధారం. ఆ చెమటలో సువాసన ఉంది, ఆ సువాసనలో జీవం ఉంది. రైతు ఉదయించే సూర్యుడికి ముందు లేస్తాడు, సాయంత్రం అస్తమించే సూర్యుడితో కలిసి ఆగుతాడు. ప్రతి విత్తనంలో ఆయన ఆశ ఉంటుంది, ప్రతి వానలో ఆయన ప్రార్థన ఉంటుంది. వానలు ఆలస్యమైనా, భూమిని వదిలిపెట్టడు. భూమి ఆయనకు అమ్మలా ఉంటుంది, పంట ఆయనకు పిల్లలా ఉంటుంది. ఆ బంధం మాటల్లో కాదు, హృదయంలో ఉంటుంది. రైతు చేతిలో భవిష్యత్తు అనగానే మనకు గుర్తొచ్చేది పంట కాదు, పరంపర. ఆ పరంపరలో సహనం, సత్యం, శ్రమ ఉంటాయి. రైతు కష్టపడితే దేశం నిలుస్తుంది, రైతు వెనుకబడితే జీవనం నిలవదు. మన పంటల వలెనే మన సమాజం కూడా రైతు భుజాల మీదే పెరుగుతుంది. ఆయన ఉనికి అంటే దేశపు ఆర్థిక ధమనిలో రక్తం ప్రవహించడం. రైతుపడే కష్టాలు బయటికి కనిపించకపోవచ్చు.కానీ ఆయన ప్రతి చెమట చుక్క మన జీవితానికి ఆక్సిజన్. వానలు ఎగతాళి చేసినా, మార్కెట్ ధరలు ఆడినాట్లు చేసినా, ఆయన ఆగడు. ఎందుకంటే ఆయన నమ్మకం మట్టి మీదే, ఆ మట్టి కృతజ్ఞతతో తిరిగి పంట ఇస్తుంది. రైతు ఆశలు బియ్యం గింజల్లా చిన్నవైనా, వాటి విలువ ప్రపంచానికీ పెద్దదే. రైతు సంతానం నగరాలకు వెళ్లి ఉద్యోగాలు వెతికినా, ఆయన మనసు మాత్రం పొలంలోనే ఉంటుంది. మట్టి వాసన మానవ రక్తంలో కలిసిపోయినది. ఆ వాసనను మరచిపోవడం అంటే మన మూలాన్ని కోల్పోవడం. మనం ఎన్ని యంత్రాలు వాడినా, రైతు చేతిలోని మట్టి ముద్దే నిజమైన జీవం. భవిష్యత్తు రైతు చేతిలో ఉందనే మాటలో లోతైన అర్థం ఉంది. రైతు నిలబడితే దేశం నిలుస్తుంది. పంట పండితే మనం తింటాం, రైతు పడిపోతే మనం నిలువలేము. అందుకే రైతు ఉనికి అంటే మన ఉనికే. రైతు కేవలం ఆర్థిక వ్యవస్థకు కాదు, జీవన వ్యవస్థకూ హృదయం. ఆయన శ్రమను గౌరవించని సమాజం భవి



ష్యత్తును కోల్పోతుంది. రైతు తన పొలంలో విత్తనాలు వేస్తాడు, కాని ఆ విత్తనాలు భవిష్యత్తును పండిస్తాయి. ప్రతి విత్తనం జీవితం, ప్రతి మొలక ఆశ. ఆయన బలహీనంగా ఉన్నా, ఆయన ఆశ బలంగా ఉంటుంది. ఆ ఆశే మన భవిష్యత్తు. రైతు తినకపోయినా, ఇతరులు తినాలని కోరుకునే మనిషి. ఆ నిస్వార్థతే ఆయన గొప్పతనం. పొలంలో మడుసుకుంటున్న గడ్డి మధ్య ఆయన కాళ్లు నడుస్తున్నప్పుడు, ప్రపంచం ఆయన భుజాలపై ఉందని మనకు తెలియదు. కరువు, వరద, అప్పులు, తిప్పలు ఇవన్నీ ఆయన జీవనంలో భాగం. అయినా ఆయన నవ్వుతాడు. ఆ నవ్వులో గెలుపు లేదు, గెలుపుకు నమ్మకం ఉంది. రైతు గెలిస్తే, దేశం గెలుస్తుంది. రైతు పడిన చేతులు దేశానికి భద్రతా గోడలు. ఆ చేతులు మురికిగా కనిపించవచ్చు కానీ అవి మన భవిష్యత్తును మలుస్తాయి. నగరాల వెలుగులు ఆయన చెమట వెలుగుతోనే వెలుగుతాయి. ఒక రైతు తన భూమిలోపడే శ్రమను మనం గౌరవిస్తే, మనం భవిష్యత్తును కాపాడుతున్నట్టే. రైతు కేవలం పంట పండించడమే కాదు, సంస్కృతిని పండిస్తాడు. పంటతో పాటు ఆయన విలువలను కూడా పెంచుతాడు. సహనం, సమానత, త్యాగం, కృతజ్ఞత. ఆయన జీవితం కష్టాల నుంచి పుట్టిన కవితలా ఉంటుంది. ప్రతి గాలి, ప్రతి మబ్బు, ప్రతి విత్తనం ఆయనకు తోడు. ప్రకృతితో ఆయన స్నేహం వందల సంవత్సరాల పాతది. రైతు చెమట మట్టి తడిపితే, ఆమట్టి మన పాదాల కింద పసిడిగా మారుతుంది. ఆయన కష్టాన్ని గుర్తించని మనిషి మనుగడను మర్చిపోతాడు. రైతు జీవితం మనకే అద్దం. ఆయన ప్రతి శ్వాసలో భూమి రాగం ఉంటుంది. ఆ రాగాన్ని వినగలిగితేనే మనం నిజమైన భారతీయులం అవుతాం. పొలాల్లో పంటలు పెరిగేటప్పుడు,రైతు ముఖంలో ఆ వెలుగు పండుతుంది. ఆ వెలుగు ఎటువంటి దీపంతోనూ వెలగదు అది చెమటతో వెలిగే దీపం. ఆదీపం కాంతి మన ఇంటి అన్నపాత్రలో నిండిపోతుంది. రైతుఒక్క చుక్క చెమట విలువను మనం గుర్తించకపోతే, రేపటి భవిష్యత్తు మన చేతుల్లో ఉండదు.రైతు ఆశలు పెద్దవి కావు సరైన వానలు, సరైన ధరలు, సరైన గౌరవం ఇవే అతనికి కావలసిన భవిష్యత్తు. ఆయన మౌనం మన సమాజానికి అద్దం. ఆయన కష్టాన్ని గమనించి చూపే మనిషి మానవత్వానికి ప్రతీక. రైతు సంతోషంగా ఉంటే దేశం ప్రశాంతంగా ఉంటుంది. రైతు కష్టానికి ప్రతిఫలం విత్తనం పుట్టిన క్షణంలోనే మొదలవుతుంది.కానీ ఆవిత్తనం పంటగా మారేంతవరకు అతని హృదయంలో వంద ఆశలు మొలుస్తాయి. ఒక్కోమొలక ఎదుగుతుంటే ఆయన కళ్లలో వెలుగు పెరుగుతుంది. పంట పండకముందే ఆయన మనసులో భవిష్యత్తు పండుతుంది.ఇది కేవలం జీవన పోరాటంకాదు,అది ఆత్మతో మట్టికి మధ్య బంధం. మట్టిలో పుడుతూనే మనిషి రైతుగా మారడు. కానీ భూమిని మనసుతో చదివిన వాడే నిజమైన రైతు.ఆయన కాళ్లు పంటమధ్య నడుస్తున్నప్పుడు ఆ భూమి ఊపిరి పీలుస్తుంది. విత్తనాలు మొలకెత్తిన ప్రతిసారి భూమి నవ్వుతుంది. ఆ నవ్వు ఆయనకే వినిపిస్తుంది. ●

# పరిశోధనలే దేశ భవిష్యత్తు



## ఎస్టిక్ 2025లో ప్రధానిమోడీ

### రూ.లక్ష కోట్ల ఆర్ అండ్ డి నిధి జాతికి అంకితం

**న్యూఢిల్లీ, నవంబరు 3:** దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాలకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రోత్సాహం అందిస్తూ ముందడుగు వేశారు. సోమవారం ఢిల్లీలోని భారత్ మండపంలో ఎమర్జింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ కాంక్లేవ్ (ఎస్టిక్) 2025ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశ శాస్త్ర, సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేసే లక్ష్యంతో రూ. లక్ష కోట్ల పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల పథకం నిధిని కూడా ఆయన జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ దేశంలో పరిశోధన, అభివృద్ధికి కొత్త అవకాశాలు కల్పించేందుకే రూ. లక్ష కోట్ల ఆర్‌డిఐ ఫండ్‌ను ప్రారంభించామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. ఆధునిక ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ రీసెర్చ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఇందుకోసం ఇప్పటికే ఆర్థిక నియమాలు, సేకరణ విధానాల్లో సంస్కరణలు తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, ప్రధాని మోడీ దార్శనికత వల్లే శాస్త్ర సాంకేతిక రంగాలకు ప్రోత్సాహం లభిస్తోందన్నారు. దశాబ్దాలుగా ప్రతిభ ఉన్నప్పటికీ మన శాస్త్రవేత్తలకు సరైన సౌకర్యాలు లేవని, కానీ మోడీ నాయకత్వంలో ఇప్పుడు వికసిత్ భారత్ దిశగా పయనిస్తున్నామని చెప్పారు. స్టార్టప్‌లు, గగన్‌యాన్, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో సాధించిన ప్రగతితో భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. నవంబర్ 3 నుంచి 5 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ ఎస్టిక్ 2025 సదస్సులో విద్యాసంస్థలు, పరిశోధన కేంద్రాలు, పరిశ్రమలు, ప్రభుత్వ రంగాల నుంచి 3,000 మందికి పైగా ప్రతినిధులు, నోబెల్ గ్రహీతలు, శాస్త్రవేత్తలు పాల్గొంటున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమీకండక్టర్లు, అంతరిక్ష సాంకేతికత సహా 11 కీలక అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. యువఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, పరిశోధకులను పరిశ్రమలతో అనుసంధానం చేయడానికి, వారి ఆలోచనలకు సరైన వేదికను అందించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) ఒక ప్రకటనలో పేర్కొంది.

తొలుత భారత మహిళల క్రికెట్ జట్టు సాధించిన చారిత్రక విజయం గురించి ప్రస్తావించారు. వారి అద్భుత ప్రదర్శనకు దేశం గర్విస్తోందని, యావత్ జట్టుకు తన అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. అలాగే, నిన్న ఇస్రో ప్రయోగించిన జీశాట్7ఆర్ కమ్యూనికేషన్ ఉపగ్రహం విజయవంతం కావడంపై శాస్త్రవేత్తలను అభినందించారు.



## వారణాసిలో కార్తీక పౌర్ణమికి 'దేవ్‌దీపావళి'

**వారణాసి, నవంబరు 3:** కార్తిక పౌర్ణమి సందర్భంగా పవిత్ర వారణాసి క్షేత్రంలో 'దేవ్ దీపావళి' వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 5న జరగనున్న ఈ ఉత్సవాలకోసం గంగానది తీరంలోని ఘాట్‌లను లక్షలాది దీపాలతో అలంకరించేందుకు సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ వేడుకలు భక్తులకు, పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించనున్నాయి. ఈ ఏర్పాట్ల గురించి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జైవీర్ సింగ్ ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. "దేవ్ దీపావళి కోసం రాష్ట్ర పర్యాటక శాఖ, వారణాసి మహోత్సవ్ సమితి సంయుక్తంగా దాదాపు 10 లక్షల మట్టి ప్రమిదలను సిద్ధం చేశాయి. కాశీలోని ప్రధాన ఘాట్‌లతో పాటు గంగా నది తీరంలోని మరో 20 ప్రాంతాల్లో ఈ దీపాలను వెలిగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. పనుల పర్యవేక్షణ కోసం ప్రతి సెక్టార్‌కు ఒక నోడల్ అధికారిని నియమించినట్లు చెప్పారు. కార్తిక పౌర్ణమి సాయంత్రం వారణాసి నగరం దీపాల వెలుగులతో జిగేల్ మననుందని మంత్రి వివరించారు. ఈసారి వేడుకల్లో భాగంగా పలు ప్రత్యేక ఆకర్షణలు కూడా ఉన్నాయని తెలిపారు. కాశీ కథ పేరుతో 25 నిమిషాల పాటు సాగే 3డీ ప్రొజెక్షన్ మ్యాపింగ్ షోను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీంతో పాటు, కాశీ మరియు అయోధ్యల గొప్పతనాన్ని, చారిత్రక వైభవాన్ని చాటిచెప్పేలా 500 డ్రోన్లతో ఓ ప్రత్యేక ప్రదర్శన, లేజర్ షోకూడా నిర్వహించనున్నట్లు జైవీర్ సింగ్ పేర్కొన్నారు.



## అఫ్ఘాన్‌లో భూకంపం

### ఏడుగురు మృతి, 150 మందికిపైగా గాయాలు

### భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.3గా నమోదు

**కాబూల్, నవంబరు 3:** అఫ్ఘానిస్థాన్‌లో భారీ భూకంపం సంభవించింది. సోమవారం తెల్లవారుజామున ఉత్తర అఫ్ఘాన్ నగరం మజార్-ఎ-షరీఫ్ సమీపంలో రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 6.3గా నమోదైంది. ఖుల్మ్ సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ విపత్తు కారణంగా ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. 150 మందికిపైగా గాయపడ్డారని స్థానిక అధికారులు పేర్కొన్నారు. అనేక మంది శిథిలాల్లో చిక్కుకున్నారన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. యుఎస్ జియోలాజికల్ సర్వే వివరాల ప్రకారం.. ఖుల్మ్ సమీపంలో భూకంప కేంద్రం ఉన్నట్లు వెల్లడైంది. 28 కిమీ లోతులో అది కేంద్రీకృతమైఉంది. దీంతో సమీప ప్రాంతాల్లో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఘోర విపత్తు కారణంగా మజార్-ఎ-షరీఫ్ సహా ఇతర ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు సమాచారం. భూకంపం కారణంగా పలు గ్రామాల్లోని ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయని ఆ దేశ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు వెల్లడించారు.

# ఎల్లుండి బీహార్ తొలిదశ పోలింగ్

### నేడు ప్రచారం సమాప్తం

### ప్రధానిమోడీ, హోంమంత్రి అమిత్‌షా, యుపిసిఎం యోగిల విస్తృత ప్రచారం

### మహాకూటమినుంచి రాహుల్, తేజస్వి, ప్రియాంక గాంధీల ఎన్నికల ర్యాలీలు

**పాట్నా, నవంబరు 3:** బీహార్‌లోమొదటి దశ ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగుస్తుండటంతో ప్రధాన రాజకీయ పార్టీల అధినేతలందరూ బీహార్‌లోనే తిష్టవేసారు. ప్రధానిమోడీ ఓవైపు,యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్, హోంమంత్రి అమిత్‌షాలు బీహార్‌లో విస్తృతంగా ప్రచారంచేస్తూ గూండారాజ్యానికి తెరదించాలని, ఇండియా కూటమికి ఓటువేస్తే బీహార్‌లో మళ్లీ గూండారాజ్ తప్పదంటూ తమతమ ప్రచారాల్లో ఆర్జేడి, కాంగ్రెస్‌లే లక్ష్యంగా ప్రచారంచేసారు. ఎన్డీయే వికసిత్ లక్ష్యంతో వెళుతుంటే ఆర్జేడి కాంగ్రెస్ పార్టీలు వినాశ్ సిద్ధాంతమే లక్ష్యంగా వెళుతున్నాయన్నారు. ఎన్డీయే పాండవుల మాదిరిగా ఐక్యంగా ఉంటే కౌరవుల తరహాలో మహాకూటమి ముక్కలు చెక్కలయిందని అన్నారు. అలాగేయూపి సిఎం కూడా తన ప్రచారాన్ని హోరెత్తించారు. ఆర్జేడి, కాంగ్రెస్‌ల మాఫియా సామ్రాజ్యాలను తాము బుల్‌డోజర్‌తో అణిచివేసామని బీహార్‌లో కూడా అదే పునరావృతం అవుతుందని జోస్యం చెప్పారు. ఈనెల 14వ తేదీతో బీహార్‌లో రాహుల్, లాలూ శకం ముగుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ పార్టీలకు ఓటువేస్తే జంగిల్ రాజ్ తథ్యమని ఓటర్లు అప్రమతంగా ఉండాలంటూ మోడీ హితవు పలికారు. ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ భాగల్పూర్‌లో ఎన్నికల ర్యాలీలో మాట్లాడారు. ఇక విపక్ష పార్టీలపరంగా ఎఐసిసి నాయకుడు, రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీ, ఆర్జేడి చీఫ్ లాలూప్రసాద్ యాదవ్, ఆయన తనయుడు తేజస్వియాదవ్‌లు తమతమ ప్రచారంతో ఎన్డీయే కూటమిపై విమర్శలహోరుతో దూసుకుపోతున్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ ఎంపి ప్రియాంకగాంధీ కూడా రాష్ట్రంలోని సోన్‌బర్సా, రోసేరా, లఖిసరాయ్ నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహించారు. ప్రధానిమోడీ అయితే ప్రతి నియోజకవర్గాన్ని చుట్టివచ్చే ర్యాలీలు చేస్తున్నారు. అయితే సోమవారం నిర్వహించిన ర్యాలీల్లో ఆయన వెంట సిఎం నితీష్‌కుమార్ పాల్గొనలేదు. ఆయన వేరొక ప్రాంతంలోప్రచారంలో నిమగ్నం అయ్యారు. మోడీవెంట కేంద్ర మంత్రి రాజీవ్‌రంజన్ కొనసాగారు.



**తొలివిడత 121 నియోజకవర్గాల్లో...**

అయితే తొలివిడతగా 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో పోలింగ్ జరుగుతోంది. మిగిలిన 122 సీట్లకు రెండోదశలో జరుగుతుంది. మొత్తం 243 నియోజకవర్గాల్లో 203 జనరల్‌సీట్లు, 38ఎస్సీలకు, ఎస్టీలకు రెండు రిజర్వుచేసారు. మొదటి విడత ఎన్నికల్లోనే డిప్యూటి సిఎంలు సామ్రాట్ చౌదరి, విజయ్‌కుమార్ సిన్హా, ఆర్జేడి నేత తేజస్వియాదవ్‌లు ఉన్నారు. మొత్తం 1314 మంది అభ్యర్థులు మొదటి విడత పోలింగ్‌లో పోటీలో ఉన్నారు. తేజస్వితోపాటు ఆయన సోదరుడు తేజ్‌ప్రతాప్ యాదవ్, జెడియు చీఫ్ ఉమేష్ కుష్వాహా, ఆర్జేడి నేత భోలా యాదవ్‌లు కూడా తొలివిడతలోనే ఉన్నారు. ముజఫరాపూర్; కుర్హాని, మహ్‌నార్, బహాదుర్‌జిల్లాల్లోనే అత్యధికసంఖ్యలో అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కుర్హాని, ముజఫర్‌పూర్‌లలో 20 మంది చొప్పున నిలుచుంటే అలౌలి, పర్బట్టా జిల్లాల్లో తక్కువ మంది అంటే కేవలం ఐదుగురుచొప్పున పోటీలో ఉన్నారు. పాట్నాలో 149 మంది అభ్యర్థుల ఎన్నికల బరిలో నిలుచున్నారు. అయితే తొలివిడతలోనే కొన్ని హైప్రొఫైల్ నియోజకవర్గాలున్నాయి. తారాపూర్ అంటే ముంగేర్ జెడియుకు పట్టున్నప్రాంతం. రాఘోపూర్‌లో తేజస్వి మళ్లీ ఎన్నికవుతామన్న ధీమాతో ఉన్నారు. మహువాలో తేజ్‌ప్రతాప్‌యాదవ్ జనశక్తి జనతాదళ్‌నుంచి పోటీలోఉన్నారు. ఆలినగర్‌లో బిజెపి మైథిలి ఠాకూర్, ఆర్జేడి వినోద్‌మిశ్రాల మధ్య పోటీ ముఖాముఖి జరుగుతోంది. హసన్‌పూర్‌లో జెడియు రాజ్ కుమార్‌రే ఆర్జేడి మాలా పుష్పమ్‌తో పోటీలో ఉన్నారు.

## డిజిటల్ అరెస్టులపై సుప్రీం సీరియస్

### సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపాలి

### నిందితులకు కఠిన శిక్షలు విధించాలి

### త్రిసభ్య ధర్మాసనం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, నవంబరు 3:** డిజిటల్ అరెస్టు కేసుల్లో కఠిన శిక్షలు విధించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. చాలా విస్తృత స్థాయిలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అత్యున్నత న్యాయస్థానం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. డిజిటల్ అరెస్టు కేసుల్లో బాధితులు సుమారు 3,000 కోట్లు కోల్పోవడం పల్ల కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సైబర్ నేరాలకు పాల్పడుతున్న మోసగాళ్లు తమకు తాము భద్రతా సిబ్బందిగా, కోర్టు అధికారులుగా, ప్రభుత్వాధికారులుగా పరిచయం చేసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఆడియో, విడియో కాల్స్‌తో బాధితులను పీడిస్తున్నారు. బాధితులను కాల్స్‌తో బందీలుగా చేసి.. డబ్బులు చెల్లించేలా వత్తిడి తెస్తున్నారు. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, ఉజ్వల్‌భుయాన్, జోయ్‌మాలా బాగ్చిలతో కూడిన ధర్మాసనం డిజిటల్ అరెస్టు కేసులపై విచారణ చేపట్టింది. ఈ విషయంలో కోర్టుకు సూచనలు చేసేందుకు అమికస్ క్యూరిని నియమించారు. కేంద్ర హోం శాఖ, సిబిఐ సమర్పించిన రెండు నివేదికలను కోర్టు పరిశీలించింది. డిజిటల్ అరెస్టుతో బాధితుల నుంచి సైబర్ నేరగాళ్లు సుమారు మూడు వేల కోట్ల వసూల్ చేయడం షాకింగ్‌గా ఉందని, బాధితుల్లో సీనియర్ సిటిజన్లు ఉన్నారని, ఒకవేళ ఇలాంటి కేసుల్లో కఠినమైన ఆదేశాలు ఇవ్వకుంటే, ఈ సమస్య మరింత జఠిలంగా తయారు అవుతుందని ధర్మాసనం పేర్కొన్నది. జుడిషియల్ ఆదేశాలతో భద్రతా ఏజెన్సీలను బలోపేతం చేయాలని, ఇలాంటి కేసులపై ఉక్కుపాదం మోపాలని కోర్టు పేర్కొన్నది. డిజిటల్ అరెస్టుల కేసులపై ఈ నెల 10న మళ్లీ విచారణ చేపట్టనున్నారు. అమికస్ క్యూరీ ఇచ్చే సూచనల ఆధారంగా కొన్ని ఆదేశాలు ఇవ్వనున్నట్లు కోరింది. సిండికేట్ నేరగాళ్ల ఆఫ్‌షోర్ లోకేషన్ల నుంచి ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నారని సిబిఐ తన రిపోర్టులో చెప్పినట్లు జస్టిస్ కాంత్ పేర్కొన్నారు. కేంద్రం, సిబిఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. కేంద్ర హోంశాఖకు చెందిన సైబర్ డివిజన్ ఇలాంటి కేసుల్ని డీల్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



## వైరల్ అవుతున్న విడియోలపై ఎరికా కిర్క్ ఉద్వేగం

**వాషింగ్టన్, నవంబరు 3:** తన భర్త, ప్రముఖ కన్జర్వేటివ్ కార్యకర్త చార్లీ కిర్క్ హత్యకు గురైన తర్వాత తీవ్రమైన మీడియా నిఘాలో ఉన్న ఆయన భార్య ఎరికా కిర్క్ తొలిసారి బహిరంగంగా స్పందించారు. అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్‌ను ఆలింగనం చేసుకున్న వీడియో వైరల్ అయిన నేపథ్యంలో, ఆమె తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. నా ప్రతి కదలికను, ప్రతి చిరునవ్వును, ప్రతి కన్నీటి చుక్కను కెమెరాలు విశ్లేషిస్తున్నాయి అంటూ తన ఆవేదనను వ్యక్తం చేశారు. యూఎస్ఎ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఇంటర్వ్యూలో ఎరికా మాట్లాడుతూ తన భర్త హత్య కేసు విచారణను కూడా కెమెరాల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. నా భర్తను హత్య చేసినప్పుడు అక్కడ కెమెరాలు ఉన్నాయి. మేము దుఃఖంలో ఉన్నప్పుడు నా కుటుంబం, స్నేహితులపై కెమెరాలు ఉన్నాయి. ఇప్పుడు నాపై కెమెరాలు ఉన్నాయి. అలాంటప్పుడు కోర్టులో ఎందుకు ఉండకూడదు దాచడానికి ఏమీ లేదు. నిజమైన చెడు అంటే ఏమిటో అందరూ చూడాలని ఆమె అన్నారు. మిసిసిపీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్‌ను వేదికపైకి ఆహ్వానిస్తూ, చార్లీ స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు, కానీ వాన్స్‌లో నా భర్త పోలికలు కొన్ని చూస్తున్నానని వ్యాఖ్యానించారు. అనంతరం వేదికపైకి వచ్చిన వాన్స్‌ను ఆమె ఆలింగనం చేసుకున్నారు. ఈ సమయంలో ఆమె వాన్స్ జుట్టులోకి వేళ్లు పోనివ్వగా, అతను ఆమె నడుముపై చేతులు వేయడం వివాదానికి దారితీసింది.


# పాకిస్థాన్ అణ్వాయుధాలను పరీక్షిస్తోంది!

**• అదే బాటలో రష్యా, చైనా, ఉత్తర కొరియాలు • బాంబు పేల్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్**

**వాషింగ్టన్, నవంబరు 3:** మూడు దశాబ్దాల విరామం తర్వాత అణ్వాయుధ పరీక్షలను తిరిగి ప్రారంభించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచానికి కొత్త సవాల్ విసిరారు. ఈ నిర్ణయాన్ని సమర్థించుకున్న అగ్ర రాజ్యాధినేత తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయన్నారు. ఈ జాబితాలో పాకిస్థాన్ కూడా ఉందని పేర్కొన్నారు. సిబిఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలను నిర్వహిస్తున్నాయి. కానీ, వీటి గురించి ఆయా దేశాలు మాట్లాడట్లేదు. మేం అలాకాదు. ఏదైనా బహిరంగంగానే చేస్తాం. దాని గురించి మాట్లాడతాం. ఇన్నాళ్లూ ఎన్ని దేశాలు అణు పరీక్షలు చేపట్టినా మేం వాటి జోలికి వెళ్లలేదు. ఇకపై అలా మిగిలిపోవాలనుకోవట్లేదు. ఇతర దేశాల మాదిరిగానే మేమూ ఈ పరీక్షలు నిర్వహిస్తాం' అని ట్రంప్ వెల్లడించారు. 'రష్యా, చైనా వద్ద చాలా అణ్వాయుధాలు ఉండి ఉంటాయి. మా దగ్గర అంతకంటే ఎక్కువే ఉన్నాయి. మా వద్ద ఉన్న అణ్వాయుధాలతో ఈ ప్రపంచం మొత్తాన్ని 150 సార్లు పేల్చేయొచ్చు. కానీ,అణ్వస్త్రాల నిరాయుధీకరణ గురించి రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో చర్చించా' అని ట్రంప్ తెలిపారు. అమెరికా అణ్వాయుధ పరీక్షలకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమైనట్లు ఆయన పేర్కొన్నారు.

**చైనా, రష్యాలతో ముప్పే**

చైనాతో వాణిజ్య సంధికి పిలుపునిచ్చిన కొన్ని రోజులకే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చైనాకు అమెరికా కూడా ఒక ముప్పేనని ఆయన అంగీకరించారు. ఇరు దేశాల మధ్య తీవ్రమైన పోటీ ఉందని, ఒకరినొకరు నిరంతరం గమనించుకుంటూ ఉంటారని తెలిపారు. అమెరికా పవర్‌గ్రిడ్, నీటి సరఫరా వ్యవస్థల్లోకి చైనా చొరబడిందని, మేధో సంపత్తిని దొంగిలిస్తోందని అమెరికన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ఆరోపిస్తున్న నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మీడియా ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "మేము కూడా వాళ్లకు ముప్పుగా మారాం. మేం వాళ్లనుఎప్పుడూ గమనిస్తుంటాం,వాళ్ల మమ్మల్ని ఎప్పుడూ గమనిస్తుంటారు అనిఅన్నారు. అయితే, చైనాతో ఘర్షణ పడటం కంటే కలిసి పనిచేస్తేనే ఇరుదేశాలు మరింత బలంగా ఎదుగుతాయని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. చైనా అణ్వాయుధ సామర్థ్యంగురించి ట్రంప్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చైనా తన అణ్వాయుధాలను చాలా వేగంగా తయారు చేస్తోందని, రాబోయే ఐదేళ్లలో ఈ విషయంలో రష్యా, అమెరికాలతో సమానంగా నిలుస్తుందని అంచనా ఆర్థికంగా చైనాపై తాము పైచేయి సాధిస్తున్నామని చెబుతూనే, రేర్‌ఎర్త్ మినరల్స్ (అరుదైన భూమిఖనిజాలు) విషయంలో చైనాకు తమపై ఆధిపత్యం ఉందని ట్రంప్ అంగీకరించారు. ఆరేళ్లతర్వాత గతనెల 30న దక్షిణ కొరియాలో జరిగిన 32వ అపెక్ ఆర్థిక మంత్రుల సమావేశంలో ఇరు దేశాల నేతలు ముఖాముఖిగా భేటీ అయిన విషయం తెలిసిందే.



**తైవాన్ జోలికెళ్లొద్దు: చైనాకు ట్రంప్ వార్నింగ్**

అమెరికా-చైనా ఇటీవల తమ ట్రేడ్ వార్‌కు కాస్త బ్రేక్ ఇచ్చాయి. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొద్దిమేర సద్దుమణిగాయని అనుకుంటున్నలోపే.. అగ్రదేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాకు వార్నింగ్ ఇచ్చారు. తైవాన్‌పై దాడిచేస్తే ఎలాంటి పరిణామాలు ఉంటాయో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తోపాటు ఆ దేశ ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు. ఇటీవల దక్షిణ కొరియా వేదికగా డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్ మధ్య జరిగిన భేటీ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిన సంగతి తెలిసిందే. జిన్‌పింగ్‌తో భేటీ తర్వాత ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనాపై టారిఫ్‌లను 10శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. అరుదైన ఖనిజాలకు సంబంధించిన సమస్యకూడా పరిష్కారమైందని చెప్పారు. చైనానుంచి అమెరికా అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. త్వరలోనే వాణిజ్య ఒప్పందం కూడా కుదరనున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఇలా సానుకూల ప్రకటనలు చేసిన ఆయన ఇప్పుడు వార్నింగ్‌లు ఇవ్వడం గమనార్హం.

**నైజీరియాపై అమెరికా సైనిక చర్య: అధ్యక్షుడు ట్రంప్ సంకేతాలు**

నైజీరియాలో క్రైస్తవులపై జరుగుతున్న దాడుల విషయంలో అమెరికా తీవ్రంగా స్పందించింది. ఆ దేశంలో ఉగ్రవాదులను ఏరివేసేందుకు అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. వైమానిక దాడులులేదా నేరుగా అమెరికా బలగాలను పంపే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు ఆయన కీలక సంకేతాలు ఇచ్చారు. ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్‌కు ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో తిరిగి వస్తూ ఆయన విలేకరులతో మాట్లాడారు. నైజీరియాలో రికార్డు స్థాయిలో క్రైస్తవులను చంపుతున్నారని, దీనిని తాము ఎంతమాత్రం అనుమతించబోమని అన్నారు. నా మదిలో చాలా ప్రణాళికలుఉన్నాయి. వారు నైజీరియాలో క్రైస్తవులను రికార్డు సంఖ్యలో హత్య చేస్తున్నారు. అలా జరగడానికి మేము అంగీకరించమని ట్రంప్ స్పష్టం చేశారు. ఇటీవల అమెరికా విదేశాంగ శాఖ విడుదల చేసిన ప్రత్యేక ఆందోళన కలిగించే దేశాల జాబితాలో నైజీరియాను చేర్చినట్లు ట్రంప్ గుర్తుచేశారు. నైజీరియా ప్రభుత్వం క్రైస్తవులను రక్షించడంలో విఫలమైతే కఠిన చర్యలు తప్పవని గతంలోనే ఆయన హెచ్చరించారు. అమెరికా హెచ్చరికలపై నైజీరియాకూడా స్పందించింది. ఇస్లామిక్ ఉగ్రవాదులతో పోరాడటానికి అమెరికా సహాయాన్ని స్వాగతిస్తామని, అయితే తమ దేశ ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కోరింది. నైజీరియాలో క్రైస్తవులు, ముస్లింల మధ్య ఘర్షణలు 1950ల నుంచి కొనసాగుతున్నాయి. ముఖ్యంగా 2009 తర్వాత బోకో హరామ్, ఫులానీ పశువుల కాపరులు వంటి రాడికల్ ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థలు క్రైస్తవ గ్రామాలను, చర్చిలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నాయి. నివేదికల ప్రకారం, ఈ హింసలో ఇప్పటివరకు 45వేల మందికి పైగా క్రైస్తవులు ప్రాణాలు కోల్పోగా, వేలాది చర్చిలు ధ్వంసమయ్యాయి.

## సంక్షిప్తంగా..

### భూ అయస్కాంత తయారీలో చైనాకు చెక్‌పెడుతున్న భారత్!

**న్యూఢిల్లీ,నవంబరు 3:** అరుదైన భూఅయస్కాంతాల (రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్) తయారీ రంగంలో చైనా ఆధిపత్యానికి గండికొట్టేందుకు భారత్ ఓ భారీ వ్యూహంతో ముందుకొస్తోంది. ఈ కీలక రంగంలో తయారీని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన పథకం విలువను మూడు రెట్లు పెంచి రూ. 7వేల కోట్లకు అంటే సుమారు 788 మిలియన్ డాలర్లు పైగా చేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన వనరులు, రక్షణ పరికరాల తయారీలో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ అత్యంత కీలకం. ప్రపంచవ్యాప్తంగా 90 శాతం రేర్ ఎర్త్ ఖనిజాలను చైనాయే ప్రాసెస్ చేస్తోంది. ఇటీవల ఏప్రిల్‌లో ఈ ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలు కఠినతరం చేయడంతో ప్రపంచ దేశాలు ఉలిక్కిపడ్డాయి. ఈ అంశంపై తుది కేటాయింపులు మారే అవకాశం ఉన్నప్పటికీ, తాజా ప్రతిపాదన ప్రస్తుతం కేబినెట్ ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. అయితే, చైనా ఆధిపత్యాన్ని సవాలు చేయడం భారత్‌కు అంత సులభం కాదు. నిధుల కొరత, సాంకేతిక నైపుణ్యం లేకపోవడం, రేడియోధార్మిక వ్యర్థాల కారణంగా తవ్వకాలలో పర్యావరణ సమస్యలు వంటి సవాళ్లు ఎదురుకానున్నాయి. ఇదే సమయంలో, మ్యాగ్నెట్ రహిత ప్రత్యామ్నాయాలపై కూడా భారత్ దృష్టి సారిస్తోంది. రేర్ ఎర్త్ ఖనిజాలపై ఆధారపడటాన్ని తగ్గించే సింక్రోనస్ రిలక్టెన్స్ మోటార్ల సాంకేతికతపై పరిశోధనలకు ప్రభుత్వం నిధులు సమకూరుస్తోంది. దేశీయంగా తవ్వకాలు లాభసాటిగా లేకపోవడంతో, విదేశాల్లో మైనింగ్ భాగస్వామ్యాల కోసం ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయత్నిస్తున్నాయి.

### రష్యా అణుసంపత్తి శరవేగంగా పెంపు

**మాస్కో, నవంబరు 3:** ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేస్తూ రష్యా తన అణ్వాయుధ సంపత్తిని నిరంతరం పెంచుకుంటోంది. తాజాగా ఖబరోవ్స్క్ అనే మరో శక్తిమంతమైన అణు జలాంతర్గామిని జలప్రవేశం చేయించింది. దీనికి అత్యంత ప్రమాదకరమైన పోసిడాన్ అణు డ్రోన్‌ను అమర్చడం గమనార్హం. యావత్ తీరప్రాంత దేశాలను నాశనం చేయగల సామర్థం దీనికి ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. అందుకే దీనిని 'డూమ్స్‌డే క్షిపణి' అని పిలుస్తున్నారు. ఈ జలాంతర్గామిని రష్యా రక్షణ మంత్రి ఆంద్రీ బెలౌసోవ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నేవీ చీఫ్ అడ్మిరల్ అలెగ్జాండర్ మొయిసేవ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెలౌసోవ్ మాట్లాడుతూ, రష్యాకు ఇది చాలా ముఖ్యమైన రోజని, ఈ కొత్త జలాంతర్గామి దేశ సముద్ర సరిహద్దుల భద్రతను మరింత పటిష్ఠం చేస్తుందని తెలిపారు. రష్యా ఇటీవల నీటి అడుగున పోసిడాన్ డ్రోన్‌ను విజయవంతంగా పరీక్షించింది. ఇది సాధారణ జలాంతర్గాములు, టార్పెడోల కంటే చాలా వేగంగా ప్రయాణించగలదు. ఖబరోవ్స్క్‌తరగతి జలాంతర్గాములపై మోహరించడానికే రష్యా ఈ డ్రోన్లను ప్రత్యేకంగా అభివృద్ధి చేసింది. ఈ జలాంతర్గామిని రూబిన్ సెంట్రల్ డిజైన్ బ్యూరో ఆఫ్ మెరైన్ ఇంజినీరింగ్ రూపొందించింది. భారత నౌకాదళానికి చెందిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్యను పునరుద్ధరించిన సెవ్‌మాష్ షిప్‌యార్డ్ లోనే దీనిని నిర్మించారు. గత 12 రోజుల్లో రష్యా మూడు ప్రధాన ఆయుధ పరీక్షలు నిర్వహించడం గ్లోబల్ భద్రతా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### కరూర్ తొక్కిసలాటపై దర్యాప్తు ముమ్మరంచేసిన సిబిఐ

**కరూరు, నవంబరు 3:** తమిళనాడును కుదిపేసిన కరూర్ తొక్కిసలాట ఘటనపై సిబిఐ దర్యాప్తును వేగవంతంచేసింది. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టివికె) పార్టీ నిర్వహించిన సభలో జరిగిన ఈ దుర్ఘటనకు సంబంధించి 306 మందికి విచారణకు హాజరుకావాలంటూ సమన్లు జారీ చేసింది. సెప్టెంబర్ 27న వేలుచామీపురంలో జరిగిన ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా, 60 మందికి పైగా తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి, ఏడీజీపీలు సోనాల్ మిశ్రా, సుమిత్ శరణ్ పర్యవేక్షణలో సీబీఐ అధికారి ప్రవీణ్ కుమార్ నేతృత్వంలోని బృందం కరూర్‌లో తాత్కాలిక క్యాంపు ఏర్పాటు చేసుకుని విచారణ జరుపుతోంది. ఇప్పటికే ఘటనా స్థలాన్ని పలుమార్లు పరిశీలించిన అధికారులు, ప్రత్యక్ష సాక్షులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

సభ జరిగిన ప్రదేశం సామర్థ్యాన్ని కొలిచి, నిర్వాహకులు భద్రతా నిబంధనలు పాటించారా లేదా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా దుకాణాలు నడిపే వ్యాపారులను కూడా విచారించి వారి వాంగ్మూలాలను నమోదు చేసుకున్నారు. ఈ ఘటనలో నిర్వాహకుల వైఫల్యం, జన నియంత్రణలో లోపాలు, సభకు అనుమతులు ఇచ్చిన అధికారుల పాత్రపై సీబీఐ ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా సభకు అనుమతి ఇచ్చిన కరూర్ సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మణివన్నన్‌ను అధికారులు రెండు గంటలకు పైగా ప్రశ్నించారు. భద్రతా ఏర్పాట్లు, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం, నిర్వాహకులతో సమన్వయం వంటి అంశాలపై ఆయన్ను విచారించారు. తాజాగా సిబిఐ 306 మందికి సమన్లు జారీ చేసింది.

## మంత్రి అజారుద్దీన్‌కు ఏ శాఖ అంటే..?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 3:** రాష్ట్ర మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారంచేసి నాలుగు రోజులు అయ్యింది. ఇంతవరకు ఆయనకు ఏ శాఖా కేటాయించలేదు. మంత్రులుగా ప్రమాణ స్వీకారం వేసిన వారికి అదే రోజు లేదా మరుసటి రోజు శాఖల కేటాయింపులు జరుగుతాయి. మంత్రి వర్గంలోకి తీసుకునే ముందే ఏ శాఖలు కేటాయించాలనే ఒక అంచనాకు ముఖ్యమంత్రి వస్తారు. ఇది సహజంగా ఏ పార్టీ అధికారంలో ఉన్నా జరిగే విషయం. అయితే, అజారుద్దీన్ విషయంలో మాత్రం అందుకు భిన్నంగా జరుగుతోంది. ఆయన మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి నాలుగు రోజులు గడచినా ఏ శాఖా కేటాయించలేదు. తనకు హోంశాఖ కావాలని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింకు హోంశాఖ ఇచ్చిందని.. ఇప్పుడు తనకు కూడా హోంశాఖ ఇచ్చి ప్రాధాన్యత కల్పించాలని అజారుద్దీన్ పట్టుబడుతున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కొత్త మంత్రి అజారుద్దీన్‌కు క్రీడలు, మైనార్టీ సంక్షేమం, అవసరమైతే మరో శాఖ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం స్థానికంగా ప్రతిపాదించినట్టు సమాచారం. దీనికి అజారుద్దీన్ విముఖంగా ఉన్నట్లుగా తెలిసింది. దీంతో శాఖల కేటాయింపు ఆగిపోయిందని సమాచారం పార్టీలో అనేక మంది ముఖ్యులు ఉన్నారని, సామాజిక సమీకరణాలు, ఇతరత్రా అంశాలను పరిగణలోకి తీసుకున్న నేపథ్యంలో కీలకమైన హోంశాఖ ఇవ్వడం కుదరదని చర్చ జరుగుతోందని తెలిసింది. ఈ క్రమంలోనే శాఖల కేటాయింపు మరింత ఆలస్యం కావొచ్చని సమాచారం.ప్రస్తుతం సిఎం రేవంత్‌రెడ్డి వద్ద హోం శాఖ, మున్సిపల్, విద్యాశాఖ, వాణిజ్య పన్నులు తదితర కీలక శాఖలు ఉన్నాయి, అజారుద్దీన్‌కు ఇస్తామంటున్న క్రీడా శాఖ ప్రస్తుతం వాకిటి శ్రీహరి వద్ద ఉంది. మైనారిటీ సంక్షేమ శాఖ అడ్లూరి లక్ష్మణ్ వద్ద ఉన్నది. వారిద్దరి నుంచి ఆ శాఖలను తొలగించి అజారుద్దీన్‌కు కేటాయించే చాన్స్ ఉంది. శాఖలు కోల్పోయే మంత్రులకు ఇతర శాఖలు కేటాయించాల్సి ఉంటుందని ప్రభుత్వ వర్గాల్లో చర్చ సాగుతోంది.



లక్కీడ్రా తీస్తున్న ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

## పూర్తయిన మద్యం దుకాణాల లక్కీడ్రాలు

**ఆసిఫాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త:** జిల్లాలో 32 మద్యం దుకాణాలకు గతంలో ఎక్సైజ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేయగా 7 దుకాణాలకు నిర్దేశించిన దరఖాస్తుల కంటే తక్కువగా రావడంతో ఆ శాఖ కమీషనర్ ఆదేశాల మేరకు జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ జ్యోతికిరణ్ రీనోటిఫికేషన్ ఇచ్చారు. దీనిలో భాగంగా శనివారం వరకు దరఖాస్తులు స్వీకరించిన అధికారులు సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో దరఖాస్తుదారుల ఎదుట లక్కీ డ్రా నిర్వహించారు. 7 దుకాణాలకు 90 మంది దరఖాస్తు చేసుకోగా కలెక్టర్ ఏడుగురు అదృష్టవంతులను ఎంపిక చేశారు. లక్కీ డ్రా లో భాగంగా రెబ్బెన షాప్ నెంబర్ 9 ని పాలె మహేష్ దక్కించుకోగా, గోలేటి షాప్ నెంబర్ 10ని శివమణికి, కాగజ్ నగర్ సర్ సిల్క్ ఏరియా షాపు 14 విజేతగా ఇంద్రనాథ్, కౌటాల మండలం రవీంద్ర నగర్ షాపు 13 రామగౌని శ్రీనివాస్ గౌడ్, జైనూర్ 1 షాపు జాదవ్ శ్రీనాథ్, జైనూర్ 2 షాపు సుర్పం యశ్వంత్ రావు, సిర్పూర్ యు దుకాణాన్ని లక్కీ డ్రా లో మాత్రం నాగోరావు దక్కించుకున్నారు.

## జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలి

### ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి టిజిఇజెఎసి విజ్ఞప్తి

**హైదరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ (జేఎస్‌సీ) సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఏసీ నేతలు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావుకి జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ అధ్వర్యంలో వినతిపత్రం అందించారు. జీవో 317 లో భాగంగా ఇచ్చిన 243 ఉత్తర్వుల అమలులో ఇంకా మిగిలిన స్పౌజ్ ఉద్యోగ ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వాలని కోరారు. అలాగే జీవో 317 లో భాగంగా ఇచిన 244 మ్యూచ్వల్స్‌లో వివిధ కారణాల చేత ఆగిన వారికి కూడా అవకాశం ఇవ్వాలన్నారు. సాధారణ అంతర్ జిల్లా, భార్యభర్తల బదిలీలు జరుపుతూ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా అవకాశం ఇవ్వాలని కోరారు. జీవో 190 ఉత్తర్వుల్లో రిటైన్ ఉద్యోగ ఉపాధ్యాయులకు కేడర్ మారిన ఉద్యోగ ఉపాద్యయులకు అవకాశమివ్వాలని కోరారు. స్కూల్ ఎడ్యుకేషన్‌లో 190 ఉత్తర్వులు అమలు చేయడంలో 25 జీఓ (రేషనలైజేషన్) ఉత్తర్వులు అమలు చేయడం వలన ఖాళీలు చూపెట్టడం లేదని.. దీనిపై ఒకసారి రివ్యూ చేయాలని జేఏసీ నేత లు కోరారు. జీపీవో, వీఆర్‌వోల సమస్యలు పరిష్కరించాలని, జిపిఓల జీత భత్యాల విషయంలో జాప్యం జరుగుతున్నందున కేడర్ స్ట్రెంత్, హెడ్ ఆఫ్ అకౌంట్ నిర్ణయంచేసి ఆర్థిక శాఖ ద్వారా వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. స్పందించిన చీఫ్ సెక్రటరీ.. త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తూ.. సమస్యలు అన్నింటిని పరిశీలిస్తానని చెప్పారని జేఏసీ నేతలు తెలిపారు. సీఎస్‌ని కలిసిన వారిలో జేఏసీ నేతలు పుల్లంగం దామోదర్ రెడ్డి, ముజీబ్ హుస్సేన్, ఎ.సత్యనారాయణ, బి.శ్యామ్, గోల్కొండ సతీష్, శ్రీరామ్‌రెడ్డి, వెంకట్, నిరంజన్‌రెడ్డి, షౌకత్‌హుస్సేన్, శ్రీకాంత్,సుజాత ఉన్నారు.

## సంగారెడ్డిలో తుపాకీతో కాల్చుకొని కానిస్టేబుల్ ఆత్మహత్య



సందీప్ (ఫైల్)

**సంగారెడ్డి బ్యూరో, నవంబరు 3, ప్రభాతవార్త :** సంగారెడ్డి పట్టణ పరిధిలో కానిస్టేబుల్ సోమ వారం తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడడం సంగా రెడ్డిలో సంచలనం కలిగించింది. ఆత్మ హత్యకు గల కారణాలు అధికారులు వెల్లడించాల్సి ఉంది. సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కొఠారి సందీప్ కుమార్ (2024 బ్యాచ్ పిసి నెంబర్ 3231) సోమవారం సాయంత్రం సమయంలో సంగారెడ్డి సమీపం లోని మెహబూబ్ సాగర్‌కట్ట వద్ద రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. విషయం తెలవగానే పోలీస్ అధికా రులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు సంగారెడ్డి జిల్లా, మండల కేంద్రమైన కల్హేర్ గ్రామానికి చెందినవాడు. కేసును సంగారెడ్డి పట్టణ పోలీ సులు దర్యాప్తు చేస్తున్నారు. రివాల్వర్ మృతిని వద్దకు ఎలా వచ్చింది అతను ఆత్మహత్య చేసు కోవడానికి గల కారణాలు వంటి విషయాలు ఇంకా కొన్ని సందేహాలు పోలీసు ఉన్నతాధికారుల విచారణలో తేలాల్సి ఉంది.ఘటన స్థలాన్ని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్‌పంకజ్ సందర్శించారు.

## 'దూదేకుల కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి'

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లక్షలాది మంది ముస్లిం నూర్‌భాషాలు, దూదేకుల సంక్షమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ఒక కార్పోరేషన్‌ను ఏర్పాటు చేసి 200 కోట్లు నిధులు కేటాయించాలని రాష్ట్ర ముస్లిం నూర్‌భాషా/దూదేకుల బిసి బి వెల్ఫేర్ అసోసియేషన్ సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో తమకు తీరని అన్యాయం జరిగిందని, ఇప్పటికైనా సిఎం జోక్యం చేసుకుని తమను అదుకోవాలని సంఘం నాయకులు కోరారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి అజిమొద్దీన్, గౌరవ అధ్యక్షుడు అహ్మద్ హుస్సేన్, నాయకులు బడేసాహెబ్, రాజ్‌మహ్మద్ తదితరులు మాట్లాడుతూ ఆత్మగౌరవ భవనానికి తగినన్ని నిధులు కేటాయించాలని, బిసిల 42 శాతం రిజర్వేషన్‌లలో దూదేకుల కులస్తులకు ఎంత రిజర్వేషన్‌లు కేటాయిస్తారో తెలియజేయాలని కోరారు.

# కాంగ్రెస్ గెలుపు లాంఛనమే.. అయినా నిర్లక్ష్యం వద్దు

### నేతలకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ సూచన




గాంధీభవన్ ఇందిరాభవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, నవంబరు 3,ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌పార్టీ విజయం లాంఛనమే విజయం ఖాయమైంది ఏ ఒక్క నాయకుడు కూడా ఎలాంటి నిర్లక్ష్యంగా ఉండటం తగదని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్ ఇందిరాభవన్‌లో సోమవారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమీక్ష సమావేశం నియోజక వర్గ ఇన్‌చార్జ్‌లు, బూత్ పరిశీలకులతో జరిగింది. టిపిసిసి అనుబంధ సంఘాల చైర్మన్‌లు మంత్రి కొండా సురేఖ, ఎఐసిసి కార్య దర్శులు విశ్వనాథన్, సంపత్ కుమార్ ఎంపిలు ఎమ్మెల్యేలు, చైర్మన్‌లు నాయకులు పాల్గొన్నారు. మహేష్‌కుమార్ మాట్లాడతూ జూబ్లీహిల్స్ అసెం బ్లీ ఉపఎన్నికల్లో ఓటర్లు సంక్షేమం అభివృద్ధికి పట్టం కట్టడానికి నిర్ణయం తీసుకొన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ లోని ఏ ఒక్క నాయకులు కూడా ఎలాంటి నిర్లక్ష్యం వద్దని కాంగ్రెస్‌కు ఓటు వేసేలా ప్రతి ఓటరును పోలింగ్ బూతుకు తీసుకొని రావాలని ఆయన సూచించారు. ఎన్నికల వ్యూహాలు పకడ్బందీగా చేసుకొని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు.రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమాన్ని చేసి చూపించాము ఓటరు మనకు ఓటు వేసేందుకు మానసికంగా సిద్దంగా ఉన్నారని అన్నారు.మనం చేసిన అభివృద్ధి పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటే మన విజయాన్ని ఎవరు ఆపలేరని ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికల బాధ్యతలు తీసుకున్న నాయకులు వారి బాధ్యతలు ఎక్కడ చిన్న నిర్లక్ష్యం చేయకుండా పని చేయాలని కోరారు..ఈ వారం రోజులు చాలా కీలకమైన సమయమని ఇంటింటి ప్రచారం, వీధులలో ప్రచారంలో మనం గ్రాస్ రూట్లో ఇంకా లోతుగా వెళ్లి ప్రచారం చేయాలని అన్నారు.
మీరంతా చాలా అనుభవజ్ఞులైన నాయకులు మీరు ఓటర్లను ఎలా కాంగ్రెస్ వైపు నడపాలో మీకు బాగా తెలుసని చెప్పారు. గెలుపే లక్ష్యంగా, ప్రతి నాయకుడు తానే అభ్యర్థిని అన్నట్టుగా పని చేయాలని కోరారు. ఫలితం మనకు అనుకూలంగా రావడం ఖాయం. మంచి మెజారిటీ కూడా రావాలని ఆదేశించారు.

## దేశవ్యాప్తంగా సన్నబియ్యం అమలుచేసే దమ్ము బిజెపికి ఉందా?

### మీడియా కమ్యూనికేషన్స్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి


**హైదరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా సన్నబియ్యం అమలు చేసే దమ్ము బిజెపికి ప్రధానమంత్రి నరేంద్రమోడికి ఉందా అని మీడియా కమ్యూనికేషన్స్ చైర్మన్ రామోహన్‌రెడ్డి ప్రశ్నించారు. గాంధీభవన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సన్న బియ్యం పథకాన్ని రద్దు చేసే దమ్ముందా? అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.దేశంలోనే మొదటగా సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆయన గుర్తుచేశారు. దేశంలో ఎక్కడ సన్నబియ్యం ఇవ్వరని ఇక్కడే ఇస్తున్నారని ఇదే బాటలో దేశ వ్యాప్తంగా అదే సన్న బియ్యం ఇచ్చే దమ్ము మీబిజెపి ప్రభుత్వానికి ఉందా ముందు చెప్పండి? అని ఆయన ప్రశ్నించారు. మీబిజెపి అధికారంలో ఉన్న ఏ రాష్ట్రాల్లో నైనా సన్న బియ్యం పథకం ఉందా? లేదుఅన్నారు.ఈ పది సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు సౌకర్యాన్ని అయినా కేంద్ర ప్రభుత్వం అదనంగా పేదలకు ఇచ్చిందా అని అడిగారు. నిన్ను కేంద్రమంత్రిని చేసిన తెలంగాణ రాష్ట్రానికి పెరిగిన జనాభా కి అనుగుణంగా రేషన్ బియ్యం కేటాయించని అసమర్థత నీది కాదా అని ఆయన అన్నారు.రాష్ట్రంలో మేము పెంచిన కార్డులతో కలిపి కోటి రేషన్ కార్డులు ఉంటే కేంద్రం ఇచ్చేది రేషన్ 50 లక్షల కార్డులకే (5 కిలోల దొడ్డ బియ్యం) కాదా? అని అడిగారు. అయినా ప్రతీసారి మేము ఇస్తున్నాం మేము ఇస్తున్నామని కేంద్రప్రభుత్వ నేతలు ఊగిపోతున్నారని అన్నారు.అన్నీ కలిపినా మీరు ఇచ్చేది మేము కట్టే రూపాయి లోనుంచి 40 పైసలు మాత్రమే కదా అని అన్నారు.మేకకి గడ్డం ఉన్నట్లు తెలంగాణకి కిషన్ రెడ్డి ఉన్నారని ఒక్కటేపైసా పనికిరావని ఆయన అభివర్ణించారు.

## ధర్మం ముసుగులో దాడిచేస్తే కేసులు ఉండవా?

### సిజెఐపై దాడికి నిరసనగా 17న చలో ఢిల్లీ

### ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయిపై అమానుష దాడి జరిగిన నేపథ్యంలో దేశ భక్తులు ఎవరో, దేశ ద్రోహులు ఎవరో విస్తృతంగా చర్చ జరగాలని, భారత దేశంలో ఉంటూ భారత రాజ్యాంగాన్ని అవ హేళన చేస్తున్న వారు, రాజ్యాంగాన్ని ధిక్కరిస్తున్న వాళ్ల దేశద్రోహులు అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ధ్వజమెత్తారు. ఈ మేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మంద కృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగ వ్యవస్థలో అత్యున్నతమైనదిగా ఉన్న సుప్రీం కోర్టులో చీఫ్ జస్టీస్ దళితుడైన గవాయ్ మీద అమానుషమైన దాడి జరిగి నెల రోజు లు కావస్తున్నా నేటికీ చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం అత్యంత దారుణమన్నారు. దేశ ప్రజలంతా ఈ దారుణాన్ని ఖండించినా కూడా చట్ట పరమైన వ్యవస్థలు మాత్రం కనీసం సుమోటోగా కేసు స్వీకరించకుండా దళితులను చిన్నచూపు చూసాయని అన్నారు. నిందితుడు బూట్లతో దాడి చేస్తే మౌనంగా ఉన్న వ్యవస్థలు రేపు కత్తులతో దాడులు చేసినా ఇలాగే వ్యవహరిస్తాయా అని ప్రశ్నించారు. ఢీల్లీ పోలీసులు, న్యాయవ్యవస్థ, జాతీయ మానవ హక్కుల కమిషన్ ఈ దాడిని సుమోటోగా ఎందుకు స్వీకరించలేదు అని ప్రశ్నించారు.ఎన్నో సంఘటనలను పత్రికలో వచ్చిన వార్తలను ఆధారం చేసుకొని సుమోటోగా స్వీకరిస్తున్న న్యాయవ్యవస్థకే సుప్రీంగా ఉన్న సుప్రీం కోర్టులో ఏకంగా చీఫ్ జస్టీస్ పైన దాడి జరిగితే మౌనంగా ఉండడం వెనుక మర్మం ఏమిటి అని అన్నారు.ఈ దాడిని ధర్మం కోసం చేశానని నిందితుడు బహిరంగంగా చెబుతుంటే, చేసిన దాడిని కొంతమంది సమర్థిస్తూ ఇంకా దాడులు చేస్తామని మాట్లాడుతుంటే ఈ దేశ వ్యవస్థలు మౌనం వహించడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు ధర్మం ముసుగులో దాడులు చేస్తే చట్టపరమైన చర్యలు ఉండవా ? కేసులు పెట్టడం జరగదా ? అరెస్టులు ఉండవా ? శిక్షలు వేయరా ? అని ప్రశ్నించారు. విశ్వాసాలు, ధర్మాలు రాజ్యాంగానికి , చట్టానికి లోబడి ఉండాల్సిందేనని అన్నారు. గవాయి మీద జరిగిన దాడి దళితులపైన, రాజ్యాంగంపైన దాడిగా ఉందని అన్నారు. ఆయనపై దాడికి నిరసనగా ఈనెల 17న చలో ఢిల్లీ కార్యక్రం నిర్వహిస్తున్నట్లు మందకృష్ణ పేర్కొన్నారు.




సోమవారం సోమాజిగూడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ

## పత్తి కొనుగోలులో తేమ పేరుతో దోపిడీ

### గిట్టుబాటు ధర కల్పించాలి: జాగృతి అధ్యక్షురాలు కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 3:** రాష్ట్రంలో పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, తేమ పేరుతో కొనుగోలు కేంద్రాల్లో వారిని దారుణంగా మోసం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కేంద్రాల్లో అధికారులు సృష్టిస్తున్న ఇబ్బందుల వల్ల రైతులు గిట్టుబాటు ధర కోల్పోయి, ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిం చాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లాలో చేపట్టిన జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా ఆమె జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ.. "తేమ సాకుతో సీసీఐ అధికారులు రైతులను ఇబ్బంది పెడుతున్నారు. దీంతో దిక్కులేక రైతులు తమ పంటను ప్రైవేటుకు అమ్ముకుంటున్నారు. ఈ ప్రాంతంలో బీజేపీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది" అని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లో ప్రచారం ఆపి, తక్షణమే రైతుల సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. తేమ శాతంతో సంబంధం లేకుండా పత్తిని గిట్టుబాటు ధరకు సీసీఐ కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అంతకుముందు ఆదిలాబాద్‌కు చేరుకున్న కవితకు తెలంగాణ జాగృతి నాయకులు, ఆదివాసీలు గుస్సాడీ నృత్యాలు, సంప్రదాయ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలోని ఆదివాసీల ఆరాధ్య దైవం కొమురం భీం విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక రైతులు, ఆదివాసీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దుకింద వేతనాలు ఇవ్వాలి

### డిప్యూటీసిఎం భట్టి విక్రమార్కకు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 పద్దుకింద వేతనాలు ఇవ్వాలని నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఇవ్వాలని కోరుతూ సోమవారం ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టికి వివరిస్తూ.. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నాడు యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 194 మోడల్ స్కూల్‌లలో సుమారుగా 3000 మంది రెగ్యులర్ ఎంప్లాయిస్ ప్రిన్సిపాల్, పిజిటి, టిజిటిలుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఈ పరిమిత ఉద్యోగుల కోసం ప్రత్యేక సొసైటీ నిర్వహణ రాష్ట్ర ఖజానాపై అదనపు ఆర్థిక భారంగా మారుతోందని... కాబట్టి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మోడల్ స్కూల్‌లను విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని కోరారు. పొరుగు రాష్టం అయిన ఆంధ్రప్రదేశ్‌లో కూడా మోడల్ స్కూల్‌లను విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు ప్రకటించారని శ్రీపాల్ రెడ్డి గుర్తు చేశారు. ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం ఉండబోదన్నారు. కావున ఆర్థిక శాఖ పరిశీలనలో ఉన్న 010 ఫైల్‌పై త్వరగా సానుకూల నిర్ణయం తీసుకొని తగు ఉత్తర్వులు అందించాలని కోరారు.
దాంతోపాటు ఉపాధ్యాయుల, పెన్షనర్ల పెండింగ్ బిల్లులు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల డిఏ బకాయిలు వెంటనే చెల్లించేలా చూడాలన్నారు. ఇందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పందిస్తూ .. యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మోడల్ స్కూల్‌లు మంచి పురోగతి సాధించాయని, ఇది ఆర్థిక భారం లేని అంశం అయితే ఖచ్చితంగా నిర్ణయం తీసుకొంటామని, దశల వారీ పెండింగ్ బిల్లులు చెల్లింపు వేగవంతం చేస్తామని తెలిపినట్టు ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి చెప్పారు.
మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల తరుపున ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీష్ ఉప ముఖ్యమంత్రిని కలిసినవారిలో ఉన్నారు.

# 42 శాతం రిజర్వేషన్ల కోసం మిలిటెంట్ ఉద్యమాలు

### రాష్ట్ర బిసి జెఎసి చైర్మన్ ఆర్.కృష్ణయ్య సూచన

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 3, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వే షన్‌లు సాధించేంత వరకు నిత్యం మిలిటెంట్ ఉద్యమాలు, ఆందోళనలు కొనసాగిస్తూ ఉద్యమాన్ని ఉదృతం చేయాలని తెలంగాణ రాష్ట్ర బిసి జెఎసి చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య బిసి లోకానికి పిలుపు నిచ్చారు. ప్రతిరోజు జిల్లా, లోక్‌సభ, అసెంబ్లీ నియోజవర్గాలు, మండ లాలు, గ్రామాల్లో ధర్నాలు, నిరాహార దీక్షలు, నిరసన ప్రదర్శనలు చేపట్టాలని బిసి సంఘాలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలను కోరారు. రాష్ట్ర హైకోర్టులో బిసి రిజర్వే షన్‌లపై కేసు కొనసాగుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించాలని ఆయన సూచించారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన బిసిల సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చట్ట ప్రకారం బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ జివో తీసుకువచ్చిందని, ఆ జివోను పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం అమోదించి 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. 76 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత కూడా బిసిలకు న్యాయం జరగడం లేదని, 130 సార్లు రాజ్యాంగాన్ని సవరించిన కేంద్రం 56 శాతం జనాభా ఉన్న బిసిల కోసం ఒక్కసారైనా రాజ్యాంగాన్ని సవరించలేదా? అని ఆయన ప్రశ్నించారు. బిసి జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థలకు రిజర్వేషన్‌లు కల్పించే సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడానికి రాజ్యాంగ సవరణే ఏకైక మార్గమని చెప్పారు. తెలంగాణ బంద్‌కు మద్దతు ఇచ్చిన అన్ని రాజకీయ పార్టీలు రాజ్యాంగ సవరణకు మద్దతు ఇవ్వాలని ఆర్.కృష్ణయ్య కోరారు. తెలంగాణ బంద్ సందర్భంగా అన్యాయంగా, అక్రమంగా వందలాది మందిపైన పోలీసులు కేసులు నమోదు చేశారని, తక్షణమే కేసులను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎత్తిరి భీమ్‌రాజ్ అధ్యక్షత వహించగా, కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్, నాయకులు మీనగా గోపి, మోదీ రాందేవ్, కిషోర్‌యాదవ్, నాగేష్, లక్ష్మణ్, నరేష్‌గౌడ్, నిఖిల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో నీల వెంకటేష్ తదితరులు

# జూబ్లీహిల్స్‌లో ఏడు మహిళా బృందాలతో ఎన్నికల ప్రచారం

### మీనాక్షి నటరాజన్, రేణుకచౌదరి, విజయశాంతి తదితరుల నేతృత్వంలో ప్రత్యేక టీమ్‌లు

**హైదరాబాద్, నవంబరు 3,ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఎన్నికలలో గెలుపొందేందుకు కాంగ్రెస్‌పార్టీ సర్వశక్తులు ఒడ్డుతున్నది. మహ్మద్ అజారొద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చి ఓవైపు ముస్లిం ఓటర్లను ఆకట్టుకొనే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఆ నియోజకవర్గంలో సగభాగం వున్న మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకోవాడినికి వారిని లక్ష్యంగా చేసుకొని ప్రచార కార్యక్రమాలు చేపట్టడానికి ఏడు బృందాలను ఏర్పాటు చేశారు. ఏడు బృందాలలో నాయకత్వం వహించే వ్యక్తితోపాటు 10మంది ఉంటారు. మొత్తం 70మంది ఏడు డివిజన్లలో ప్రచారం చేస్తారు. మీనాక్షి నటరాజన్ టీమ్‌లో మంత్రి కొండ సురేఖ,టినిర్మలగౌడ్,కొండురు పుష్పలీల, అడువాల జ్యోతి, భవాని త్రివేది,జువ్వాడి ఇందిర,కె.రవళి రెడ్డి, షమీమ్ అగా, రిజ్వాబేగం ఉంటారు. ఎంపి జి రేణుక చౌదరి బృందంలో మట్టారాగమయి, కె.సరితా తిరుపతయ్య, సింగాపురం ఇందిర, బండారుశోభారాణి, ఇందుప్రియరెడ్డి,డాక్టర్ గిరజషెట్కర్, కె.దివ్యావాణి చౌదరి, నసీమ్‌సుల్తానా, కనీస్‌ఫాతిమా ఉన్నారు. ఎమ్మెల్సీ విజయశాంతి నేతృత్వంలో సునీత మహేందర్‌రెడ్డి, సునీత ముదిరాజ్ కల్వల సుజాత, శశికళయాదవ్, మచ్చవరలక్ష్మీ, చొప్పదండి భవాని, సారాఖాన్, మస్రత్‌సుల్తానా ఇషా ఉస్సీ షా ఉంటారు.మేయర్ గద్వాల విజయలక్ష్మీ నాయకత్వంలో కొక్కిరాల సురేఖ, పి.విజయారెడ్డి, బొజ్జ సంధ్యారెడ్డి, బేబీ స్వర్ణకుమారి, పాలడుగుపద్మ, హనుమాండ్ల జాన్సీరెడ్డి, పి.ఇందిరా శోభన్,రేగులపాటి రమ్య, జూలూరు ధనలక్ష్మీగౌడ్ లు పనిచేస్తారు.నల్లమడ పద్మావతి నాయకత్వంలో ఆత్రం సుగుణ, పంజాల అలేఖ్య, లకావత్ దన్వంతి, భీమగాని సౌజన్యగౌడ్, అజ్మాషకీరా, జి రేణుక నారాయణ, జి.హైమవతి, కల్పనరెడ్డి, స్వరూపరాణి ఉన్నారు. మామిడాల వైష్ణవి నాయకత్వంలో కోట నీలిమా, రాయగిరి కల్పన యాదవ్, నీలం పద్మ, మంజులారెడ్డి, శైలజారెడ్డి,పోశాల శోభన, మీర్జాబేగం, తస్వీర్‌బేగం, రోజారెడ్డిలు పనిచేస్తారు. ఎంపి కడియం కావ్య నాయకత్వంలో జివి వీణ, ఆకుల లలిత, చింతల నిర్మలరెడ్డి, షిరాజ్‌ఖాన్,జక్కని అనిత, లతీఫాబేగం జమీలా, కరీంనగర్‌శోభన, అబ్దేశి సదాలక్ష్మీ లు పనిచేస్తారు. మహిళా ఓటర్లపై దృష్టిని కేంద్రీకరించడానికి ఈ బృందాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రచారం కోసం టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ 70మందితో బృందం ఏర్పాటు చేశారు.

# అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

### బ్యాటరీలు, డీజెల్, 3 లక్షల నగదు, వాహనాల స్వాధీనం

### వివరాలను వెల్లడించిన సిపి ఎం.ఎస్.విజయ్‌కుమార్




వివరాలను వెల్లడిస్తున్న సిపి ఎం.ఎస్.విజయ్‌కుమార్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** గత కొన్ని నెలలుగా సెల్ టవర్‌లో బ్యాటరీలు, డీజిల్ దొంగిలిస్తున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్టు చేసి 18 బ్యాటరీలు, డీజిల్, రూ. 3లక్షల నగదు, కారు, త్రీవిల్లర్, టాటా ఎసి వాహనం, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు సీపీ ఎం.ఎస్. విజయ్ కుమార్ తెలిపారు. సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. అలాగే దొంగ సొత్తు కొనుగోలు చేసిన సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేటకు చెందిన బండారి శ్రీనివాస్, పోసాన్‌పల్లికి చెందిన పుట్ట అంజనేయులు, నాగపూర్‌కు చెందిన రామచంద్రం,జగదేవాపూర్‌కు చెందిన నూనె మహేందర్, గజ్వేల్‌కు చెందిన మహ్మద్ అజీమ్, అబ్దుల్‌పూర్‌మెట్‌కు చెందిన జోగు యాదిలను అరెస్టు చేసినట్లు వివరించారు. కొత్తగూడం భద్రాది జిల్లా అయ్యన్నపాలేనికి చెందిన బత్తుల గురుస్వామి(31), బత్తుల సాయిరాం(26), అలకుంట లక్ష్మణ్‌రావు(20), అలకుంట శేఖర్(22), బత్తుల శ్రీను(36) అనే 5గురు నిందితులు ముఠాగా ఏర్పడి సెల్ టవర్‌లో బ్యాటరీలు, డీజిలు దొంగిలించడమే పనిగా పెట్టుకున్నారని తెలిపారు. ముఠా సభ్యులు సిద్దిపేట జిల్లాలో 16, రాచకొండ, జగిత్యాల 24, సూర్యపేట 1, యాద్రాది భువనగిరి 3, వరంగల్, జనగాం, మహబూబాబాద్ జిల్లాలో 33 వరుస దొంగతనాలకు పాల్పడినట్లు వివరించారు. సెల్ టవర్ల నుంచి బ్యాటరీలు, డీజిల్ దొంగిలిస్తున్నారని తొగుట సర్కిల్ పరిధిలో ఫిర్యాదు బాధితులు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.
ఈ క్రమంలో దొంగల ముఠాను పట్టుకోవడానికి గజ్వేల్ ఎసిపి నర్సింలు, తొగుట సిఐ ఎస్.కె.లతీఫ్, సీసీఎస్ సీఐ అంజయ్య, తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు, రాయపోల్ ఎస్ఐ మానస, దౌల్తాబాద్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌లు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారని తెలిపారు. ఈ క్రమంలో తొగుట గ్రామ పరిధిలోని బతుకమ్మకుంట వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులు పట్టుబడినట్లు తెలిపారు. సమావేశంలో తొగుట సీఐ లతీఫ్, సీసీఎస్ సీఐ అంజనేయులు, ఎస్ఐలు మానస, అరుణ్‌కుమార్, రవికాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా దొంగల ముఠాను పట్టుకున్న పోలీసు అధికారులను, సిబ్బందిని సీపీ విజయ్‌కుమార్ అభినందించారు.

# డిసెంబరు 19 నుంచి హైదరాబాద్ అంతర్జాతీయ లఘుచిత్రోత్సవం

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 3: ఈ సంవత్సరం డిశంబరు 19 వ తేదీ నుండి 21వ తేదీ వరకూ ప్రసాద్ ఐమాక్స్‌లో జరగనున్న తొలి హైదరాబాద్ అంతర్జాతీయ లఘుచిత్రోత్సవం లోగోను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ సోమవారం నాడు గవర్నర్ దర్బార్ హాలులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ అంతర్జాతీయ లఘు చిత్రోత్సవం ఛీఫ్ పాట్రన్ జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ సినీ దర్శకులు సి. ఉమామహేశ్వరరావు, లఘు చిత్రోత్సవ నిర్వాహకులు దాదా సాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిలిం స్టడీస్ ప్రిన్సిపల్ నందన్ బాబు, తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి ప్రియాంకలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ లఘుచిత్రాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశవ్యాప్తంగా పలు చలనచిత్రోత్సవాలు జరుగుతున్నా ఈ స్థాయిలో అంతర్జాతీయ లఘు చిత్రోత్సవం నిర్వహించ బూనుకోవటం పట్ల గవర్నర్ నిర్వాహకులను అభినందించారు. హైదరాబాద్ సంస్కృతీ సాంప్రదాయాలకు ఈ లోగో దర్పణం పడుతోందని ఆయన ప్రశంసించారు. భారతీయ చలన చిత్ర పరిశ్రమలో హైదరాబాద్‌కు విశేషమైన స్థానం ఉందని, ఈ లఘుచిత్రోత్సవాల ద్వారా నగరం కొత్తదనాన్ని సంతరించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యల గురించిన ప్రాథమిక అవగాహన కల్పించేందుకు లఘుచిత్రాలు కీలకమైన సాధనంగా మారాలని గవర్నర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ దేశంలో ఈ స్థాయిలో లఘుచిత్రాలకు ప్రాధాన్యత ఇచ్చి ప్రత్యేకంగా మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించటం ఇదే మొదటి సారని, రానున్న కాలంలో హైదరాబాద్‌ను అంతర్జాతీయ చలనచిత్ర యవనికలో ఓ ప్రాధాన్యత కలిగిన కేంద్రంగా అభివృద్ధి చేయటానికి ఈ లఘుచిత్రోత్సవాలు ఉపయోగపడతాయని అన్నారు. రానున్న కాలంలో భారదేశంలోనే హైదరాబాద్‌ను చలనచిత్ర హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చలన చిత్ర అభివృద్ధి సంస్థ నిర్విరామంగా కృషి చేస్తోందని, దేశంలోనే అత్యధిక సంఖ్యలో ఫిలిమ్ స్క్రీన్‌లు హైదరాబాద్‌లోనే ఉన్నాయని ఆమె అన్నారు. ఈ అంతర్జాతీయ లఘుచిత్రోత్సవాల నిర్వహణలో తెలంగాణ చలన చిత్ర అభివృద్ధి సంస్థ ప్రధాన భాగస్వామిగా ఉండటం ఎంతో సంతోషించదగ్గ విషయమని, ఈ ఉత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. లఘుచిత్రోత్సవం ఛీఫ్ పాట్రెన్ సి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ, డిశంబరు 19 నుండీ 21 మధ్య నిర్వహించబోతున్న ఈ లఘు చిత్రోత్సవాలు ఆధునిక ప్రపంచ సంస్కృతితో తెలంగాణ సంస్కృతి పెనవేసుకోవడానికి ఓ వేదికగా ఉంటుందనీ, తెలంగాణ రాష్ట్రంలో విస్తృతంగా సాంస్కృతిక ఉత్పత్తులు, లఘు చిత్రాలు నిర్మించే యువతకు ఈ ఉత్సవాలు అద్భుతమైన అవకాశాలను కల్పించనున్నాయని, ఈ సందర్భంగా సినీ రంగ నిపుణులతో జరిగే ప్యానెల్ చర్చల్లో చలన చిత్ర కౌశలానికి సంబంధించిన ఎన్నో విషయాలు చర్చించనున్నట్లు ఉమా మహేశ్వరరావు తెలిపారు.



## నెదర్లాండ్‌లో మంత్రి సీతక్క

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 3:రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు అరుదైన గౌరవం లభించింది. అంతర్జాతీయ స్థాయి మహిళా నాయకత్వ వేదిక వైటల్ వాయిసెస్ గ్లోబల్ ఫెలోషిప్ (వీవీజీఎఫ్) సదస్సుకు ఆమెకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ ఆహ్వానం మేరకు మంత్రి సీతక్క ఆదివారం నెదర్లాండ్‌కు చేరుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా మహిళా నాయకత్వం, సామాజిక మార్పు, ప్రజా సేవా రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న నాయకులను మాత్రమే ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుకు ఆహ్వానిస్తారు. మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం మంత్రి సీతక్క చేసిన నిరుపమానమైన కృషిని గుర్తించిన నిర్వాహకులు ఆమెకు ఈ గౌరవాన్ని అందించారు. నెదర్లాండ్‌లో జరుగుతున్న ఈ అంతర్జాతీయ సదస్సులో ప్రపంచంలోని పలు దేశాల మహిళా నాయకులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క తెలంగాణ రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతున్న మహిళా, శిశు సంక్షేమ కార్యక్రమాలను, అలాగే రాష్ట్రంలో చేపడుతున్న గ్రామీణాభివృద్ధి చర్యలను అంతర్జాతీయ వేదికపై వివరించనున్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికల కేసు..

## 24వ తేదీకి విచారణ వాయిదా

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 3: రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను స్టేట్ ఎలక్షన్ కమిషన్ సస్పెండ్ చేస్తూ అక్టోబర్ 9న ఉత్తర్వులు జారీ చేసి విషయం తెలిసిందే. అయితే, ఆ ఉత్తర్వులను సస్పెండ్ చేయడానికి సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఆ పిటిషన్‌పై మరోసారి విచారణ చేపట్టిన ధర్మాసనం సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వంతో పాటు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. అయితే, వాదనల సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాది ఎన్నికల నిర్వహణపై కేబినెట్ తమ అభిప్రాయం తెలిపేందుకు మరింత గడువు కావాలని కోరారు. మరోవైపు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా తెలిపింది. దీంతో కేసు లో తదుపరి విచారణను ధర్మాసనం ఈ నెల 24కు వాయిదా వేసింది.

## బిజెపికి పదివేల ఓట్లు దాటవు

### బిఆర్ఎస్‌తో ఆ పార్టీ లోపాయికారి ఒప్పందం

### కిషన్‌రెడ్డికి సవాల్ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 3, ప్రభాతవార్త:జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నికల్లో బీజేపీ పార్టీకి ఈ సారి పదివేల ఓట్ల కంటే ఎక్కువ దాటవని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఛాలెంజ్ చేశారు. పొన్నం ఈ మేరకు మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. జూబ్లీ ఎన్నికలకు సంబంధించి కిషన్‌రెడ్డి మాటలు వింటుంటే జోక్‌గా ఉంటున్నాయి. గతంలో బీజేపీ నుంచి ఇదే అభ్యర్థి పోటీచేశారని, అప్పుడు 25వేల ఓట్లు వచ్చాయని, అయితే ఈ సారి పది వేల కంటే ఎక్కువ ఓట్లు రావని అన్నారు. కిషన్‌రెడ్డి నేరుగా బీఆర్ఎస్‌తో కుమ్మక్కయ్యారని, మొత్తం డిపాజిట్లు కర్లలా బీజేపీ వ్యవస్థను బీఆర్ఎస్‌కు హస్తగతం చేశారన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతు తీసుకున్న కిషన్‌రెడ్డి ఈ ఎన్నికల్లో తిరిగి తన భక్తిని చాటుకుంటున్నారన్నారు. పది ఏళ్లుగా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గానికి ఏం చేశారో స్పష్టం చేయాలన్నారు. అభ్యర్థిని మోసం చేయకుండా, ఎవరి పార్టీకి అమ్ముకుండా నిజాయితీగా పనిచేయని రాజాసింగ్ చెబుతున్నట్లు వ్యవహరించాలని కోరుతున్నట్లు స్పష్టం చేశారు.



బుక్‌ఫెయిర్ లోగో ఆవిష్కరిస్తున్న సుదర్శన్‌రెడ్డి, కోదండరాం తదితరులు

## డిసెంబరు 19 నుంచి 'హైదరాబాదు బుక్ ఫెయిర్'

హైదరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త: డిసెంబరు 19 నుంచి 29 వరకు నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో 'హైదరాబాద్ బుక్ ఫెయిర్' నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుక్ ఫెయిర్ లోగోను గౌరవ సలహాదారు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, ఎంఎల్‌సి ప్రొ. కోదండరాం, సీనియర్ పాత్రికేయుడు కె.రామచంద్రమూర్తి, హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యనిర్వాహక సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 11 రోజులపాటు జరిగే ఈ వేడుకలో అన్నిరోజుల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శకులకు అనుమతించనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం కూడా బుక్ ఫెయిర్‌లో సందర్శకులకు, స్టాల్ హోల్డర్లకు అన్ని ఏర్పాట్లు కమిటీ ఏర్పాటు చేస్తుందని చెప్పారు. డిజిటల్ యుగం అని పేర్కొంటున్న ఈకాలంలో పుస్తకాల ప్రచురణ, పాఠకులు పెరగటం పట్ల సలహాదారులు తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. పుస్తకాల పట్ల అవగాహన పెంచటానికే కాకుండా పుస్తకాలను పాఠకులకు అందుబాటులోకి తీసుకురావటానికి హైదరాబాదు బుక్ ఫెయిర్ లాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. పుస్తకావిష్కరణ కార్యక్రమాలు, మనం చదివిన, మెచ్చిన, నచ్చిన పుస్తకం, సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. బుక్ ఫెయిర్ గ్రౌండ్‌లో బుక్ డొనేషన్‌కు అవకాశం కల్పించి, అలా వచ్చిన పుస్తకాలను ప్రజా గ్రంథాలయాలకు అందచేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. బుక్ ఫెయిర్‌లో పాల్గొనటానికి దరఖాస్తులను నవంబరు 1 నుంచి 30 వరకు అన్నీ పనిదినాలలో బాగ్ లింగంపల్లి, ఎంహెచ్‌భవన్‌లోని హైదరాబాదు బుక్ ఫెయిర్ కార్యాలయంలో మాత్రమే తీసుకుంటామని ఈసారి మొత్తం 260 స్టాళ్లకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఎస్‌బిఐ కంప్యూటర్ ఆపరేటర్ అరెస్ట్

### 2002లో నమోదైన బ్యాంక్ ఫ్రాడ్ కేసులో

### సిబిఐ కోర్టు కీలక తీర్పు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 3:స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) చందులాల్ బరాదారి బ్రాంచ్ చోటుచేసుకున్న రూ.50 లక్షల బ్యాంక్ మోసం కేసులో నిందితుడైన కంప్యూటర్ ఆపరేటర్ చలపతిరావుకు సీబీఐ ప్రత్యేక కోర్టు రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.36 వేల జరిమానా విధించింది. ఈ విషయం సోమవారం సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) హైదరాబాద్ శాఖ వెల్లడించింది. సీబీఐ తెలిపిన వివరాల ప్రకారం.. 1996-2000 మధ్య కాలంలో చలపతిరావు అప్పటి బ్రాంచ్ మేనేజర్ పి.పి. కృష్ణరావు, ఇద్దరు ప్రైవేటు వ్యక్తులు, చలపతిరావు భార్య విరాజా, కలీమ్ పాషాలతో కలిసి తప్పుడు పత్రాల ఆధారంగా బిగ్ బై లోన్లు మంజూరు చేసి, విడుదల ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో సుమారు రూ.50 లక్షల వరకు బ్యాంకును మోసం చేసినట్లు దర్యాప్తులో తేలింది. 2002లో ఈ కేసు నమోదై, 2004లో సీబీఐ మూడు చార్జ్ షీట్లు దాఖలు చేసింది. అయితే చలపతిరావు 2005 నుంచి పరారీలో ఉన్నాడు. దాదాపు 19 ఏళ్ల పాటు పరారీలో ఉన్న అతన్ని 2024 ఆగస్టులో తమిళనాడులోని తిరునెల్వేలి ప్రాంతంలో. మారుపేరుతో ఉన్నట్లు సీబీఐ గుర్తించి అరెస్ట్ చేసింది. తదనంతరం అక్టోబర్ 31న సీబీఐ కోర్టు విచారణ జరిపి, నిందితులను దోషులుగా నిర్ధారించి శిక్ష విధించింది.

## వాహనాల స్పీడ్‌లాక్ ఎంతవరకు అమలవుతున్నాయో చూడాలి

### వాటిని బ్రేక్‌చేస్తే ట్రిపుల్ పెనాల్టీ వేయాలి

### రవాణా శాఖ అధికారులతో జూమ్ మీటింగ్‌లో మంత్రి పొన్నం

హైదరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త: ఈ మధ్య కాలంలో జరుగుతున్న వాహనాల ప్రమాదాల నేపథ్యంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రవాణా శాఖ అధికారులతో సోమవారం ప్రత్యేకంగా జూమ్ మీటింగ్ నిర్వహించారు. మీటింగ్‌లో మాట్లాడుతూ.. వాహనాల స్పీడ్ లాక్ ఎంత వరకు అమలవుతున్నాయో చూడాలని.. దానిని బ్రేక్ చేస్తే ట్రిపుల్ పెనాల్టీ వేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రవాణా శాఖ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీరియస్‌గా ఉంటూ యాక్టివ్‌గా ఉండాలన్నారు.
మంత్రి నిర్వహించిన కీలక జూమ్‌సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి , జేటీసీలు, డీటీసీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలు జరగకుండా రవాణా శాఖ అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం జరిగిన ప్రమాదంలో రెండు వాహనాలకు ఫిట్‌నెస్ ఉన్నప్పటికీ ఇరుకు రోడ్డు డివైడర్ లేకపోవడం వల్ల ప్రమాదం జరిగిందన్నారు.
ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. వాహనాల స్పీడ్ లాక్ ఎంత వరకు అమలవుతున్నాయో చూడాలని, దానిని బ్రేక్ చేస్తే ట్రిపుల్ పెనాల్టీ వేయాలని రవాణా శాఖ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీరియస్‌గా ఉంటూ యాక్టివ్‌గా ఉండాలన్నారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు దాడులు నిర్వహించడం కాదని.. నిరంతరం యాక్షన్ ప్లాన్ ఉండేలా కఠినంగా వ్యవహరించాలని అధికారులను మంత్రి పొన్నం ఆదేశించారు. రవాణా శాఖ గౌరవాన్ని ప్రజల్లో, పెంపొం దించేలా ఉద్యోగులు పని చేయాలన్నారు. ఎఫెక్టివ్‌గా పని చేయాలని నిరక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.



## ఆహారంలో చేపల భాగస్వామ్యంపై ప్రచార ప్రణాళికలు రూపొందించండి

### నెలాఖరుకల్లా చేపపిల్ల చెరువుకు చేరాలి

### రూ.123 కోట్ల బడ్జెట్ : మంత్రి వాకిటి శ్రీహరి

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 3:మాంసం భుజించడంలో మొదటి స్థానంలో ఉన్న తెలంగాణ చేపలను భుజిచడంలో వెనుకబడి ఉందని చేపల భుజించడం వల్ల జరిగే ఆరోగ్యపరమైన లాభాలపై విస్తృత ప్రచార ప్రణాళికలు రూపొందించండని మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.సోమవారం డా బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో చేపపిల్లల పంపిణీపై 32 జిల్లాల కలెక్టర్లు,మత్స్య శాఖ అధికారులతో మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నవంబర్ చివరికల్లా చేపపిల్లల పంపిణీ పూర్తి కావాలి.అందుకు అనుగుణంగా ప్రజాప్రతినిధులను కలుపుకొని పంపిణీ చేసేవిధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని,గత ప్రభుత్వ హయంలో చేప పిల్లల పంపిణీలో అక్రమాలు జరిగాయి.మత్స్యశాఖపై ఉన్న అభియోగాన్ని మార్చేందుకు ప్రతి చెరువు వద్ద చేపపిల్లల పంపిణీ వివరాలు తెలిసేలా సైన్ బోర్డు ఏర్పాటు చేయాలి,చేప పిల్లల పంపిణీ ప్రక్రియను ప్రభుత్వం నియమ నిబంధనలు అనుగుణంగా టి మత్స్య యాప్లో అప్లోడ్ చేయాలి.కృష్ణా,గోదావరి జీవనదులు,గొలుసు కట్టు చెరువులు ఉన్న ప్రాంతం మనది,చేపల ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఉత్పత్తితో పాటు మార్కెటింగ్ సదుపాయం పెంచాలి.ప్రతి నియోజకవర్గంలో ఫిష్ రిటైల్ అవుట్ లెట్ మార్కెట్ కోసం ప్రభుత్వ స్థలాలను కలెక్టర్లు కేటాయించాలి.మాంసం భుజించడంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్న తెలంగాణ చేపలను భుజిచడంలో వెనుకబడి ఉంది.చేపల భుజించడం వల్ల జరిగే ఆరోగ్యపరమైన లాభాలపై విస్తృత ప్రచార ప్రణాళికలు రూపొందించండి.వివిధ రాష్ట్రాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో చేపల వంటకం అమలును పరిశీలిస్తున్నాము తెలంగాణ రాష్ట్రంలో అమలుపై సిఎం రేవంత్ రెడ్డితో చర్చ చేస్తామని తెలిపారు.చేప పిల్లల పంపిణీపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, ప్రతి వారం ఇందుకు సంబంధించిన పురోగతిని రాష్ట్ర స్థాయి అధికారులకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.ఈ సమావేశంలో పాల్గొన్న మత్స్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్,ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల,అడిషనల్ డెరైక్టర్ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## రైలు కార్యకలాపాల్లో మెరుగైన భద్రత కోసం స్పెషల్‌డ్రైవ్

### అధికారులతో సమీక్ష నిర్వహించిన ద.మ.రైల్వే జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

హైదరాబాద్ (తార్నాక), నవంబరు 3, ప్రభాతవార్త : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సోమవారం సికిందరాబాద్ రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, ప్రధాన విభాగాధిపతులతో కలిసి జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రతపై వివరణాత్మక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డివిజనల్ రైల్వే మేనేజర్లు (డి.ఆర్.ఎంలు) విడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సంజయ్‌కుమార్ శ్రీవాస్త భద్రతా సమీక్ష సందర్భంగా భద్రతా అవగాహనను మరింత పెంపొందించడానికి, రైలు కార్యకలాపాలను మెరుగుపరచడానికి నాన్‌ఇంటం లాకింగ్ గేట్ల వద్ద ప్రత్యేక భద్రతా డ్రైవ్ నిర్వహించాలని డివిజనల్లను ఆదేశించారు. అంతే కాకుండా, శీతాకాలంలో రైలు కార్యకలాపాలు సజావుగా జరిగేలా శీతాకాల సంసిద్ధత డ్రైవ్‌ను చేపట్టాలని జనరల్ మేనేజర్ అధికారులకు సూచించారు. జోన్ అంతటా పొగమంచు భద్రతా పరికరాల నిల్వల స్థితిని కూడా ఆయన సమీక్షించి పొగమంచు పరిస్థితుల దృష్ట్యా అవసరమైన పరికరాలను తగినంత నిల్వలను ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. జనరల్ మేనేజర్ ఇంజనీరింగ్, మెకానికల్, సిగ్నల్ అండ్ టెలి కమ్యూనికేషన్ ఎలక్ట్రికల్ వంటి వివిధ విభాగాలకు సంబంధించిన భద్రతా కార్యాచరణ ప్రణాళికలను సమీక్షించారు. గూడ్స్ షెడ్‌లలో సీసీటీవీల ఏర్పాటు స్థితిని ఆయన సమీక్షించారు. పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. సిబ్బంది పనివేళల గురించి కూడా చర్చిస్తూ విశ్రాంతి సమయాన్ని మరింత మెరుగు పరచడానికి కృషి చేయాలని జీఎం అధికారులను ఆదేశించారు.



అధికారులకు సూచనలు చేస్తున్న జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

## ధర్మపురి ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తాం

### గోదావరి పుష్కరాలకు సకల ఏర్పాట్లు

### ఆలయ మాస్టర్‌ప్లాన్‌ను సమీక్షించిన మంత్రులు కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 3:జగిత్యాల జిల్లాకు చెందిన ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గోదావరి పుష్కరాలకు కూడా సంపూర్ణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సోమవారం ధర్మపురి ఆలయ మాస్టర్ ప్లాన్ పై రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్,దేవాదాయ శాఖ డైరెక్టర్ హరీష్, శాఖ ఉన్నతాధికారులు, ఆలయ ఈవో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ... వందలాది సంవత్సరాలు చరిత్ర గల ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులు ఆగమశాస్త్రం, వేద పండితులు, స్థానికుల, భక్తులు మనోభావాలకు అనుగుణంగా పునర్నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధర్మపురిలో కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి స్వయంభు మూర్తి, ఋషులు, దేవతలు సంచరించిన పవిత్ర ప్రాంతం, ఈ అంశం దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. దాంతోపాటు, 2027 జూలై లో రానున్న గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభమేళాగా ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయడానికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ధర్మపురిలోని గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని మంత్రి ఆదేశించారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా తగు సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. మాస్టర్ ప్లాన్‌కు అవసరమైన స్థల సేకరణ వివరాలు మంత్రి, అధికారులను అడిగి సంపూర్ణంగా తెలుసుకున్నారు. స్థల పురాణం ఆధారంగా చర్యలు తీసుకోవాలన్నారు. మొత్తం రూ. 50 కోట్లతో చేపట్టే నిర్మాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా చూడాలని చెప్పారు. మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... ఈ టెంపుల్ కోసం అయ్యే స్థల సేకరణకి సంబంధించిన అంశాల్లో తాను ప్రత్యేకంగా చొరవ తీసుకుంటానని హామీనిచ్చారు. అందరి సహకారంతో గోదావరి పుష్కరాలు కూడా విజయవంతంగా చేస్తామని హామీనిస్తున్నట్టు వెల్లడించారు. మాస్టర్ ప్లాన్ లో భాగంగా ధర్మపురి టెంపుల్ లో అభివృద్ధి కార్యక్రమాలు.... ప్రధాన దేవాలయ విస్తరణ, వైకుంఠ ద్వార నిర్మాణం, క్యూలైన్ కాంప్లెక్స్, టిన్ షెడ్స్,. వ్రత మండప నిర్మాణం, కాలక్షేప మండప నిర్మాణం, ప్రసాదం కౌంటర్ల నిర్మాణం, నిత్య కళ్యాణ మండప నిర్మాణం, మహా ప్రాకార నిర్మాణ, రథశాల నిర్మాణ, జల ప్రసాదం డ్రింకింగ్ వాటర్ వసతుల ఏర్పాట్లుపై చర్చించారు.గోదావరి తీరంలో చేపట్టే నిర్మాణాలు... పెద్ద డార్మిటరీ హాల్స్ నిర్మాణం, స్త్రీలు బట్టలు మార్చుకొనుటకు డ్రెస్ ఛేంజింగ్ రూమ్స్ నిర్మాణం, సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం, షవర్స్ నిర్మాణం, జలప్రసాదం వసతి, మండప నిర్మాణం, నిత్యాన్నదాన భవనం నిర్మాణం పై చర్చించారు.

## నన్ను తెలంగాణ జడ్జిని చేయండి..

### లాయర్ పిటిషన్‌కు సుప్రీం మందలింపు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 3: తనను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా నియమించాలని లాయర్ పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇటువంటి అప్పీళ్లతో న్యాయవ్యవస్థను గేలిచేయవద్దని పిటిషనర్‌ను తీవ్రంగా మందలించింది. తనకు హైకోర్టు జడ్జిగా పదోన్నతి కల్పించాలని జివి శ్రవణ్‌కుమార్ అనే న్యాయవాది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు తగు కార్యనిర్వాహక ఆదేశాలు వెలువరించాలని కూడా వేడుకున్నారు. ఇది చెత్తబుట్ట పాలయ్యే పిటిషన్‌గా ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయ ప్రక్రియతో తమషాలకు దిగుతున్నారా? ఇదేం పద్ధతి అంటూ న్యాయమూర్తులు కె వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఒక పనిచేస్తాం, జడ్జిగా మీ ఎంపిక గురించి సీనియర్ జడ్జిటతో త్రిసభ్య కొలిజీయంను ఏర్పాటు చేస్తాం, వారు ఈ విషయం పరిశీలిస్తారని జస్టిస్ గవాయ్ చురకలు పెట్టారు.

## టిప్పర్ అతివేగమే కారణమని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడి: ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి

హైదరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త: సోమవారం ఉదయం చేవెళ్ల సమీపంలోని ఇందిరా రెడ్డి నగర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై టిజిఎస్‌ఆర్‌టిసి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఈ సంఘటన దురదృష్టకరమైనదిగా భావిస్తూ, ప్రాణాలు కోల్పోయిన 19 మందికి తమ సంతాపం తెలియజేస్తూ, క్షతగాత్రులైన ప్రయాణికులు త్వరగా కోలుకోవాలని వారి కుటుంబ సభ్యలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. టిప్పర్ అతి వేగంగా ఢీ కొట్టడంతో బస్సు ముందు భాగంతో పాటు ఎడమవైపు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఢీ కొట్టిన టిప్పర్, బస్సు వైపు ఒరిగి పోయి అందులోని కంకర ప్రయాణికులపై పడటంతో ఊపిరాడక ఎక్కువ మంది ప్రయాణికులతో పాటు బస్సు డ్రైవర్ దస్తగిరి చనిపోయారు. ఘటన జరిగిన వెంటనే ఆర్‌టిసి యాజమాన్యం స్పందించి, సమీపంలోని డిపో మేనేజర్లను అప్రమత్తం చేయడం జరిగింది.

## ప్రమాదం నన్ను తీవ్రంగా కలిచివేసింది: మీనాక్షి నటరాజన్

హైదరాబాద్, నవంబరు 3, ప్రభాతవార్త:రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని ఎఐసిసి కార్యదర్శి తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు.ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబానికి ఆమె తన ప్రగాఢ సంతాపం తెలపారు. గాయపడిన వారికి సానుభూతిని వ్యక్తంచేశారు. త్వరగా వారు కోలుకోవాలని ఆమె ఆకాంక్షను వ్యక్తంచేశారు. ప్రమాదంపై టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడ్డవారికి తగిన వైద్య చికిత్సలు చేయాలని సూచించారు. అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని మహేష్ కుమార్ గౌడ్ కోరారు. చేవెళ్ల బస్ ప్రమాదం దుర్ఘటనపై రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు తో, వికారాబాద్ డిసిసి అధ్యక్షులు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడినారు. ప్రమాద తీవ్రత చాలా ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంఘటన స్థలానికి వెళ్లి సహాయక చర్యలలో పాల్గొని అధికారులకు సహకరించాలని మహేష్‌కుమార్ సూచించారు.

## బుల్డోజర్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలి

### పథకాలు ఎవరి సొమ్మని బంద్ చేస్తారు

### బోరబండ ప్రచార సభలో కెటిఆర్

హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 3, ప్రభాతవార్త: కారు, బుల్డోజరు మధ్య జూబ్లీహిల్స్ ఎన్నికలు జరుగుతున్నాయని, ప్రజలు విజ్ఞతతో ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కోరారు. బోరబండ డివిజన్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన రోడ్ షోలో ఆయన అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఎవరిని వదిలిపెట్టలేదని అన్నారు. కాంగ్రెస్ హామిలిచ్చి రెండేళ్లు గడిచిపోయిందని, ఇంకా ఏది అమలుకాలేదన్నారు. రేవంత్‌రెడ్డికి ఒక్క ఛాన్స్ ఇస్తేనే 160 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. పేదల ఇళ్లను కూలగొట్టారని, హైదరాబాద్‌ను నాశనం చేశారని అన్నారు. పేదల ఇళ్లపైకి బుల్డోజర్లు రావొద్దంటే బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు. బుల్డోజరు ప్రభుత్వానికి ఈ ఎన్నికల ద్వారా ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. హైడ్రా బాధితుల బాధను చూస్తుంటే ప్రతి ఒక్కరి కళ్లలో నీళ్ల వస్తున్నాయన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వ కూల్చివేస్తుందన్నారు. హైడ్రా అనే రాక్షసి మాయం కావాలంటే ఈ నెల 11న కారు గుర్తుకు ఓటేయాలని అన్నారు. ప్రతి పేదవాడికి అండగా నిలబడుతామని, బుల్డోజర్లకు అడ్డంగా పడుకుంటామన్నారు. కాంగ్రెస్ వాళ్లు భయపెడితే, తాము వచ్చి వాళ్ల సంగతి తేలుస్తామన్నారు. కంటోన్మెంట్‌లో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేరలేదని, ఒక్క పైసా అక్కడ ఇవ్వలేదన్నారు. అక్కడ ఇవ్వని నిధులు, అభివృద్ధి జూబ్లీహిల్స్‌లో ఎలా సాధ్యమని ప్రశ్నించారు. నిరుద్యోగులను లాఠీలతో కొట్టారన్నారు. ఆడబిడ్డతతో పెట్టుకున్న వాళ్ల ఎవరూ బాగుపడలేదని, గోపీనాథ్ గుర్తుకు వచ్చి సునీతమ్మ ఏడిస్తే కాంగ్రెస్ మంత్రులు అవమానించేలా మాట్లాడారని అన్నారు. కన్నీళ్లను కూడా కాంగ్రెస్ నేతలు రాజకీయం చేసే దౌర్భాగ్యులన్నారు. కేసీఆర్ ఉన్నప్పటి తెలంగాణాకు ఇప్పుడున్న తెలంగాణ ఎలా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. సర్దార్ కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బం దులకు గురిచేసిందని, వాళ్ల పెట్టిన హింసకు సమాధానం చెప్పాలన్నారు. హిట్లర్ వంటి నియంతలకే పరాభావం తప్పలేదని రేవంత్‌రెడ్డి ఒక లెక్కా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే పథకాలను రద్దు చేస్తామని బెదిరిస్తున్నారని, ఎవరి సొమ్మని పథకాలను రద్దు చేస్తారన్నారు. 4 కోట్ల మంతెలంగాణ ప్రజల తరుపున 4 లక్షల మంది జూబ్లీహిల్స్ ఓటర్లు తీర్పు చెప్పబోతున్నారని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా రేవంత రెడ్డి ఇచ్చిన హామీలను, హైడ్రా బాధితుల కన్నీళ్లను డిజీ మీడియా ద్వారా ఇక్కడ తెరలపై ప్రదర్శించారు.



# నీలకంఠాపురంలో ఎల్వి.ప్రసాద్ నేత్ర సంరక్షణా కేంద్రం

మడకశిర, నవంబరు 3 ప్రభాతవార్త: మారుమూల ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలోని నీలకంఠా పురంలో సిడబ్ల్యూసి మెంబర్ నీలకంఠాపురం డాక్టర్ రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎల్వి.ప్రసాద్ నేత్ర సంరక్షణా కేంద్రం అతిరథుల మధ్య ఘనంగా ప్రారంభమైంది. సిడబ్ల్యూసి మెంబర్ మాజీ మంత్రి మాజీ పిసిసి అధ్యక్షుడు డాక్టర్ రఘువీరారెడ్డి ఒక్క ఆలోచనతో కంటి చూపుతో సతమతమవుతున్న ఐదు లక్షల మందికి ఆశ్రయం కల్పించేందుకు ఎల్వి.ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ ఆసుపత్రి సహకారాన్ని కోరి పట్టుదలతో వారి కటుంబ సభ్యుల సహకారంతో ఎల్వి. ప్రసాద్ వైద్య విజ్ఞాన సంస్థ నీలకంఠాపురం డాక్టర్ శాంత మరియు డాక్టర్ జయరాంల నేత్ర వైద్య కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎల్వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి ఛైర్మన్ జి.ఎన్ రావ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎల్వి.ప్రసాద్ ఆధ్వర్యంలో 24 ఆసుపత్రులను ప్రారంభించి వైద్య సేవలు అందిస్తూ 25వ కంటి ఆసుపత్రిని నీలకంఠాపురంలో నేడు ప్రారంభించామని అన్నారు. మాజీ ఎంపి కేవిపి. రామచంద్ర రావ్ మాట్లాడుతూ రఘువీరారెడ్డి గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలను ప్రక్కన పెట్టి దేవాలయాల నిర్మాణాలలో ఉండిపోయారని అన్నారు. ఇప్పుడు ఎల్వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి ఏర్పాటు విషయంలో రఘువీరారెడ్డి కృషి పట్టుదల కార్యదీక్షతో వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కంటి ఆసుపత్రి ఏర్పాటు చేశారని ఇది ప్రపంచ ఖ్యాతి గాంచిన ఆసుపత్రి అని అన్నారు. రఘువీరారెడ్డి మాట్లాడుతూ నీలకంఠాపురంలో ఓ దేవాలయం వెలసిందని, మనము ఏదేవాలయానికైనా వెళ్ళితే కళ్లు మూసుకొని దేవున్ని ప్రార్థిస్తాము దేవాలయంలో కళ్లు మూసుకొంటాము కానీ ఈ దేవాలయం మూసుకొన్న కళ్లను తెరిపించే దేవాలయం ఇది అన్నారు. దేవాలయం నిర్మాణ సమయంలో దేవాలయం ఒక్కటే కాదు వైద్యం మరియు విద్య కూడా అవసరమని కుటుంబ సభ్యులు తెలియజేయడంతో అప్పటితో ఆసుపత్రిని ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో మొదలు చేసి ఈవిషయాన్ని కేవిపి.రామచంద్రరావుకు తెలియజేసి అతని ద్వారా ఎల్వి.ప్రసాద్ వారి సహకారంతో అత్యాధునిక వైద్య పరికరాలతో ప్రపంచ స్థాయి సమగ్ర కంటి ఆరోగ్య వైద్య సేవల కోసం నీలకంఠాపురంలో నేడు ప్రారంభించామని అన్నారు. మాజీ ఎంపి అనంతవెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపి తలారి రంగయ్య, మాజీ ఎంపి. మాజీ ఎంపి అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ పిసిసి గిడుగు రుద్రరాజు, సిడబ్ల్యూసి మెంబర్ కొప్పులరాజు, మాజీ కేంద్ర మంత్రి జేడి.శీలం, మాజీ ఎమ్మెల్యేలు నరసేగౌడు, వైటి.ప్రభాకర్‌రెడ్డి, కె.సుధాకర్, డాక్టర్ జి.తిప్పేస్వామి, కె.ఈరణ్ణలు మాట్లాడుతూ నీలకంఠాపురం లో ఎల్వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రజలందరికి ఎంతో ఉపయోగపడుతుందని వారు అన్నారు. ఇది పేద ప్రజల పాలిట ఒక గొప్ప వరంగా అభివర్ణించారు. రఘువీరారెడ్డి ఎంతో ముందు చూపుతో కంటి ఆసుపత్రి నిర్మాణం చేశారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్విపిఈఐ ఛైర్మన్ జిఎన్.రావు, వైస్ ఛైర్మన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి, డాక్టర్ తార ప్రసాద్‌దాస్. డాక్టర్ రోహిత్‌ఖన్నా, హోట్టేబెట్ట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గోవిందరాజు, పావగడ జపానంద స్వామి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దమయంతి, తుంకూర్ రాజన్న, మహేష్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గౌతమ్, దాదాగాంధీ, అనంతపురం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, హిందూపురం కాంగ్రెస్ నాయకుడు కేటీ శ్రీధర్, మాజీమంత్రి రఘువీరారెడ్డి సతీమణి సునీత రఘువీర్, కుమార్తె అమృత రఘువీర్, ఇతర కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఆసుపత్రి ప్రారంభోత్సవానికి రాజకీయ ప్రముఖులు హాజరు


నీలకంఠాపురంలో ఎల్విప్రసాద్ నేత్ర సంరక్షణాకేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

# తిరుమల సమాచారం



## రేపు కార్తీక పౌర్ణమిగరుడసేవ

తిరుమల,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి: కొండలరాయుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పురస్కరించుకుని 5వతేదీ బుధవారం కార్తీక పౌర్ణమి గరుడసేవ జరగనుంది. ప్రతినెలా పౌర్ణమికి తిరుమలలోఅత్యంత వేడుకగా గరుడసేవ నిర్వహించడం ఆనవాయితీ. బుధవారం సాయంత్రం మలయప్పస్వామిని సర్వాలంకారభూషితుడ్నిచేసి అర్చకులు వాహనమండపం వద్దకు వేంచేపుచేస్తారు. అక్కడ గరుడవాహనంపై అధిరోహింపజేసి ఆలయ మాఢవీధుల్లో రాత్రి 7గంటలకు మలయప్పస్వామిని ఊరేగిస్తారు. బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకు అత్యంత విశిష్టత ఉంది. 108 వైష్ణవ దివ్యదేశాల్లో గరుడసేవను వైఖానస ఆగమోక్తంగా నిర్వహింపజేస్తారు.



## శ్రీవారి ఆశీస్సులతో లోకం సుభిక్షం

### వనమామలి జీయర్‌స్వామి

తిరుమల,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో మానవాళి సుభిక్షంగా ఉండాలని,అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని శ్రీమద్ పరమహమ్‌సేథాయంతి మధురకవి వానమామలి జీయర్‌స్వామి ఆకాంక్షించారు. పవిత్రమైన కార్తీక సోమవారం ఉదయం శిష్యులతో కలసి ఆలయం వద్దకు విచ్చేసిన స్వామివారికి ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా మహాద్వారం వద్ద స్వాగతం పలికారు. ఆలయంలోపలకు చేరుకుని తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు.ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకులమండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## శ్రీవారి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలి

### పలువురు న్యాయమూర్తులు

తిరుమల,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని దేవుని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. కార్తీకమాసం రెండవ సోమవారం ఉదయంనైవేద్యాల విరామసమయంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టున్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు కుటుంబసభ్యులతో కలసి వేర్వేరుగా ఉదయం ఆలయంలోనికి చేరుకుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి దర్శనంతో మనసు సంతోషం



తిరుమల,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు ఆనందంగా ఉంటుందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ సిఎస్,మాజీ ఇఒ ఎల్వి సుబ్రమణ్యం ఆకాంక్షించారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఎల్వి సుబ్రమణ్యం దంపతులు ఆలయంలోనికి చేరుకున్నారు. వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి:కార్తీకసోమవారం ఉదయం ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం మనస్సు ఆనందంగా ఉందని పలువురు ప్రముఖులు తెలిపారు. ఉదయం విఐపి బ్రేక్‌లో బాలీఉడ్‌నటుడు ,దర్శకుడు తుషార్‌కపూర్, సినీ దర్శకుడు ఎఎం రత్నం వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల బాలీఉడ్‌నటుడితో పలువురు పోటోలు దిగారు.

## వెంకన్న దర్శనంలో శ్రీలంక నెట్‌బాల్ క్రీడాకారిణి తర్జని



తిరుమల,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి: శ్రీలంక జాతీయ నెట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ తర్జని శివలింగం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమె ప్రపంచంలోనే అత్యంత పొడవైన నెట్‌బాల్ క్రీడాకారిణిగా పేరుంది.సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలసి తిరుమలకు వచ్చిన ఆమె శ్రీవారిని దర్శించు కున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

## బ్యాటరీ ద్విచక్రవాహనాలు విరాళం



తిరుమల,నవంబరు 3ప్రభాతవార్త ప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామిపై భక్తివిశ్వాసాలతో ఓ దాత భక్తుడు బ్యాటరీతో నడిచే మూడు ద్విచక్ర వాహనాలను విరాళంగా అందించారు. అనంతపురం జిల్లా ధర్మవరంకు చెందిన వేణుమోటార్స్ అధినేత డి.వేణుగోపాల్ 1.53 లక్షల రూపాయలు విలువ చేసే ఈ మూడు బ్యాటరీ వాహ నాలను సోమవారం సాయంత్రం టిటిడి ఆలయ ఎఇఒ మోహన్‌రాజు,రవాణా విభాగం ఇన్‌ఛార్జి హరిబాబుకు దాత అందజేశాడు.

## మారికవలసలోని ట్రైబల్ హాస్టల్ శిక్షణా కేంద్రాన్ని పునః ప్రారంభించండి: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి: వెనుకబడిన గిరిజన ప్రాంతాల విద్యార్థుల ఉన్నత విద్యావకాశాల అభివృద్ధి కోసం మారికవలసలోని ట్రైబల్ హాస్టల్ శిక్షణా కేంద్రాన్ని పున:ప్రారంభించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు నిధులు కేటాయించాలన్నారు. ఈమేరకు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ ఆధ్వర్యంలో 2017లో స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ పేరుతో విశాఖ ఏజెన్సీలో ఉన్న ఐదు రెసిడెన్షియల్ జూనియల్ కాలేజీలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఉత్తమంగా రాణించిన వారిని ఎంపిక చేసి ఉత్తమ శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. దీనికి ప్రత్యేకంగా ఉమ్మడి విశాఖపట్నం మధురవాడ ప్రాంతంలోని మారికవలస రెసిడెన్షియల్ కాలేజీలో శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం సుమారు 80 నుండి 100 మంది విద్యార్థులకు ప్రత్యేక సిబ్బంది ద్వారా శిక్షణ ఇస్తున్నారని వివరించారు. 2017 నుండి ఇప్పటి వరకూ 356 మంది విద్యార్థులు శిక్షణ పొందారని, వీరంతా ఐఐటి, ఎన్ఐటి, నీట్, లాసెట్ వంటి ఉన్నత స్థాయి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి వాటిల్లో ప్రవేశాలు పొందారని పేర్కొన్నారు.

# జీరో యాక్సిడెంట్‌జోన్‌గా రాష్ట్రం

## కఠిన చర్యలతోనే ప్రమాదాల నివారణ

### తిరుపతిలో రాష్ట్ర మంత్రి మండిపల్లి



తిరుపతి రవాణ,నవంబరు 3ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌ను జీరో యాక్సిడెంట్ జోన్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్రరవాణాశాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. నిబంధనలు పాటించని, సామర్థ్యం లేని బస్సులను సీజ్ చేస్తున్నామని, ప్రతి విషయంలో చొరవచూపి కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మానవతప్పిదాలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్లీపర్ బస్సులు, దూరప్రాంతాలకు ప్రయాణించే బస్సులకు కొత్త నిబంధనలు,అలారం సిస్టమ్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో రోడ్డుప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. తిరుపతి జిల్లాలో అలిపిరి డిపో ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ఆర్టీసి డిస్పెన్సరీని రాష్ట్రమంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఆర్టీసి ఎండి ద్వారకతిరుమలరావు, తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాసులు, ఆర్టీసి జోనల్ ఛైర్మన్ కొనకళ్ల సత్యనారాయణతో కలసి సోమవారం డిస్పెన్సరీని ప్రారంభించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అందుకు డ్రైవర్ల నైపుణ్యం, మెలకువలు అవసరమన్నారు. వైసిపి నేత జోగిరమేశ్ అరెస్ట్ కక్షపూరితం కాదన్నారు. మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి చట్టం తనపనితాను చేసుకుంటూ పోతుందన్నారు. ఆర్టీసి ఉద్యోగుల కోసం తిరుపతిలో 1.92కోట్ల రూపాయలతో అలిపిరి డిపో సమీపంలో 0.12ఎకరాల విస్తీర్ణంలో డిస్పెన్సరీ, విశ్రాంతి గదులు ఏర్పాటుచేశామన్నారు. వృద్ధులు, రోగుల సౌకర్యార్థం మందులదుకాణం, ల్యాబ్, ఓపి ,వైద్యుల గదులుప్రత్యేకంగా లిఫ్ట్ సౌకర్యం కల్పించారన్నారు. తిరుపతి జిల్లాలోని 11 డిపోలు కలిపి ఉమ్మడిచిత్తూరుజిల్లాలోని 6వేల ఆర్టీసి కుటుంబాలు లబ్ధిపొందుతారన్నారు. రోజుకు సుమారు వందమందికి వైద్యసేవలు,30 రకాల వైద్యపరీక్షలు నెలకు 3లక్షల విలువైన ఉచిత మందులు పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి జోనల్ ఇడిలు సురేశ్‌రెడ్డి, చంద్రశేఖర్, రవివర్మ, చెంగల్‌రెడ్డి, తిరుపతి జిల్లా రవాణాఅధికారి విశ్వనాధ్,అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## మీర్జాగూడ దగ్గర బస్సు ప్రమాదంపై సిఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి

విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని మీర్జాగూడ దగ్గర బస్సు ప్రమాదంపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ప్రయాణికుల మృతి తనను తీవ్రంగా కలచివేసిందని, మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు సిఎం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబు కోరారు. అయితే, చేవెళ్ల రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య 24కి చేరుకుంది. ఈ ప్రమాదంలో 40 మంది గాయపడగా వారిలో సుమారు 20 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది.

## పవన్ ప్రగాఢసానుభూతి

విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:తెలంగాణ రాష్ట్రంలోని చేవెళ్ల వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించారు. ఆర్టీసీ బస్సును కంకర లారీ ఢీకొనడంతో 17 మంది మృతి చెందారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి లోనైనట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢసానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## కలిచివేసిందన్న మాజీ సిఎం జగన్

విజయవాడ,నవంబరు3,ప్రభాతవార్తప్రతినిధి: తెలంగాణలోని చేవెళ్ళ దగ్గర జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పలువురు మృత్యువాత పడటంపై మాజీ సిఎంవైఎస్ జగన్ తీవ్రదిగ్రాంతిని వ్యక్తం చేశారు. ఆర్టీసి బస్సును కంకర లారీఢీకొట్టడంతో పలువురుమృతిచెందడం తీవ్రంగా కలిచివేసింది.

## ఇన్‌పుట్ సబ్సిడీ ఎకరాకు రూ.25వేలు చెల్లించాలి: వడ్డే శోభనాద్రీశ్వరరావు



విజయవాడ,నవంబరు 3,ప్రభాత వార ప్రతినిధి: మొంథా తుపాన్ రైతాంగాన్ని తీవ్రంగా నష్టపరిచిందని, ప్రభుత్వం తక్షణమే రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకోవాలని ఎపి సంయుక్త కిసాన్‌మోర్చా (ఎపికెఎస్ఎం) కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. విజయవాడ లో పాత్రికేయ సమావేశ ప్రాంగణంలో రైతు, కార్మిక సంఘాల రాష్ట్ర నాయకుల సమావేశం జరిగింది. సమావేశా నంతరం ఆయన మాట్లాడుతూ పంటల నష్టాన్ని సక్రమంగా ఎన్యుమరేషన్ చేయించాలని, రైతులను ఆదుకునేందుకు ఇన్‌పుట్ సబ్సిడీ ఆహార పంటలకు ఎకరాకు రూ.25వేలు, వాణిజ్య పంటలకు రూ.50వేలు, ఉద్యానపంటలకు రూ.75వేలు చొప్పున రైతు, కౌలు రైతులకు పంటబీమా వచ్చేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు సుధీర్ మాట్లాడుతూ విశాఖపట్టణం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరించేందుకు కుట్రలుసాగుతున్నాయన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటు వ్యక్తులకు కారుచౌకగా, కేటాయిస్తున్నారని ఆయన విమర్శించారు. ఎపిరైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్‌మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ విధానాలు అమలుపరచడంలో ముందువైపు నిలబడుతుందన్నారు. కాంగ్రెస్ కిసాన్‌సెల్ ఛైర్మన్ కామన ప్రభాకరరావు మాట్లాడుతూ నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని,13 గంటల పనివిధానం జీఓని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కౌలురైతులు, చేతివృత్తిదారుల రుణాలు మాఫీ చేయాలని కోరారు. కిసాన్‌సభ రాష్ట్రనాయకులు డి.హరినాథ్ మాట్లాడుతూ పనికి ఆహార పథకాన్ని 200రోజులకు వర్తింపజేయాలని రో.ఉ వారీ, వేతనంరూ.700లకు పెంచాలన్నారు. పత్తి,,ధాన్యం,శనగ.మొక్కజన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. సీనియర రైతుసంఘంనాయకులు చుండూరు రంగారావు మాట్లాడుతూ ఈనెల26 అన్నిజిల్లాకేంద్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక విధానాలను నిరశిస్తూ నిరసన, ప్రదర్శనలు చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందించాలని కోరారు. మీడియాసమావేశంలో నల్లమడరైతుసంఘంరాష్ట్ర నాయకులు డాక్టర్ రాజమోహన్, ఇఫ్టూ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్‌బాబు, రైతుకూలీ సంఘం రాష్ట్రకార్యదర్శి కెఎన్‌రాజు, పలుసంఘాల నేతలు పాల్గన్నారు.


గౌరవ వేతనాలు చెల్లించాలంటూ పంచాయతీరాజ్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ

# గౌరవ వేతనాలు చెల్లించాలి

### పంచాయతీరాజ్ భవన్ ఎదుట వైఎస్సార్‌సీపీ పంచాయిత్ రాజ్ విభాగం ధర్నా

విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలోని స్థానిక ప్రజా ప్రతినిధులకు గౌరవ వేతనాలు ఇవ్వద్దని చట్టం ఏమైనా చెప్పిందా? అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుని, మంత్రి లోకేశ్‌లను, రాష్ట్ర ప్రభుత్వాన్ని వైఎస్సార్‌సీపీ పంచాయిత్ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రా రెడ్డి సూటిగా ప్రశ్నించారు. సోమవారం తాడేపల్లిలోని పంచాయతీ రాజ్ భవన్ ఎదుట వైఎస్సార్‌సీపీ పంచాయిత్ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం పంచాయతీరాజ్ ఉప సంచాలకులు సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులంతా వైస్సార్సీపీ పార్టీ ద్వారా ఎన్నికైనందుకేనా ఈ వివక్ష? అని ప్రశ్నించారు. చంద్రబాబు ఈ డబ్బు మీ అబ్బా సొమ్మా?.. పవన్ కళ్యాణ్ మీ తాత సొమ్మా? ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ప్రతి నెల 3వ తేదీ జీతాలు తీసుకుంటున్నా కదా?. మీలాగానే ప్రజల్చే ఎన్నుకోబడిన జడ్పీ చైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపీపీ, ఎంపీటీసీలు వారు ప్రజాప్రతినిధులు కాదా?. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై దాడులపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ వైఖరి ఏమిటో తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి తన ఎన్నికలు హామిలో స్థానిక ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు పెంచుతామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిందని, వచ్చిన నాటి నుంచి నేటికీ కూడా ఒక్క నెల గౌరవవేతనం కూడా ఇవ్వలేదు. జడ్పీ ఛైర్మన్ లకు ఎం.పి.పి లకు, ఎం.పీ.టీ.సీ లకు వేతనాలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముళ్లపూడి గాంధీ, కృష్ణా, గుంటూరు జిల్లాల పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులు దాసరి రాజు, వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు ఫిరోజ్, సహాయ కార్యదర్శి ఆదాం, సంఘం నాయకులు శ్రీనివాసరావు, రమేష్, సాంబశివరావు, ఆర్ కల్యాణి, జోజీ, శివప్రసాద్, బండారు ఆంజనేయులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం అనే పదానికే అర్థం మారిపోయింది

### వైసీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి

విజయవాడ,నవంబరు 3,ప్రభాత వార్తప్రతినిధి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం అనే పదానికే అర్థం మారిపోయిందని వైసీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. ప్రభుత్వమే వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతోందన్నారు. ప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి కానీ, కూటమి ప్రభుత్వం మాత్రం వ్యవస్థలను గాలికి వదిలేసి ప్రత్యర్థులపై కక్ష సాధింపులకు దిగుతోందని ఆరోపించారు. మాజీ మంత్రి జోగి రమేశ్ అరెస్ట్‌తో వీరి వికృత చేష్టలు పరాకాష్ఠకు చేరాయని ఆయన విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసీపీ నేతలు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలు పెరిగిపోయాయని సజ్జల ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లోకేశ్ రెడ్ బుక్ పాలన నడుస్తోందని, ఆయన నేతృత్వంలో విధ్వంసకర పాలన సాగిస్తున్నారని సజ్జల విమర్శించారు.

## స్పెయిన్‌లో జరిగే స్మార్ట్ సిటీ ఎక్స్‌పో వరల్డ్ కాంగ్రెస్‌కు సురేష్ కుమార్



విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి: స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఈ నెల 4 నుంచి రెండు రోజుల పాటు జరగనున్న 14వ స్మార్ట్ సిటీ ఎక్స్‌పో వరల్డ్ కాంగ్రెస్‌లో రాష్ట్రానికి చెందిన 4 స్మార్ట్ సిటీల అభివృద్ధిలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను ప్రదర్శించనున్నట్లు పట్టణాభివృద్ధి శాఖ వెల్లడించింది. ఈ ఎక్స్‌పోలో రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్ కుమార్ దేశం తరపున విశిష్ట వక్తగా ప్రసంగించనున్నారని ఆదివారంఒక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో పట్టణాభివృద్ధికి ఎఐ సాంకేతికత వినియోగంపై చర్చించనున్నట్లు తెలిపింది. గ్రేటర్ విశాఖ,తిరుపతి మున్సిపల్ కమిషనర్లతో కూడిన ముగ్గురు సభ్యుల అధికారిక బృందానికి సురేష్ కుమార్ నేతృత్వం వహిస్తారని వెల్లడించింది.స్మార్, సస్టైనబుల్ సిటీల అభివృద్ధికి దోహదపడే ఈఎక్స్‌పోకు 130 దేశాల నుంచి 850 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొంది.

## ఫేస్‌బుక్‌లో పరిచయంతో రూ.17.99లక్షలు దోపిడీ

తిరుపతి,నవంబరు 3ప్రభాతవార్తప్రతినిధి: పేస్‌బుక్‌లో ప్రియ అనే పేరుతో పరిచయం అయిన వ్యక్తి నకిలీ ఉద్యోగ ఆఫర్‌లతో తిరుపతినగరంలోని ఓ వ్యక్తిని సైబర్‌మోసగాళ్ళుభారీ మోసం చేశారు. ఏకంగా 17.99లక్షలు రూపాయలు దోచుకున్నారు. ఈ సంఘటనపై బాధితుడు శ్రవణ్(47)సోమవారం అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. కొన్ని సామాజిక మాధ్యమాల్లో ఎస్కార్ట్‌సర్వీస్, ప్లేబాయ్‌జాబ్ పేరుతో నకిలీ ఉద్యోగ ఆఫర్‌లతో శ్రవణ్‌ను నమ్మించాడు. దీంతో మొదట రిజిస్ట్రేషన్‌ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్, రూమ్‌ఛార్జీలు,జిఎస్‌టి, ఎస్‌జిఎస్‌టి వంటివి చెబుతూ పలుసార్లు డబ్బులు తీసుకున్నారు. ఆ తరువాత ఫిర్యాదిదారుని ఫోటోలు, సంతకం తీసుకుని వాటిని ఎడిట్‌చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేసి బ్లాక్‌మెయిల్ చేయడంప్రారంభించారు. మోసగాళ్లబారిన 17,99,426 రూపాయలు వివిధ బ్యాంకు అకౌంటర్లు, యుపిఐ ఐడిలకు పంపారు. డబ్బులు తిరిగి అడిగినపుడు పంపుతాము అంటూ ఏమీ చెల్లించలేదు. దీంతో మోసగాళ్లబారిన పడిన అతను అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రజలు ఏ విధమైన డబ్బులు ఆన్‌లైన్‌ద్వారా తెలియని వ్యక్తులకు పంపవద్దని సిఐ రామకిశోర్ సూచించారు.

## పూర్తి ఆధారాలతోనే జోగి రమేశ్ అరెస్టు



విజయవాడ,నవంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి: కల్తీ మద్యం కేసులో వైసీపీ నేత జోగి రమేశ్‌ను పూర్తి ఆధారాలతోనే పోలీసులు అరెస్టు చేశారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలో భాగంగానే జోగి రమేశ్ నకిలీ మద్యం తయారు చేయించారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ కేసులో అన్ని ఆధారాలూ సేకరించిన తర్వాతే చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు.సోమవారం మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం మీడియాతో మాట్లాడుతూ... జోగి రమేశ్‌కు, మరో నిందితుడైన జనార్దనరావుకు మధ్య ఉన్న సంబంధం అందరికీ తెలిసిందేనని అన్నారు. జనార్దనరావు నేరుగా జోగి రమేశ్ ఇంటికి వెళ్లినట్లు నిర్ధారించే సీసీటీవీ ఫుటేజ్ కూడా తమ వద్ద ఉందని ఆయన వెల్లడించారు. బీసీల గురించి మాట్లాడే నైతిక అర్హత జోగి రమేశ్‌కు ఏమాత్రం లేదని విమర్శించారు. ఈ కేసు దర్యాప్తు విషయంలో ఎవరూ జోక్యం చేసుకోవద్దని మంత్రి హెచ్చరించారు. ఒకవేళ పోలీసు శాఖలో ఎవరైనా అధికారులు ఉద్దేశపూర్వకంగా జోగి రమేశ్‌కు అనుకూలంగా వ్యవహరించినా, కేసును తప్పుదోవ పట్టించాలని ప్రయత్నించినా వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ విషయాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుందని, దోషులు ఎవరైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు.

# మహిళా డాక్టర్లే మేలు !



వివిధ కారణాలతో అత్యవసర సేవల కోసం హాస్పిటల్‌లో చేరిన 7.5లక్షల మందికి డేటాను పరిశీలించారు అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు. ఫిజీషియన్లుగా మహిళలు ఉంటే. పేషెంట్లు చనిపోవడం, తిరిగి హాస్పిటల్‌లో చేరడం లాంటివాటికి ఆస్కారం తక్కువని పేర్కొన్నారు. ఇది మహిళ లూ, పురుషులూ ఇద్దరి విషయంలోనూ వాస్తవమని తేలింది. మహిళా పేషెంట్ల విషయంలో ఇంకాస్త మెరుగైన ఫలితాలున్నా యట. డాక్టర్ల జెండర్ ఎందుకు వైద్య నిపుణులు కచ్చితంగా చెప్పకపోయినా, మహిళా వైద్యులు మహిళా పేషెంట్లతో బాగా మాట్లాడి వివరాలు ఎక్కువగా తెలుసుకుంటారనీ, దీనివల్ల వ్యాధి నిర్ధారణ, మెరుగ్గా ఉంటాయనే అంచనాకు వచ్చారు. □

# అటుకుల జంతికలు



**కావాల్సినవి :** బియ్యప్పిండి, అటుకులు-కప్పు చొప్పున, కారం-టీస్పూన్, నువ్వులు-రెండు టీస్పూన్లు, వాము-టీస్పూన్, పసుపు-చిటికెడు, ఉప్పు-తగినంత.

**తయారీ :** అటుకుల్లో నీళ్ల పోసి కాసేపు నానబెట్టి నీటిని వంచేయాలి. తర్వాత వీటిని మెత్తని పేస్టులా చేయాలి. గిన్నెలో బియ్యప్పిండి, అటుకుల పేస్టు, మిగతా పదార్థాలన్నీ వేయాలి. కొద్దిగా నీళ్లు పోస్తూ ఈ మిశ్రమాన్ని ముద్దలా కలపాలి. జంతికల గొట్టంలో కాస్త నూనె రాసి, పిండి మిశ్రమాన్ని పెట్టాలి. కడాయిలో నూనె పోసి వేడి చేసి జంతికలు వేయాలి. వీటిని మధ్యస్థంగా ఉండే మంట మీద రెండు వైపులా వేయించి తీయాలి. కొన్ని జంతికలను సన్నగా, మరికొన్నింటిని కాస్త లావుగానూ వేసుకోవచ్చు. □

# బిల్వంతో శివపూజ

'త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రం త్రియాయుధం త్రిజన్మ పాపసంహారమ్ ఏకబిల్వం శివార్పణం" అంటూ మహా దేవుడిని పూజిస్తారు. ఈ త్రిదళ బిల్వ పత్రంలో కుడివైపు విష్ణువు, ఎడమవైపు బ్రహ్మ, మధ్యలో శివుడు కొలువై ఉంటారట. హిందూ ధర్మంలో

బిల్వ పత్రానికి అత్యంత విశిష్ట స్థానం ఉంది. దీనిని మారేడు దళం అని కూడా అంటారు. బిల్వపత్రం మహాదేవుడికి అత్యంత ప్రీతిపాత్రమైనది. సాధారణంగా ప్రతి శివాలయంలో బిల్వ వృక్షం ఉంటుంది. వ్యాస మహర్షి రచించిన శివమహాపురాణం ప్రకారం కార్తికమాసంలో బిల్వ దళంతో శివుని అర్చిస్తే మూడు జన్మల్లో చేసిన పాప దోషాలు తొలగిపోతాయని తెలుస్తోంది. యుద్ధంలో గెలవడానికి ఆయుధాలు ఎంత అవసరమో, పాపాలను తొలగించు కోవడానికి బిల్వ దళంతో శివారాధన చేయడం కూడా అంతే ముఖ్యం. పరమశివునికి ప్రీతికరమైన బిల్వ వృక్షానికి ఎంతో విశిష్టత ఉంది. సాధారణంగా అన్ని వృక్షాలు మొదట పువ్వు పూచి, తర్వాత అది కాయగా మరుతుంది. కానీ బిల్వ వృక్షం మాత్రం మొదట కాయగానే మనకు కనిపిస్తుంది. హిందూ సంప్రదాయం ప్రకారం కాడ లేని పుష్పాలు, కాయలు, ఆకులు మాత్రమే దేవుని పూజలో ఉపయోగిస్తాం. కానీ బిల్వ దళాలను మాత్రం కాడ తోనే బిల్వ వృక్షం నుంచి సేకరించి శివున్ని ఆరాధిస్తే శుభ ఫలితాలు అందు తాయని శివ పురాణం ద్వారా తెలుస్తోంది. కోటికన్యా మహాదానం ఏకబిల్వం శివార్పణమ్ సాధారణంగా పూలు కానీ, ఆకులు కానీ ఎండితే పూజకు పనికిరావు కానీ మారేడు దళం ఆకులు ఎండినా కూడా పూజకు ఉపయోగి స్తారు. కోటి ఏనుగుల దాన ఫలం, నూరు యజ్ఞాల ఫలం, కోటి కన్యాదానాల వల్ల కలిగే ఫలం ఒక్క బిల్వపత్రం శివపూజకు సమర్పించడం వల్ల లభిస్తుందని శాస్త్రవచనం.

# బఫే ల్యాడర్

కొన్నిసార్లు బంధు మిత్రులను పిలిచి విందు ఇస్తుంటాం. అలాంటప్పుడు. కూర, చారు, పచ్చడి, రసం.. ఇలా ఒక్కో పాత్రనూ విడివిడిగా తెచ్చే బదులు.. అన్నీ ఒక స్టాండ్‌లో ఉన్నాయనుకోండి. వీలుగా ఉంటుంది కదూ! ఈ ఆలోచనతో రూపొందించే 'బఫే ల్యాడర్'. ఇందులో అన్నం, కూరలే కాదండోయ్. పండ్లు, స్వీట్లు, డ్రైఫూట్స్ ఇలా వేటినైనా అమర్చవచ్చు. అదివ్వు, ఇదివ్వు.. అంటూ ఎవరూ, ఎవర్నీ అడగాల్సిన అవసరం లేకుండా.. ఈ స్టాండ్‌లో ఉంచామంటే ఎంచక్కా అందరూ కలిసి ఆనందంగా ఆరగించవచ్చు.

# మహిళా ప్రపంచ కప్ స్వప్నసాకారం



ఎత్తు తక్కువ, బక్క పలచని శరీరం. కానీ ఇంట్లో క్రీడల వాతావరణం, పొరుగింట్లో సచిన్ నివాసం... దానితో తన బలహీనతల గురించి కాకుండా క్రికెటర్ కావడం గురించి బలంగా ..ఆలోచించింది జెమీమా రోడ్రిగ్స్. తన అసాధారణ బ్యాటింగ్ టీమ్ ఇండియాను ప్రపంచ కప్ స్వప్నం నెరవేరింది. మీమా... తన కెరియర్, ఇష్టాలు, అలవాట్ల గురించి ఏం చెబుతుందంటే..

చిన్నప్పుడు క్రికెట్‌తో పాటు బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, హాకీ ఆడేదాన్ని. 11 ఏళ్లకే హాకీలో మహారాష్ట్ర అండర్17కి ఎంపికయ్యా. క్రికెట్‌లో వెస్టజోన్ అండర్ 17కి ఆడాను. ఏదో ఒకటి వక్త్రామే అన్నప్పుడు... క్రికెట్‌లో ఒక అడుగు ముందున్నానని హాకీని వదిలేశా. అది కష్టమైన నిర్ణయమే. భిన్న క్రీడల నేపథ్యం నన్ను శారీరకంగా, మానసికంగా దృఢం చేశాయి. ఏ జట్టులోకి వెళ్లినా అందరిలోకి నేనే చిన్నదాన్ని. అందరూ నన్నొక బేబీలా చూసేవారు. ఆటేదైనా దేశానికి ఆడాలనే లక్ష్యంతోనే ఉండేదాన్ని. ఇప్పటికీ హాకీలోనూ దేశానికి ప్రాధాన్యం వహించాలని ఉంది. అన్నయ్యలతో కలిసి క్రికెట్ చూసేదాన్ని. అలా సచిన్ తెందూల్కర్ ఆటను చూస్తూ పెరిగా. ముంబయిలో సచిన్ ఇంటి వెనకాలే మా ఫ్లాట్ 2011 ప్రపంచకప్ గెలిచిన తర్వాత మా వీధిలో ఆయన్ని చూసేందుకు పెద్ద మొత్తంలో అభిమానులు ఇచ్చారు. నేను మా బాల్కనీ నుంచి చూశా. రోహిత్ శర్మ. మిథాలీ రాజ్‌లకు అభిమానిని. ఇతర క్రీడాకారుల్లో పివి సింధు ఇష్టం. స్మృతి అక్కలాంటిది: ఎప్పుడూ అండగా మనకు ఉండే ఒక వ్యక్తి అవసరం. నా విషయంలో ఆమె స్మృతి మంధాన. మంచి స్నేహితురాలు. తననో అక్కలాగా. నేను తుంటరి పనులు చేస్తే హెచ్చరిస్తుంది. ఆమె భుజంమీద తలపెట్టి ఏడ్చిన సందర్భాలు చాలా ఉన్నాయి. అరుంధతి (రెడ్డి) కూడా మంచి స్నేహితురాలు.



అవకాశాలకు సిద్ధం: టీమ్ నుంచి తప్పించుకున్నప్పుడు కుంగి పోకూడదని ఓ సందర్భంలో సచిన్ చెప్పాడు. అవకాశం రావాలంటే ఏం చేస్తావో అది చెయ్యి. మైదానంలో అడుగుపెట్టి బ్యాటింగ్ ప్రాక్టీసు, రన్నింగ్... ఇలా ఏదో ఒకటి చెయ్యి అంటూ సూచించారు. రోహిత్ భామిని అడిగితే... తర్వాత నిల్వ దక్కించుకోవడానికి, దాన్ని సద్వినియోగం చూడాలి' అని సలహాలు పాటిస్తా. క్రికెట్‌లో నా ప్రదర్శన, ప్రతిభ పరంగా ఇప్పటిదాకా 8085 శాతానికే చేరుకున్నా. త్వరలోనే 100 శాతానికి చేరుకుంటా.

**డబ్ల్యూపీఎల్:** మనదేశంలో మహిళల క్రికెట్ లీగ్(డబ్ల్యూపీఎల్) రావడం... ఎంతో సంతృప్తినిచ్చింది. ఐపీఎల్ వచ్చినప్పట్నుంచీ దీని గురించి చర్చ నడుస్తోంది. మేం టీమ్‌లో ఉండగా డబ్ల్యూపీఎల్ రావడం గొప్ప విషయం. ఇది ఎంతోమంది కల. ఫ్రీగా ఆడటానికైనా రెడీ, అన్నట్లుగా ఉండేది మాకు. లీగ్కు స్పందన కూడా అద్భుతం.

**గిటార్ ఉండాల్సిందే:** ఆటవిడుపు కోసం గిటార్ వాయిస్తా. సంగీతం వింటా. నాతోపాటు ప్రతి పర్యటనకు ఒక చిన్న గిటార్ తీసుకువెళ్తా. తీరిక దొరికినప్పుడు దాన్ని ప్లే చేస్తూ ఫ్రెండ్స్‌లో కాలక్షేపం చేస్తా.

**షవర్మ తినాల్సిందే:** మ్యాచ్‌కు ముందు చీజ్ ఆమ్లెట్, జ్యూస్లు తీసుకుంటా. నేను ఎక్కువగా పర్యటనల్లో ఉంటా. ఇంట్లో ఉంటే బాంద్రాలోని కార్టర్ రోడ్‌లో షవర్మ తినడానికి అన్నయ్యలు, కాజిన్స్‌తో వెళ్తారు. నా కళ సాకారం అయినందుకు సంతోషగా ఉంది. □

# వాల్‌నట్స్‌తో ఆరోగ్య రక్షణ



**గింజధాన్యాలతో** చాలా లాభాలుంటాయని తెలుసుకదా! వాటిలో వాల్నట్స్ మహిళల ఆరోగ్యానికి మరింత మేలు చేస్తుంది. ఎలాగంటే.. వీటిలో వృక్ష ఆధార ఒమేగా3 ఫ్యాటీ ఆమ్లాలు. అధిక మోతాదులో ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు. బరువు నియంత్రణకూ సాయపడతాయి.

◆ క్యాన్సర్ నిరోధంలో వీటి కీలక పాత్ర. ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్ ముప్పును నిలువరిస్తుంది.

◆.వాల్నాట్స్ ఆరోగ్యకరమైన కొవ్వులు, సూక్ష్మ పోషకాలు.. శరీరంలోని అతి పెద్ద అవయవమైన చర్మ ఆరోగ్యానికి సాయపడతాయి.

◆.ఆఫీసులో, ఇంటి దగ్గర రెండు షిఫ్టుల్లో పనిచేసే మహిళలకు నిద్ర తక్కువ. దీనికి నిద్రలేమి సమస్య తోడైతే ప్రమాదం. నిద్ర సరిగ్గా పట్టనివాళ్లు వాల్నట్స్ రాత్రి భోజనం తర్వాత స్నాక్స్‌గా తీసుకుంటే సులభంగా నిద్రలోకి జారుకుని, హాయిగా నిద్రపోతారు.

◆ జీర్ణ వ్యవస్థ సరిగ్గా పనిచేయకపోతే, ఆ ప్రభావం ఆరోగ్యంపైన పడుతుంది. ముఖ్యంగా మహిళల్లో ఇది సంతాన సాఫల్యతపైన ప్రభావం చూపుతుంది. వాల్నట్స్ జీర్ణవ్యవస్థకు కారణంగా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. □

# అపూర్వ స్నేహబంధం



బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో 1975 లో నారాయణగూడ రెడ్డి కాలేజీలో చదువుకున్న స్నేహితులు రాధ 70వ పుట్టిన రోజు సందర్భంగా కలుసుకున్న శశి, ఉమా శశి, అనురాధ మరియు మోహిలరాణిలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

# తెర

# 'ఆంధ్ర కింగ్ తాలూకా' షూటింగ్ పూర్తి



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మోస్ట్ ఎవైటెడ్ యూనిక్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్ర కింగ్ తాలూకా'. పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహేశ్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. అద్భుతమైన ప్రమోషనల్ మెటీరియల్‌తో ఈ సినిమా భారీ బజ్‌ను సృష్టించింది. టైటిల్ గ్లింప్స్, పాటలు, టీజర్ ప్రతి ప్రమోషనల్ కంటెంట్ ఉత్సాహాన్ని పెంచింది. తాజాగా సినిమా షూటింగ్ మొత్తం పూర్తి చేసుకుంది. చివరి పాట చిత్రీకరణతో సినిమా నిర్మాణ పనులు పూర్తయ్యాయి. జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో హైదరాబాద్‌లోని సెట్‌లో రామ్, భాగ్యశ్రీ బోర్సేపై దీనిని చిత్రీకరించారు.

ఈ సందర్భంగా హీరో రామ్ ఒక స్పెషల్ నోట్ షేర్ చేశారు. షూటింగ్ పూర్తయింది. నేను గర్వపడే సినిమా. మనమందరం గర్వపడే సినిమా..! నా కెరీర్‌లో ఈ అందమైన సినిమా ఇచ్చిన మహేష్ కి ధన్యవాదాలు. నవంబర్ 28న ఆంధ్ర కింగ్ తాలూకా మీ ముందుకు వస్తోంది. ఇప్పుడు సినిమా టీమ్ మొత్తం పోస్ట్ ప్రొడక్షన్ పనులు, ప్రమోషనల్ క్యాంపైన్‌పై ఫోకస్ చేస్తోంది. రామ్‌తో పాటు మొత్తం టీం ఈ చిత్రం కోసం చాలా ఉత్సాహంగా పనిచేశారు. కొన్ని సన్నివేశాలు చిత్రీకరించడానికి చాలానే సవాళ్లు ఎదురైనా, వారు ఆ ప్రాసెస్ ఆస్వాదించారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర ఈ సినిమాలో సూపర్‌స్టార్‌గా కనిపించనున్నారు. రావు రమేశ్, మురళీశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వివేక్ మర్విన్ సంగీతం అందిస్తుండగా, సిద్ధార్థ నూని సినిమాటోగ్రఫ, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్‌ను నిర్వహిస్తున్నారు.

'ఆంధ్ర కింగ్ తాలూకా' నవంబర్ 28న థియేటర్లలో విడుదల కానుంది.

తారాగణం: రామ్ పోతినేని, ఉపేంద్ర, భాగ్యశ్రీ బోర్సే, రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, విటివి గణేష్. సాంకేతిక సిబ్బంది: కథ, స్క్రీన్ ప్లే దర్శకత్వం: మహేష్‌బాబు నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ప్రొడక్షన్ హౌస్: మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణ: గుల్షన్ కుమార్, భూషణ్‌కుమార్ గిసిరీస్ ఫిలిమ్స్ సిఇఓ: చెర్రీ, సంగీతం: వివేక్ , మెర్విన్ సినిమాటోగ్రఫీ: సిద్ధార్థనుని, ఎడిటర్: శ్రీకర్‌ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరితుమ్మల, పిఆర్ఓ: వంశీశేఖర్, మార్కెటింగ్: ఫస్ట్ షో.




కృతిశెట్టి

# మోస్ట్ స్టైలిష్ క్లైమాక్స్ ఫైట్ 'మన శంకర వరప్రసాద్ గారు'



మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. వెంకటేష్ ఇటీవలే ఈ సెట్ లో జాయిన్ అయ్యారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మించిన ఈ చిత్రాన్ని శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. ఈరోజు నుండి చిరంజీవి గారు, ఫైటర్స్ బృందం పాల్గొనే స్టైలిష్ క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్‌ను హైదరాబాద్‌లో చిత్రీకరించడం ప్రారంభించారు. ఇది ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా విజువల్‌గా అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ వెంకట్ మాస్టర్ పర్యవేక్షణలో ప్రతి సన్నివేశం గ్రాండ్ గా రూపొందుతోంది. చిరంజీవి గారి చరిష్మా, గ్రేస్, అనిల్ రావిపూడి టచ్ కలిసిన ఈ క్లైమాక్స్ సీక్వెన్స్ ప్రేక్షకులకు మరిచిపోలేని అనుభూతిని అందించనుంది. ప్రస్తుతం చిత్ర నిర్మాణ కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తుండగా, వి.టి.వి. గణేష్ కీలక పాత్రలో కనిపించనున్నారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో సమకూర్చిన ఫస్ట్ సింగిల్ "మీసాల పిల్ల" దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ సమీర్ రెడ్డి, ఎడిటింగ్ తమ్మిరాజు, ఆర్ట్ డైరెక్షన్ ఏ.ఎస్. ప్రకాష్. ఎస్.కృష్ణ, జి.ఆది నారాయణ సహారచయితలు. ఎస్.కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. 2026 సంక్రాంతికి మన శంకర వరప్రసాద్ గారు బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ గా ప్రేక్షకులు ముందుకు రానుంది.

# 'ప్రేమంటే ఫన్' ఫుల్ టీజర్



స్ట్రాంగ్ కంటెంట్ బేస్డ్ సినిమాలు చేస్తున్న ప్రియదర్శి రిఫ్రెషింగ్ రొమాంటిక్ కామెడీ మూవీ ప్రేమంటే తో రాబోతున్నారు. ఆనంది హీరోయిన్‌గా నటిస్తోంది. సుమకనకాల ఒక ముఖ్యమైన పాత్ర చేస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ డైరెక్టర్ గా అరంగేట్రం చేస్తున్నారు. పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నరంగ్ నిర్మాణంలో, శ్రీవెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సమర్పిస్తోంది. దివంగత నారాయణ్ దాస్ నారంగ్ ట్రిబ్యుట్‌గా నిలిచే ఈ చిత్రానికి ఆదిత్య మెరుగు సహ నిర్మాత. ఈ చిత్ర టీజర్‌ను ఈ రోజు లాంచ్ చేశారు. టీజర్‌లో కొత్త పెళ్లి జంట జీవితంలోని సరదా, ప్రేమ, గిల్లికజ్జాల మేళవింపు హిలేరియస్‌గా చూపించారు. పెళ్లి తర్వాత కలల ప్రపంచంలో ఊహించిన ప్రేమకథ, వాస్తవ జీవితంలోని చిన్న చిన్న సమస్యలతో ఎలా మలుపులు తిరుగుతుందో ఆకట్టుకునేలా ప్రజెంట్ చేశారు. ప్రియదర్శి, ఆనంది జంటగా కనిపించి, కొత్త దంపతుల జీవితంలో జరిగే సన్నివేశాలని అలరించేలా చూపించారు. సుమ కనకాల పోలీస్ హెడ్ కానిస్టేబుల్‌గా ఎంట్రీ ఇవ్వడంతో కథలో కొత్త మలుపు వస్తుంది. ఆమె పాత్ర హ్యూమర్ ని మరింత ఎలివేట్ చేసింది. డైరెక్టర్ నవనీత్ శ్రీరామ్ ఈ చిత్రాన్ని సిట్యువేషనల్ హ్యూమర్, మనసుని హత్తుకునే ఎమోషన్స్ తో అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ప్రేమంటే అనే టైటిల్‌కు తగ్గట్లుగానే, ప్రేమలోని కలలు, వాస్తవాల మధ్య తేడాను చూపిస్తూ టీజర్ ప్రేక్షకులను ఇన్సంట్ గా కనెక్ట్ అయ్యింది. ప్రియదర్శి-ఆనంది జంట మధ్య కెమిస్ట్రీ సహజంగా, చూడముచ్చటగా వుంది. సుమ కనకాల ప్రజెన్స్ కట్టిపడేసింది. వెన్నెల కిషోర్ తన సిగ్నేచర్ టచ్‌తో నవ్వులు పంచారు.

# 'ది గర్ల్ ఫ్రెండ్'



రాహుల్

ఈ సినిమాలో విక్రమ్ క్యారెక్టర్ ఎలా ఉండాలో దర్శకుడు రాహుల్ కు పూర్తి క్లారిటీ ఉంది. విక్రమ్ ఎలా ఉంటాడు, అతని బాడీ లాంగ్వేజ్ ఏంటి, ఎలా మాట్లాడుతాడు అనేది రాహుల్ వివరంగా చెప్పేవారు. ఆయనకు ఉన్న క్లారిటీ వల్ల విక్రమ్ క్యారెక్టర్‌ను పర్ ఫార్మ్ చేయడం నాకు ఈజీ అయ్యింది. అనేక లేయర్స్ ఉన్న ఈ పాత్ర కోసం చాలా ప్రిపేర్ అయ్యాను. విక్రమ్ క్యారెక్టర్ లో ఏదో నెగిటివ్ ఉంది, ఇతను టాక్సిక్ బాయ్ ఫ్రెండ్ అనే ఇంప్రెషన్ ట్రైలర్ రిలీజ్ తర్వాత అందరిలో కలుగుతోంది. అయితే విక్రమ్ నెగిటివ్ క్యారెక్టర్ అనేది ఎప్పుడూ ఫీల్ కావొద్దని రాహుల్ చెప్పేవారు. నేను స్టేజ్, ఫిలిం స్కూల్ బ్యాక్ గ్రౌండ్ నుంచి వచ్చాను కాబట్టి ఈ పాత్రకు ఎలా సన్నద్ధమవ్వాలో అలా అయ్యాను. ఏ సినిమా చేసినా స్క్రిప్ట్ నాకు పర్సనల్ గా నచ్చాలని భావిస్తా. ఇప్పటిదాకా మనం ఒక తరహాలో సాగే ప్రేమ కథా చిత్రాల్ని చూసి ఉంటాం. "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా ప్రేమ కథని మరో కోణంలో చూపిస్తుంది. మనం ఎంటర్ టైన్ మెంట్ కోసం సినిమాలు చూస్తుంటాం. కానీ కొన్ని సినిమాల్లోని ఫీల్ మనతో పాటే క్యారీ అవుతుంది. మనం ఆ సినిమా నుంచి ఏదో ఒకటి తీసుకెళ్తాం. అలాంటి సినిమా ఇది. లార్జర్ దేన్ లైఫ్ మూవీస్ చూడటానికి బాగుంటాయి కానీ వాటిని మన రియల్ లైఫ్ తో రిలేట్ చేసుకోలేం. "ది గర్ల్ ఫ్రెండ్" సినిమాలోని పాత్రలు, సందర్భాలు మనం మన లైఫ్ లో రిలేట్ చేసుకునేలా ఉంటాయి. రశ్మిక ఈ సినిమా కోసం ఇచ్చిన ఇంటర్వ్యూస్ లో "ది గర్ల్ ఫ్రెండ్" లాంటి సినిమా కొన్నేళ్ల కిందట తాను చూసి ఉంటే తన జీవితం పట్ల తన దృక్పథం మరోలా ఉండేది అని చెప్పారు. 18 నుంచి 25 ఏళ్ల యూత్ ఈ సినిమా చూస్తే తమ లైఫ్ లో కొన్ని విషయాలు నేర్చుకుంటారు. రశ్మిక పర్ ఫార్మెన్స్ చూశాక "ది గర్ల్ ఫ్రెండ్" సినిమాకు మరో నాయిక న్యాయం చేయలేదేమో అనిపించింది. తను అంత బాగా పర్ ఫార్మ్ చేసింది. మీరు మూవీ చూస్తున్నంత సేపు రశ్మిక కనిపించదు, భూమా అనే పాత్రనే కనిపిస్తుంది.




# మహిళల వరల్డ్ కప్‌లో..
# రన్నింగ్ హీరోయిన్స్
## అగ్రస్థానంలో న్యూజిలాండ్ హాక్లీ
## రెండో ప్లేస్‌లో భారత్ మిథాని

**న్యూఢిల్లీ:** ఐసిసి మహిళల ప్రపంచ కప్ అంటేనే అద్యాంతరం ఉత్కంఠ. పరుగులు, ఫోర్లు, సిక్స్‌లు. ఈ వరల్డ్ కప్ టోర్నీలో అద్భుతమైన బ్యాటింగ్, బౌలింగ్ ప్రదర్శనలు ఉన్నాయి. ఈ నేపధ్యంలో మహిళల వరల్డ్ కప్‌లో అత్యధిక పరుగులు చేసిన టాప్ 10లో భారత్ నుండి ఇద్దరికే అవకాశం లభించింది. వీరిలో మిథాలీ రాజ్ రెండో ప్లేస్‌లో ఉండగా, హర్మన్ ప్రీత్ కౌర్ 9వ స్థానంలో ఉంది. ప్రపంచ కప్ చరిత్రలో న్యూజిలాండ్‌కు చెందిన డిఎ హాక్లీ అత్యధిక పరుగులు సాధించి అగ్రస్థానంలో ఉంది. మహిళల క్రికెట్ చరిత్రలో అత్యంత గౌరవనీయమైన పేర్లలో డెబ్బీ హాక్లీ ఒకరు. హాక్లీ 45 ప్రపంచ కప్ మ్యాచ్‌ల్లో పాల్గొని, 42.88 సగటు మరియు 57.16 స్ట్రైక్ రేట్‌తో 1501 పరుగులు చేసింది. ఆమె రెండు సెంచరీలు చేయగా, అత్యధిక స్కోరు అజేయంగా 100. ఆమె 1500 కంటే ఎక్కువ పరుగులు చేసిన మరియు 40 కంటే ఎక్కువ ప్రపంచ కప్ మ్యాచ్‌లలో కనిపించిన మొదటి మహిళగా నిలిచింది. రెండో స్థానంలో ఉన్న మిథాలీ రాజ్ వన్డే ప్రపంచ కప్‌లలో 38 మ్యాచ్‌ల్లో 47.17 సగటుతో 1321 పరుగులు చేసి, 67.67 స్ట్రైక్ రేట్ కలిగి ఉంది. 109 పరుగుల అత్యధిక స్కోరు మరియు బహుళ మ్యాచ్ విన్నింగ్ హాఫ్ సెంచరీలతో సహా రెండు సెంచరీలతో, ఆమె కీలక టోర్నమెంట్లలో భారత బ్యాటింగ్‌కు గుండెకాయగా నిలిచింది.

ముఖ్యంగా, 2005, 2017 లో భారతదేశాన్ని రెండు ఒఐడి ప్రపంచ కప్ ఫైనల్స్‌కు నడిపించిన ఏకైక భారత కెప్టెన్ (పురుష లేదా మహిళా) మిథాలీ. 2017 ప్రపంచ కప్‌లో, ఆమె 409 పరుగులు చేసి, భారతదేశపు టాప్ స్కోరర్‌గా, టోర్నమెంట్‌లో మొత్తం మీద రెండవ అత్యధిక పరుగులు సాధించిన క్రీడాకారిణిగా నిలిచింది. ఇక 9వ స్థానంలో ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్ వన్డే ప్రపంచ కప్‌లలో భారత్ తరపున అతిపెద్ద మ్యాచ్ విన్నర్లలో ఒకరు. ఆమె 26 మ్యాచ్‌లు ఆడి 22 ఇన్నింగ్స్‌లలో 51.52 సగటుతో 876 పరుగులు చేసింది. ఆమె స్ట్రైక్ రేట్ 94.39 ఆమె ఎంత త్వరగా స్కోర్ చేస్తుందో చూపిస్తుంది. ఆమె మూడు సెంచరీలు మహిళల క్రికెట్‌లో అత్యంత ప్రసిద్ధ నాక్‌లలో ఒకటి.

## ఫుట్‌బాల్ పిఎల్.. మాంచెస్టర్ సిటీపై
# హాలండ్ డబుల్ పవర్



**న్యూఢిల్లీ:** ప్రీమియర్ లీగ్ 2025-26లో బోర్న్‌మోత్‌ను ఓడించి మాంచెస్టర్ సిటీపై హాలండ్ డబుల్ పవర్‌ను సాధించింది. ఈ మ్యాచ్‌లో ఎర్లింగ్ హాలండ్ రెండు గోల్స్‌తో కఠినమైె ముగింపులో మరో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. మాంచెస్టర్ సిటీ 3-1 తేడాతో బోర్న్‌మోత్‌ను ఓడించి ప్రీమియర్ లీగ్‌లో రెండవ స్థానానికి చేరుకుంది. ఎతిహాద్ స్టేడియంలో జరిగిన మొదటి అర్ధభాగంలో విరామ సమయానికి ఈ నార్వేజియన్ రెండుసార్లు గోల్ చేసి, పెప్ గార్డియోలా జట్టుపై 19 పాయింట్లతో ఆధిక్యంలో నిలిచింది. దీంతో ప్రీమియర్ లీగ్ స్కోరింగ్ చార్టులో 10 ఆటల్లో 13 గోల్స్‌తో అగ్రస్థానంలో ఉన్న హాలండ్, 17వ నిమిషంలో ప్రతిష్టంభనను ఛేదించింది. హాఫ్‌వే లైన్ దాటి బంతిని ముందుకు తీసుకెళ్లి, ఆపై గోల్‌పై బారెల్ చేసి జోర్డే పెట్రోవిక్‌ను దాటుకుని గోల్ చేశాడు. 25వ నిమిషంలో బోర్న్‌మోత్ టైలర్ ఆడమ్స్ ద్వారా తిరిగి కొట్టాడు. సిటీ గోల్ కీపర్ జియాన్‌లుయిగి డొన్నరుమ్మ బంతిపై క్లీన్ పంచ్ కొట్టలేకపోవడంతో అది ఆడమ్స్ చేతిలో గోల్‌గా నిలిచింది. ఎనిమిది నిమిషాల తర్వాత హాలండ్ సిటీ గోల్‌తో ఆధిక్యంలోకి వచ్చింది. 60వ నిమిషంలో ఫిల్ ఫోడెన్ ఇచ్చిన పాస్‌ను అందుకున్న నికో ఓఖిరైల్లీ, బాక్స్ లోపలి నుంచి గోల్ కొట్టి సిటీ తరపున మూడో గోల్ చేశాడు.

## ఫిడే ప్రపంచ కప్..
# తొలి రౌండ్‌లో దివ్య ఓటమి



**న్యూఢిల్లీ:** ఫిడే ప్రపంచ కప్ 2025లో భారత్ గ్రాండ్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ మొదటి రౌండ్‌లోనే ఓటమిపాలయింది. వైల్డ్‌కార్డ్ ఎంట్రీ పొందిన దివ్య గోవాలో జరిగిన ప్రపంచ కప్ నుండి మొదటి రౌండ్‌లో వరుసగా రెండో ఓటమితో నిష్క్రమించింది. తొలి గేమ్‌లో తెల్లటి పావులతో ఓడిపోయిన 19 ఏళ్ల దివ్య మహిళల ప్రపంచ కప్ ఛాంపియన్‌కు దాదాపు దూరమైనట్లే. ప్రపంచ కప్ ఛాంపియన్‌లో సజీవంగా ఉండాలంటే గ్రీకు గ్రాండ్ మాస్టర్ స్టామాటిస్ కౌర్కౌలోస్ ఆర్డిటిస్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో విజయం తప్పనిసరి. దేశ్‌ముఖ్ స్టామాటిస్‌ను అధిగమించడానికి తన శాయశక్తులా ప్రయత్నించినా కానీ చివరికి 73మూవ్‌ల మారథాన్ గేమ్‌లో ఓటమిని అంగీకరించాల్సి వచ్చింది, ఎండ్‌గేమ్‌లో ఆమె ప్రత్యర్థి అదనపు బంటు తేడాను తెచ్చిపెట్టింది.

మరోపక్క అనుభవజ్ఞులైన సూర్య శేఖర్ గంగూలీ, గ్రాండ్ మాస్టర్ రౌనక్ సాధ్వానీ, గ్రాండ్ మాస్టర్ కార్తీక్ వెంకట్రామన్ సునాయాస విజయాలు సాధించగా, ఎం ప్రాణేష్ డ్రాగా ఆడి రెండవ రౌండ్‌కు చేరుకున్నాడు. అలాగే ఐఎం అరోన్యక్ ఘోష్ పోలాండ్‌కు చెందిన గ్రాండ్ మాస్టర్ మాటియుజ్ బార్టెల్‌ను ఓడించి మొదటి రౌండ్‌లో ట్రైబ్రేకర్‌ను సాధించాడు. 42 ఏళ్ల గంగూలీ తిరిగి ఆడుతున్నప్పుడు, తొలి ఆటలో ఓడిపోయిన తర్వాత అహ్మద్‌జాదా స్కోరును సమం చేయడానికి రిస్కులు తీసుకోవాల్సి వచ్చింది. కేవలం 28 కదలికల తర్వాత ప్రత్యర్థిని ఓడించి రెండవ రౌండ్‌కు చేరిన మొదటి భారతీయుడు అయ్యాడు.

# చెన్నై ఓపెన్ విజేత జానిస్



**న్యూఢిల్లీ:** చెన్నై ఓపెన్ 2025 విజేతగా జానిస్ ట్జెన్ తొలి డబ్ల్యూటిఎ టైటిల్ గెలుచుకుంది. ఓపెన్ చెన్నైలో జానిస్ తన తొలి డబ్ల్యూటిఎ టూర్ సింగిల్స్ ట్రోఫీతో తన బ్రేక్ అవుట్ సీజన్‌ను ముగించింది. 2002లో పట్టాయా సిటీలో ఏంజెలిక్ విడ్జాజా విజయం తర్వాత ఈ స్థాయిలో మొదటి ఇండోనేషియా ఛాంపియన్‌గా నిలవడం ఇదే మొదటిసారి. సరిగ్గా రెండు గంటల్లో నాల్గవ సీడ్ జెన్ 6-4, 6-3 తేడాతో ఏడో సీడ్ ఆస్ట్రేలియన్ కింబర్లీ బిర్రెల్‌పై గెలిచింది. 3 గంటల 24 నిమిషాల పాటు సెమీఫైనల్‌లో బిర్రెల్ చైనీస్ తైపీకి చెందిన జోవన్నా గార్లాండ్‌ను అధిగమించి, నాలుగు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుంది. థాయిలాండ్‌కు చెందిన లాన్లానా తరారుడీని రెండు గంటల 24 నిమిషాల్లో ఓడించిన జెన్, తన డబుల్స్ డ్యూటీని తన స్వదేశానికి చెందిన అల్దిలా సుట్జియాడితో కలిసి తెల్లవారుజామున 1 గంటలకు పూర్తి చేసింది. ఫైనల్ మొదటి సెట్‌లో, బిర్రెల్ యొక్క దారుణమైన బ్రేక్ పాయింట్ మార్పిడి -12 లో 1 మాత్రమే కావడం విశేషం. ఆమె వెంటనే సర్వ్‌ను వదులుకున్నా కానీ ట్జెన్ ప్రారంభ సర్వీస్ గేమ్‌లో ఆమెకు రెండు బ్రేక్ పాయింట్లు ఉండటంతో వెంటనే సమం చేసే అవకాశం లభించింది. అత్యంత కీలకమైన దశలో ఆమె ట్జెన్‌ను 0-40 నుండి 18 నిమిషాల పాటు సాగిన డ్యూస్‌లోకి లాగింది. ట్జెన్ నుండి డ్రాప్ షాట్‌ను బిర్రెల్ ఏకైక బ్రేక్ పాయింట్‌ను గోల్‌గా మార్చి 3-3తో సమం చేసింది. అయితే 65 నిమిషాల తొలి సెట్‌ను ముగించిన తర్వాత, ట్జెన్ రెండవ సెట్‌లో 4-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మ్యాచ్‌లో నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసిన ట్జెన్ ఎనిమిదో గేమ్‌లో రెండు కీలకమైన మొదటి సర్వ్‌లను కనుగొని బ్రేక్ పాయింట్‌ను కాపాడుకుని 5-3తో విజయం సాధించింది.

# అఫ్ఘానిస్థాన్ విజయం.. జింబాబ్వేపై 3-0తో సిరీస్ కైవసం

**న్యూఢిల్లీ:** ఆఫ్ఘనిస్తాన్ జట్టు జింబాబ్వేను వారి సొంత గడ్డపై ఊడ్చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. జింబాబ్వేలో జరిగిన నామమాత్రపు మూడో మ్యాచ్‌లో 9 పరుగుల తేడాతో ఆఫ్గన్ జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు నష్టానికి 210 పరుగులు చేసింది. ఓపెనర్లు రహ్మానుల్లా గుర్బాజ్ (92), ఇబ్రహీం జద్రాన్ (60) చెలరేగారు. ఆఖర్లో సెదిఖుల్లా అటల్ (35, నాటౌట్) సైతం మ ఎరుపు ఇన్నింగ్స్ ఆడాడు. జింబాబ్వే బౌలర్లలో ఈవాన్స్ 2, నగరవ ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే సైతం అద్భుతంగా పోరాడింది. నిర్ణీత ఓవర్లు బ్యాటింగ్ చేసి 201 పరుగులకు ఆలౌట్ అయింది. సికందర్ రజా (51), బ్రియాన్ బెన్నెట్ (47), ర్యాన్ బర్ల్ (37), ముసేకివా (28) పోరాడారు. ఆఫ్ఘనిస్తాన్ బలర్లలో అహ్మద్ జాయ్ 3, ఫజల్ హాక్ ఫరూఖీ, ఫరీద్ అహ్మద్ మాలిక్ తలో 2 వికెట్లు, ముజీబ్, నబీ చెరో వికెట్ తీశారు. కాగా ఈ సిరీస్‌కు ముందుకు ఇరు జట్లు మధ్య జరిగిన ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో జింబాబ్వే ఇన్నింగ్స్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.





# తులం బంగారం
# రూ.1.23 లక్షలు!
## అదేదారిలో వెండి ధరలూ తగ్గుముఖం



**ముంబయి, నవంబరు 3:** బంగారం ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. డాలర్ విలువ బలపడటం, అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు తగ్గడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపుపై సానుకూల సంకేతాలు వంటి అంశాలు పసిడి ధరల పతనానికి కారణమయ్యాయి. తులం (10 గ్రాములు) 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1.25 లక్షలు దాటి రికార్డు సృష్టించగా, ప్రస్తుతం అది రూ.1.23 లక్షల వద్ద స్థిరపడింది. అక్టోబర్ నెలలో ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరిన తర్వాత ఈ తగ్గుదల నమోదైంది.

రష్యాఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గడం, ట్రంప్‌జిన్‌పింగ్ చర్చలు సానుకూలంగా సాగడం, దేశంలో పండుగల సీజన్ ముగియడం వంటి పరిణామాలు స్వల్పకాలంలో బంగారంపై ప్రతికూల ప్రభావం చూపాయని పీఎల్ క్యాపిటల్ డైరెక్టర్ సందీప్ రైచురా విశ్లేషించారు. గ్లోబల్ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర గరిష్ట స్థాయి నుంచి 4,000 డాలర్ల స్థాయికి పడిపోయిందని వెల్త్ ట్రస్ట్ క్యాపిటల్ సర్వీసెస్ సీఈఓ స్నేహ జైన్ తెలిపారు. డిసెంబర్ నాటికి ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.బంగారంతో పాటు వెండి ధరలు కూడా భారీగా తగ్గాయి. రెండు వారాల పాటు ఒడిదుడుకులకు లోనైన వెండి, ఇప్పుడు స్థిరత్వం దిశగా పయనిస్తోంది. అక్టోబర్‌లో కేజీ వెండి ధర రూ.2 లక్షలు దాటగా, ప్రస్తుతం రూ. 1.66 లక్షలకు తగ్గింది. ఈ ధర మరింత తగ్గే అవకాశం ఉందని స్నేహ జైన్ అభిప్రాయపడ్డారు. అయితే, భవిష్యత్తులో ధరల తగ్గుదల అనేది స్థూల ఆర్థిక డేటాపై ఆధారపడి ఉంటుందని ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ చేసిన వ్యాఖ్యలు లోహాల మార్కెట్‌ను ప్రభావితం చేశాయని వెంచురా కమోడిటీస్ హెడ్ ఎన్ఎస్ రామస్వామి పేర్కొన్నారు. అందువల్ల, పసిడి ధరలలో ఊహించని మార్పులు జరిగే ఆస్కారం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కూడా కీలక నిర్ణయం తీసుకుంది. బంగారం, వెండి బేస్ దిగుమతి ధరలను తగ్గించింది. బంగారం దిగుమతి ధరను 10 గ్రాములకు 42 డాలర్లు, వెండి దిగుమతి ధరను కేజీకి 107 డాలర్ల చొప్పున తగ్గించింది. అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా దేశీయ మార్కెట్లో ధరలను స్థిరంగా ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## ఐటి రిటర్నులు జాప్యం అయితే
# జరిమానాతో చాన్స్




**న్యూఢిల్లీ, నవంబరు 3:** ఆదాయపన్ను రిటర్నుల (ఐటీఆర్) దాఖలు గడువు ముగిసింది. సాంకేతిక కారణాల వల్ల ప్రభుత్వం గడువును సెప్టెంబర్ 16 వరకు పొడిగించినప్పటికీ, చాలామంది ఆ సమయానికి రిటర్నులు సమర్పించలేకపోయారు. అయితే, అలాంటి వారికి ఆదాయపన్ను శాఖ మరో అవకాశం కల్పిస్తోంది. జరిమానాతో కూడిన బిలేటెడ్ రిటర్న్ దాఖలు చేయడానికి ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు గడువు ఉంది. ఆలస్యంగా రిటర్నులు దాఖలు చేసేవారు తప్పనిసరిగా జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 234ఎఫ్ ప్రకారం, పన్ను చెల్లింపుదారుడి వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉంటే రూ.1,000, అంతకు మించితే రూ.5,000 జరిమానా విధిస్తారు. కేవలం జరిమానా మాత్రమే కాకుండా, చెల్లించాల్సిన పన్ను బకాయిలపై సెక్షన్ 234ఏ కింద నెలవారీగా 1 శాతం చొప్పున వడ్డీ కూడా కట్టాల్సి ఉంటుంది. గడువు ముగిసిన నాటి నుంచి రిటర్నులు దాఖలు చేసే తేదీ వరకు ఈ వడ్డీని లెక్కిస్తారని పన్ను నిపుణులు చెబుతున్నారు. జరిమానా, వడ్డీలే కాకుండా ఆలస్యంగా రిటర్నులు దాఖలు చేయడం వల్ల మరికొన్ని నష్టాలు కూడా ఉన్నాయి. గడువులోగా ఫైల్ చేస్తే పన్ను చెల్లింపుదారులు తమకు అనుకూలమైన పాత లేదా కొత్త పన్ను విధానాన్ని ఎంచుకోవచ్చు. కానీ గడువు దాటితే తప్పనిసరిగా కొత్త పన్ను విధానంలోనే రిటర్నులు సమర్పించాల్సి ఉంటుంది. వ్యాపార, మూలధన నష్టాలను తర్వాతి ఆర్థిక సంవత్సరాలకు బదిలీ (క్యారీ ఫార్వర్డ్) చేసుకునే అవకాశాన్ని కూడా కోల్పోతారు. ఇప్పటికే రిటర్నులు దాఖలు చేసి, అందులో ఏవైనా తప్పులు దొర్లినా లేదా కొన్ని ఆదాయ వివరాలను పొరపాటున పేర్కొనకపోయినా వాటిని సరిదిద్దుకునేందుకు రివైజ్డ్ రిటర్న్ దాఖలు చేయవచ్చు. వీటికి కూడా డిసెంబర్ 31 వరకే గడువు ఉంది. ఈ సవరణ రిటర్నులను ఎన్నిసార్లయినా దాఖలు చేసుకోవచ్చు మరియు దీనికి ఎలాంటి జరిమానా ఉండదు. ఈఫైలింగ్ పోర్టల్‌లో లాగిన్ అయి ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. ఒకవేళ డిసెంబర్ 31 గడువును కూడా అందుకోలేకపోతే అప్‌డేటెడ్ రిటర్న్ (ఐటీఆర్‌యూ) ఒక్కటే మార్గం. అసెస్‌మెంట్ సంవత్సరం ముగిసిన 48 నెలల వరకు దీన్ని దాఖలు చేయవచ్చు. అయితే, దీనికి చెల్లించాల్సిన అదనపు పన్ను, జరిమానాలు చాలా ఎక్కువగా ఉంటాయి. ఏదేమైనా, ఆలస్యమైనప్పటికీ రిటర్నులు దాఖలు చేయడం తప్పనిసరి. ఎందుకంటే రుణాలు, వీసా ప్రాసెసింగ్ వంటి వాటికి ఐటీఆర్ పత్రాలు కీలకమైన రుజువుగా పనిచేస్తాయి. రిటర్నులు దాఖలు చేయని వారికి ఆదాయపన్ను శాఖ నుంచి నోటీసులు వచ్చే అవకాశం కూడా ఉంటుంది.

# మిల్లీనియల్స్‌లో కృత్రిమ మేథ భయాలు!

**న్యూఢిల్లీ, నవంబరు 3:** దేశవ్యాప్తంగా కార్యాలయాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వాడకం పెరుగుతున్న నేపథ్యంలో, ఉద్యోగుల్లో కొత్త ఆందోళన మొదలైంది. రానున్న మూడు నుంచి ఐదేళ్లలో ఏఐ కారణంగా తమ ఉద్యోగాలు కోల్పోతామని దేశంలోని దాదాపు 50 శాతం మంది మిల్లీనియల్స్ భయపడుతున్నట్లు గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా సోమవారం ఒక నివేదిక విడుదలచేసింది. పని ప్రదేశాల్లో ఏఐ ప్రభావం, దానికి భారత ఉద్యోగులు ఎలా అలవాటు పడుతున్నారనే అంశంపై ఈనివేదిక సమగ్రంగా విశ్లేషించింది. ఆందోళనలు ఉన్నప్పటికీ, ఉత్పాదకతను, ఆవిష్కరణలను పెంచే సాధనంగా ఏఐను ఉపయోగించుకోవడానికి ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని, వారిలో సానుకూల దృక్పథం పెరుగుతోందని కూడా ఈ నివేదిక పేర్కొంది. ప్రస్తుతం దేశంలోని 54 శాతం ఉద్యోగులు పనిచేస్తున్న సంస్థలు ఏఐను పైలట్ లేదా మధ్యంతర దశలో అమలు చేస్తున్నాయని నివేదిక తెలిపింది. ఇది సాంకేతికత ఆధారిత సమర్థవంతమైన పని వాతావరణం వైపు సాగుతున్న ప్రగతిని సూచిస్తోంది. అయితే, ప్రతి పది మంది ఉద్యోగులలో నలుగురు (40శాతం) తమ ఉద్యోగాలను ఏఐ భర్తీ చేయగలదని భావిస్తున్నారు. ఈ భయం కేవలం యువతకే పరిమితం కాలేదని, అనుభవంతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ఉద్యోగులలోనూ కనిపిస్తోందని నివేదిక స్పష్టం చేసింది. మరో ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఏఐ వల్ల ఉద్యోగం పోతుందని భయపడుతున్న వారిలో 40 శాతం మంది తమ ప్రస్తుత కంపెనీని విడిచి వెళ్లాలని ఆలోచిస్తున్నట్లు తేలింది. ఇది హెచ్ఆర్ విభాగాలకు, కంపెనీల ఉన్నత యాజమాన్యాలకు ఒక తీవ్రమైన సమస్యగా మారుతోంది. ఈ నివేదికపై గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా సీఈఓ బల్బీర్ సింగ్ మాట్లాడుతూ, "సంస్థలు ఏఐ అమలులో ముందుకు సాగుతున్నప్పుడు, మానవ సామర్థ్యాలను దెబ్బతీయకుండా, వాటిని మరింత మెరుగుపరిచే వ్యూహాలను నాయకులు రచించాలి. సంస్థాగత ప్రతిఘటన,ఉద్యోగుల సంసిద్ధత ప్రస్తుతం ఎదురవుతున్న ప్రధాన అడ్డంకులని వివరించారు. ఆసక్తికరంగా ఏఐను ఇంకా ఏమాత్రం అవలంబించని కంపెనీలలో పనిచేస్తున్న 57 శాతం మంది ఉద్యోగులు అభద్రతాభావంతో ఉన్నట్లు నివేదిక గుర్తించింది. అదే సమయంలో ఏఐ వినియోగంలో ఆధునిక దశలో ఉన్న కంపెనీలలో కేవలం 8 శాతం మంది మాత్రమే అభద్రతతో ఉన్నట్లు తేలింది. "సంస్థలు తమ కార్యకలాపాల్లో ఏఐ కోసం వాస్తవ వినియోగాలను గుర్తించి, ఆ కార్యక్రమాలలో ఉద్యోగులను భాగస్వాములను చేయాలి. వారి నైపుణ్యాలను పెంచే కార్యక్రమాలపై పెట్టుబడి పెట్టాలి. అప్పుడే ఈ మార్పును తట్టుకుని నిలబడగలరుని బల్బీర్ సింగ్ సూచించారు.





# టాటాట్రస్ట్ సభ్యునిగా మెహ్లీమిస్త్రీకి ఉద్వాసన
## న్యాయపోరాటానికి దిగిన మిస్త్రీ

**ముంబయి, నవంబరు 3:** టాటా గ్రూప్ దాతృత్వ సంస్థ టాటా ట్రస్ట్స్‌లో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. దివంగత పారిశ్రామిక వేత్త రతన్ టాటా అత్యంత సన్నిహితుల్లో ఒకరైన మెహ్లీ మిస్త్రీకి టాటా ట్రస్ట్స్ నుంచి తొలగించిన విషయం తెలిసిందే. టాటా గ్రూప్‌నకు చెందిన మూడు కీలక దాతృత్వ ట్రస్ట్‌లకు జీవితకాల ట్రస్టీగా మెహ్లీ మిస్త్రీని పునర్నియమించేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం లభించలేదు. టాటా ట్రస్ట్స్ చైర్మన్ నియోల్ టాటా, మరో ఇద్దరు ట్రస్టీలు మిస్త్రీ పునర్నియామకాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో మిస్త్రీ న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. ముంబై ఛారిటీ కమిషనర్ వద్ద కేవియట్ దాఖలు చేసినట్లు తెలిసింది. రతన్ టాటా అత్యంత సన్నిహితుల్లో ఒకరైన మెహ్లీ మిస్త్రీ 2022లో టాటా ట్రస్ట్స్‌కు ట్రస్టీగా నియమితులయ్యారు. అయితే, ఆయన మూడేండ్ల పదవీకాలం గతనెల 28తో ముగిసింది. దీంతో ట్రస్టీగా మెహ్లీ మిస్త్రీ మూడేండ్ల పదవీకాలం ముగుస్తుండటంతో ఆయన పునర్నియామకం చేపట్టారు. ఇందుకోసం అనుమతిని కోరుతూ ఇతర ట్రస్టీలకు టాటా ట్రస్ట్స్ సీఈఓ ఇటీవలే ఒక సర్క్యులర్ పంపారు. అయితే, ఈ ప్రతిపాదనను ట్రస్టీలు నోయల్ టాటా, టీవీఎస్ మోటర్ కంపెనీ చైర్మన్ ఎమిరేట్స్ వేణు శ్రీనివాసన్, రక్షణ శాఖ మాజీ కార్యదర్శి విజయ్ సింగ్‌లు వ్యతిరేకించారు.ఇదేసమయంలో సిటిబ్యాంక్ ఇండియా మాజీ సీఈవో ప్రమిత్‌ఝువేరి,ముంబైకి చెందిన న్యాయవాది డారియస్ ఖంబాట, పుణెకు చెందిన ఫిలంత్రోఫిస్ట్ జహంగీర్ హెచ్‌సీ జహంగీర్‌లు మిస్త్రీకి మద్దతు పలికారు.అయినప్పటికీ మిస్త్రీపునర్నియామకానికి ఆమోదం లభించలేదు.

# వరుస నష్టాలకు బ్రేక్
## బ్యాంకులు, రియాల్టీల మద్దతుతో సెన్సెక్స్, నిఫ్టీ ర్యాలీ

**ముంబయి, నవంబరు 3:** దేశీయ స్టాక్ మార్కెట్లు రెండ్రోజుల వరుస నష్టాలకు సోమవారం బ్రేకులు వేశాయి. తీవ్ర ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో చివరికి స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియాల్టీ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టాలనుంచి సూచీలు కోలుకున్నాయి. సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈసెన్సెక్స్ 39.78 పాయింట్లు లాభపడి 83,978.49 వద్ద స్థిరపడింది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 41.25 పాయింట్ల లాభంతో 25,763.35 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ప్రారంభంలో నష్టాల్లోకి జారుకున్న సెన్సెక్స్, ఆ తర్వాత కోలుకుని ఒక దశలో 84,127 గరిష్ఠ స్థాయిని కూడా తాకింది. నిఫ్టీ రోజంతా 25,700 నుంచి 25,800 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. 25,66025,700 స్థాయి వద్ద బలమైన మద్దతు లభించడంతో నష్టాల నుంచి బయట పడింది. కీలక అంతర్జాతీయ గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో మార్కెట్ సానుకూలంగానే ఉందని వారు విశ్లేషించారు. సెన్సెక్స్ స్టాక్స్‌లో మారుతీ సుజుకీ 3 శాతానికి పైగా నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. టైటాన్ కంపెనీ, బీఈఎల్, టీసీఎస్, ఐటీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా స్టీల్ వంటి షేర్లు కూడా నష్టపోయాయి. మరోవైపు, మహీంద్రా అండ్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టాటా మోటార్స్, హెచ్‌సీఎల్ టెక్ ప్రధాన లాభాల్లో కొనసాగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.77 %, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.72 చొప్పున లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 1.92 % పెరిగి ర్యాలీకి నాయకత్వం వహించింది. బ్యాంక్ ఆఫ్ బరోడా 5 % మేర లాభపడగా, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా లాభాల్లో ముగిశాయి. మెటల్, రియాల్టీ సూచీలు కూడా 2% వరకు పెరిగాయి. దేశీయంగా కొత్త సానుకూల అంశాలు ఏవీ లేకపోవడంతో అధిక స్థాయిల వద్ద ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారని, అయినప్పటికీ కొన్ని రంగాలలో కొనుగోళ్ల మద్దతుతో మార్కెట్లు గ్రీన్‌లో ముగిశాయని నిపుణులు అభిప్రాయపడ్డారు.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.